

'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 183

శుక్రవారం 23-9-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

దేశంలో ఎక్కడా, గతంలో ఎన్నడూ లేని విధంగా జగనన్న ప్రభుత్వం చేపట్టిన అక్కచెల్లెమ్మలకు చేయూత కార్యక్రమం..
తద్వారా జీవనోపాధి కల్పన.. పేద అక్క చెల్లెమ్మలకు సాధికారత, ఆర్థిక స్వావలంబన చేకూరుస్తూ..

జగనన్న ప్రభుత్వం ★ మేనిఫెస్టోలో చెప్పిన 98.44% హామీలు అమలు చేశాం, చేస్తున్నాం ★ JAGANANNA GOVERNMENT



వరుసగా మూడో ఏడాది..

వైఎస్సార్ చేయూత

మారుతున్న అక్కచెల్లెమ్మల భవిత...

రాష్ట్రవ్యాప్తంగా **26,39,703** మంది అక్కచెల్లెమ్మలకు రూ. **4,949.44** కోట్ల ఆర్థిక సాయాన్ని చిత్తూరు జిల్లా **కుప్పం** లో **నేడు** బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..

45 నుండి 60 ఏళ్ల మధ్య వయస్సు గల ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు ఒక తోడబుట్టిన అన్నలా, తమ్ముడిలా తోడుగా ఉంటూ, వారిని చేయి పట్టుకొని నడిపిస్తూ.. "వైఎస్సార్ చేయూత" ద్వారా ఏటా రూ. **18,750** ల చొప్పున క్రమం తప్పకుండా వరుసగా నాలుగేళ్లలో అదే అక్కచెల్లెమ్మలకు మొత్తం రూ. **75,000** ఆర్థిక సాయం అందించడంతో పాటు వారికి జీవనోపాధి మార్గాలను సైతం చూపిస్తూ అండగా నిలబడుతున్న జగనన్న ప్రభుత్వం..

రాష్ట్ర వ్యాప్తంగా **26,39,703** మంది పేద అక్కచెల్లెమ్మలకు తద్వారా కోటి మంది జనాభాకు మేలు కలిగిస్తూ.. "వైఎస్సార్ చేయూత" క్రింద నేడు అందిస్తున్న రూ. **4,949.44** కోట్లతో కలిపి ఇప్పటివరకు మన జగనన్న ప్రభుత్వం అందించిన మొత్తం సాయం రూ. **14,110.62** కోట్లు.. క్రమం తప్పకుండా వరుసగా మూడేళ్లలో అర్హులైన అదే పేద అక్కచెల్లెమ్మలకు నేడు అందిస్తున్న సాయంతో కలిపి ఒక్కొక్కరికి ఇప్పటికే అందించిన ఆర్థిక సాయం రూ.**56,250..**

1

"వైఎస్సార్ చేయూత" ద్వారా పొందే డబ్బును ఉపయోగించుకోవడంలో అక్కచెల్లెమ్మలకు పూర్తి స్వేచ్ఛ.. దీన్ని చిన్న, మధ్య తరహా వ్యాపారాలను నడుపుకోవడానికి, మరే ఇతర అవసరాలకు లేదా జీవనోపాధి కార్యక్రమాలకు వినియోగించుకునేందుకు పూర్తిగా వారికే వెసులుబాటు కల్పిస్తున్న జగనన్న ప్రభుత్వం...

2

...ఇది కాక ఆసక్తి కనబరిచిన అక్కచెల్లెమ్మలకు సాంకేతిక, బ్యాంకింగ్, మార్కెటింగ్ సహకారాలు అందించి, కిరాణా షాపులు, గేదెలు, ఆవులు, మేకలు వంటి అనేక జీవనోపాధి మార్గాలను సైతం చూపిస్తూ, వ్యాపార అవకాశాలు పెంచేందుకు దిగ్గజ సంస్థలు, బ్యాంకులతో టైఅప్ చేయించి చేయూతనిస్తూ వారిని నడిపిస్తున్న మన జగనన్న ప్రభుత్వం..



శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

3

45-60 ఏళ్ల మధ్య వయస్సు గల పేద ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు "వైఎస్సార్ చేయూత" ద్వారా లబ్ధి.. ఇక ఎలాగూ 60 ఏళ్ళు నిండిన అర్హులైన వారికి "వైఎస్సార్ పెన్షన్ కానుక" ద్వారా ప్రతి నెల మొదటి తారీఖునే ఠంఛన్‌గా పింఛన్.. అమ్మ కడుపులోని బిడ్డ నుండి.. ఆప్యాయంగా ఆశీర్వదించే అవ్వల వరకు.. అక్కచెల్లెమ్మలకు అన్ని దశల్లోనూ అండగా నిలిచి ఆదుకుంటున్న జగనన్న ప్రభుత్వం...









Amul | Reliance | P&G | SBI | Indian Bank

- కిరాణా దుకాణాలు ఏర్పాటు చేసుకున్న అక్కచెల్లెమ్మలకు ITC, HUL, P&G, RELIANCE లాంటి దిగ్గజ కంపెనీలతో టైఅప్ చేయించి మార్కెట్ రేటు కంటే తక్కువ ధరకే నాణ్యమైన సరుకులు, మార్కెటింగ్ లో శిక్షణ ఇవ్వడంతో పాటు బ్యాంకుల నుండి రుణాలు పొందేలా అనుసంధానం చేసి వారు రిస్క్ లేకుండా వ్యాపారం చేసుకునేలా ప్రోత్సహిస్తున్న జగనన్న ప్రభుత్వం.. తద్వారా అక్కచెల్లెమ్మలు నెలకు రూ. 7,000 నుండి రూ.10,000ల వరకు అదనపు ఆదాయం అందుకుంటున్నారు..
- పాడి గేదెలు, ఆవులు కొనుగోలు చేసుకోవడానికి ఆర్థిక సహాయం.. **AMUL** తో భాగస్వామ్యం ద్వారా ఇప్పుడు మార్కెట్ లో ఇస్తున్న రేటు కన్నా లీటర్ పాలపై రూ. 5 నుండి రూ.15 వరకు అదనపు ఆదాయం..
- ఇప్పటి వరకు 1,10,000 మంది అక్కచెల్లెమ్మలు కిరాణా దుకాణాలు.. 60,995 మంది అక్కచెల్లెమ్మలు వస్త్ర వ్యాపారం.. 2,96,221 మంది అక్కచెల్లెమ్మలు ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల పెంపకం.. 1,15,446 మంది అక్కచెల్లెమ్మలు ఇతర జీవనోపాధులు చేపట్టి వారి కుటుంబ ఆదాయాన్ని పెంపొందించుకున్నారు. ఇప్పటికే మొత్తం 5,82,662 మంది అక్కచెల్లెమ్మలకు పై మార్గాలతో జీవనోపాధి కల్పించిన మన ప్రభుత్వం..
- అక్కచెల్లెమ్మలకు జీవనోపాధి కల్పించడం కోసం ఇప్పటికే స్త్రీనిధి, బ్యాంకులు మరియు సంఘాల నుండి రుణాలు పొందేలా అనుసంధానం చేసి రూ. 4,369.96 కోట్లకు పైగా రుణాలు అందించిన జగనన్న ప్రభుత్వం..
- ప్రతి మండలానికి ఒక వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ ఏర్పాటు ద్వారా అక్కచెల్లెమ్మలకు తక్కువ ధరకే నాణ్యమైన సరుకులు అందించడంతో పాటు మార్కెటింగ్ లో శిక్షణ ఇచ్చి వారిని వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దుతున్న జగనన్న ప్రభుత్వం..



థాంక్యూ జగనన్న..!!

వివిధ పథకాల ద్వారా అక్కచెల్లెమ్మలకు ఇప్పటి వరకు మన జగనన్న ప్రభుత్వం అందించిన లబ్ధి...

పథకం పేరు	లబ్ధిదారులు	లబ్ధి మొత్తం (రూ. కోట్లలో)
DBT (Direct Benefit Transfer)		
జగనన్న అమ్మ ఒడి	44,48,865	19,617.53
వైఎస్సార్ కాపు నేస్తం	4,25,632	1,492.00
వైఎస్సార్ చేయూత	26,39,703	14,110.62
వైఎస్సార్ సున్నా వడ్డీ (SHG)	1,02,16,410	3,615.28
వైఎస్సార్ నేతన్న నేస్తం	33,464	177.00
వైఎస్సార్ ఆసరా	78,74,438	12,757.97
వైఎస్సార్ పెన్షన్ కానుక	42,07,656	38,044.77
వైఎస్సార్ రైతు భరోసా	22,00,853	8,225.57
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	6,65,635	1,453.61
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు	7,16,313	181.56
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	5,19,973	488.46
వైఎస్సార్ మత్స్యకార భరోసా	2,294	7.98
జగనన్న వసతి దీవెన	18,77,863	3,349.57
జగనన్న విద్యా దీవెన	24,74,544	8,365.26
వైఎస్సార్ వాహన మిత్ర	30,452	114.69
వైఎస్సార్ లా నేస్తం	721	8.49
MSME	14,123	759.58
అర్చకులు/ఇమామ్‌లు/మౌజమ్‌లు/పాస్టర్లు	3,561	1.87
జగనన్న చేదోడు (రజకులు, దర్జీలు, నాయీ బ్రాహ్మణులు)	1,51,105	265.32
వైఎస్సార్ బీమా	67,500	1,091.35
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	5,14,888	286.96
వైఎస్సార్ EBC నేస్తం	3,97,238	595.86
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	9,27,540	2,655.66
DBT మొత్తం	**4,04,10,771**	**1,17,666.96**
Non - DBT		
జగనన్న తోడు	11,72,775	1,606.47
జగనన్న గోరు ముద్ద	21,63,391	1,558.72
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	15,38,247	2,108.96
వైఎస్సార్ - జగనన్న ఇళ్ల పట్టాలు	30,76,018	61,520.36
నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళు	21,26,176	53,296.00
జగనన్న విద్యా కానుక	25,13,845	1,255.93
Non - DBT మొత్తం	**1,25,90,452**	**1,21,346.44**
మొత్తం (DBT + Non - DBT)	**5,30,01,223**	**2,39,013.40**

పేద అక్కచెల్లెమ్మల చేతిలో డబ్బులు పెడితే వారి కుటుంబానికి మంచి జరుగుతుందని, వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయన్న మంచి ఉద్దేశ్యంతో.. అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు వివిధ పథకాల ద్వారా **5,30,01,223** మంది* అక్కచెల్లెమ్మలకు మన జగనన్న ప్రభుత్వం అందించిన లబ్ధి అక్షరాల రూ. **2,39,013.40** కోట్లు..

*గమనిక - ఒక్కో అక్కచెల్లెమ్మ ఒకటి కంటే ఎక్కువ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రాతిపదికన.

డా॥ ఆదిమూలపు సురేష్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామాత్యులు

శ్రీ. బూడి ముత్యాల నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు

గమనిక : రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారు 23 సెప్టెంబర్, 2022 ఉదయం 11 గంటలకు చిత్తూరు జిల్లా కుప్పంలో బటన్ నొక్కి వైఎస్సార్ చేయూత ఆర్థిక సాయాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తారు. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్ల లైవ్ లో వీక్షించవచ్చు.

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

II సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శుక్రవారం II 23-9-2022

ఫ్యాషన్

కిచెన్ టిప్స్

స్టీల్ పాత్రలు పాతబడినట్లుగా అనిపిస్తే... కొద్దిగా టూత్‌పేస్టుని స్టీల్ పాత్రకు రాసి పాత టూత్‌బ్రష్‌తో రుద్దాలి. కొన్ని చుక్కలు నీళ్లు పోసి రుద్ది, వస్త్రంతో తుడిస్తే కొత్తవాటిలా తళతళా మెరుస్తాయి.

పాతబడిపోయిన వెండిసామాన్లను కూడా ఇదేవిధంగా టూత్‌బ్రష్‌తో రుద్దితే మురికి అంతా పోయి కొత్తవాటిలా కనిపిస్తాయి.



డ్రెస్సింగ్ టేబుల్ మిర్రర్, చిన్న అద్దాలు మురికి పట్టి సరిగా కనిపించకపోతే కొద్దిగా టూత్‌పేస్టువేసి రుద్ది, వస్త్రంతో తుడిస్తే దుమ్ముధూళి, మరకలు పోయి అద్దం స్పష్టంగా కనిపిస్తుంది.

మిరియాలు, ఉల్లిపాయ, వెల్లుల్లిని సమపాళ్ల లో తీసుకుని కొద్దిగా నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరువాత ఈ మిశ్రమాన్ని వడగట్టి స్ప్రే బాటిల్‌లో పోసుకుని దీనిని బల్లులున్న ప్రాంతంలో స్ప్రే చేస్తే ఆ వాసనకు బల్లులు పారిపోతాయి.



బ్యూటిప్





రెండు టేబుల్ స్పూన్ల బియ్యప్పిండిలో టీస్పూను తేనె, టీస్పూను రోజ్ వాటర్ వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లైచేసి పదిహేను నిమిషాల పాటు అలాగే ఉండనివ్వాలి. బాగా ఆరిన తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఈ ప్యాక్‌ను వారానికి ఒకసారి వేసుకోవడం వల్ల ముఖం మీద పేరుకుపోయిన ట్యాన్ తగ్గుముఖం పడుతుంది. రోజ్ వాటర్ ముఖానికి సహజసిద్ధ నిగారింపుని ఇస్తే, తేనె చర్మానికి తేమనందిస్తుంది.











దాండియా నృత్యాల్లో మెరుపులు
దారపు పోగుల అల్లికలో రంగుల హంగులు
గోటాపట్టీ బ్యాంగిల్స్‌లో అద్దాలు అమరికలు
వెండితీగల జిలుగుల్లో వెన్నెల చంద్రికలు
నవరాత్రుల్లో అలంకరణకు
ప్రత్యేకంగా నిలిచే ఆభరణాల మాలికలివి..

నవరాత్రి స్పెషల్


అద్దమే ఆభరణం













నవరాత్రి రోజులు అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు ఉంటాయి. అలాగే, అతివలు కూడా అంతే అందంగా తమను తాము అలంకరించుకుంటారు. ఎరుపు, పసుపు, పచ్చలతో కాంతిమంతంగా ఉండే రంగు దుస్తులను ఎంచుకుంటారు. వీటితో పాటు అందరిలో వేడకకు తగినట్టుగా ప్రత్యేకంగా కనిపించాలంటే ఎంపిక చేసుకునే ఆభరణాల్లో స్పెషాలిటీ ఉండాలి. నవరాత్రుల్లో వైవిధ్యంగా వెలిగిపోవడానికి అద్దాలతో అమర్చిన థ్రెడ్ బ్యాంగిల్స్, సిల్వర్‌తో కూర్చిన ఆఫ్ఘనీ సెట్స్, గోటాపట్టీతో చేసిన మిర్రర్ వర్క్ ఆభరణాలు సరైన ఎంపిక జాబితాలో ఉన్నాయి. వంద రూపాయల నుంచి వేల రూపాయల వరకు ఈ ఆభరణాలను అన్ని వయసుల వారూ ధరించవచ్చు. అభిరుచిని బట్టి డిజైన్స్ ఎంపిక చేసుకోవచ్చు.







అదర్ సైడ్

స్టూడెంట్ నంబర్‌వన్

– బ్యాక్ టు స్కూల్

'టైమెక్కడ ఉంది' అని చీటికిమాటికి అంటే టైమ్ చిన్నబుచ్చుకుంటుందట.
'టైమ్ నాతోనే ఉంటుంది' అనుకుంటే బలాన్ని ఇస్తుందట.
సినీ నిర్మాత, ఇంటీరియర్ డిజైనర్, కాలమిస్ట్, పుస్తక రచయిత్రి, గృహిణిగా రకరకాల బాధ్యతలు నిర్వహిస్తున్న ట్వింకిల్ ఖన్నా మరోసారి స్టూడెంట్‌గా మారబోతోంది.
'యూనివర్శిటీ ఆఫ్ లండన్'లో ఫిక్షన్ రైటింగ్‌లో మాస్టర్స్ చేయడానికి రెడీ అవుతోంది...



● ట్వింకిల్ ఖన్నా

'అమ్మా, నీకు ట్వింకిల్ అని ఎందుకు పేరు పెట్టారు?' అని అడిగింది నాలుగేళ్ల కూతురు.

'నేను లిటిల్‌స్టార్‌ని కాబట్టి' అని జవాబు చెప్పింది ట్వింకిల్.

ఇది విని కూతురు నవ్వేసింది.

ఇంట్లోనే కాదు పుస్తక ప్రపంచంలో కూడా నవ్వుల వెన్నెల కురిపిస్తుంది ట్వింకిల్ ఖన్నా. కథానాయికగా మాత్రమే కాదు కాలమిస్ట్, పుస్తక రచయిత్రిగా కూడా ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. ట్వింకిల్ రాసిన 'మిసెస్ ఫన్నీబోన్స్' పుస్తకం బెస్ట్ సెల్లర్ చార్ట్‌లో నెంబర్‌వన్‌గా నిలిచింది.

'అన్ని వయసుల వారిని, అన్ని వర్గాల వారిని ఆకట్టుకున్న పుస్తకం ఇది' అని ప్రశంసించారు పెంగ్విన్ ర్యాండమ్ హౌజ్ ఎడిటర్ ఇన్ చీఫ్ మిలీ ఐశ్వర్య.

మరో పుస్తకం 'పైజామాస్ ఆర్ ఫర్‌గివింగ్' కూడా సూపర్ డూపర్ హిట్ అయింది. 'హైయెస్ట్–సెల్లింగ్ ఫిమేల్ ఆథర్' సింహాసనంలో తనను కూర్చోబెట్టింది.

నవ్వించడం ఎంత కష్టమో, నవ్వించడం ద్వారా వచ్చే కష్టాలు కూడా అంతే కష్టమని అనుభవపూర్వకంగా తెలిసొచ్చింది ట్వింకిల్‌కు. 'నన్ను ఉద్దేశించే రాసింది' అని ఎంతోమంది భుజాలు తడుముకునేవారు!

వినోదమాధ్యమాలు ఎన్ని పెరిగినప్పటికీ, ఇప్పటికీ పుస్తకాలు అంటేనే ఆమెకు ఎక్కువ ఇష్టం. మనసు బాగలేనప్పుడు, ఉత్సాహం కావాలనుకున్నప్పుడు ట్వింకిల్ పుస్తకప్రపంచంలోకి వెళుతుంది. ప్రతి పుస్తకం ఒక నేస్తం అవుతుంది.

తనలో కొత్త ఎనర్జీ, ఉత్సాహం వస్తాయి.

'మహిళా రచయితలకు ఎదురయ్యే సవాలు ఏమిటి?' అనే ప్రశ్నకు–

'రచన గురించి ఆలోచించే క్రమంలో తనదైన ఊహాప్రపంచంలో, రకరకాల క్యారెక్టర్ల మధ్య ఉండాల్సి వస్తుంది. ఇదే సమయంలో వాస్తవ ప్రపంచంలోకి వచ్చి ఇంటిపనులు, పిల్లల బాధ్యత చూసుకోవాల్సి ఉంటుంది. రెండిటినీ సమన్వయం చేసుకోవడమే అసలైన సవాలు' అంటుంది ట్వింకిల్.

రచయిత్రిగా ట్వింకిల్ ఖన్నాకు బోలెడు పేరు వచ్చింది. ఈ దశలో 'నాకు రాయడం వచ్చేసింది. ఏమీ నేర్చుకోనక్కర్లేదు' అనుకుంటారు చాలామంది. అయితే ట్వింకిల్ అలా అనుకోవడం లేదు.

'నేను నేర్చుకోవాల్సింది చాలా ఉంది' అని మాత్రమే అనుకుంటుంది.

అందుకే క్రియేటివ్ రైటింగ్‌లో శిక్షణ పొందడానికి 'యూనివర్శిటీ ఆఫ్ లండన్'లోకి స్టూడెంట్‌గా అడుగుపెట్టబోతుంది.

'మరోసారి స్టూడెంట్‌గా మారుతున్నందుకు సంతోషంగా ఉంది. కొత్త ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నాను. చిన్నప్పటిలాగే శ్రద్ధగా క్లాసులు వినబోతున్నాను. నోట్స్ రాసుకోబోతున్నాను' అంటూ అభిమానులతో తన సంతోషాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది ట్వింకిల్.

దీంతోపాటు హుషారెత్తించే, ఉత్సాహంతో జంప్ చేస్తున్న వీడియోను షేర్ చేసింది.

నిజానికి ఆ వీడియోలో ట్వింకిల్‌ఖన్నా కనిపించడం లేదు. చదువు దాహంతో ఉన్న ఒక సిన్సియర్ స్టూడెంట్ కనిపిస్తుంది.

'నేర్చుకోవాలనే తపన మనల్ని ముందుకు తీసుకువెళుతుంది' అనే మాట కాస్త గట్టిగానే వినిపిస్తుంది!

వంటిల్లు

రుచిలో... సొరగమే

అధిక బరువుని తగ్గించుకోవడానికి ఎంచుకునే ఆహారాల్లో సొరకాయ ఒకటి. రుచిలో కాస్త చప్పగా ఉండే సొరకాయను తినడానికి అందరూ అంతగా ఇష్టపడకపోవచ్చు. అయితే, తయారీలో చిన్న మార్పులు చేసుకుంటే, సొరకాయను సొరగానికి కాస్తదూరంలో ఉండేలా టేస్టీగా ఎలా వండవచ్చో చూద్దాం...

బీట్‌రూట్ లౌకి మురియా



కావలసినవి: సొరకాయ తురుము – ఒకటిన్నర కప్పులు, బీట్‌రూట్ తురుము – అరకప్పు, ఉల్లిపాయ తరుగు – పావు కప్పు, గోధుమ పిండి – అరకప్పు, శనగపిండి – అరకప్పు, సూజీ రవ్వ – కప్పు, పసుపు – అరటీస్పూను, ఇంగువ – పావు టీస్పూను, వంటసోడా – పావు టీస్పూను, జీలకర్ర – అరటీస్పూను, సోంపు – అరటీస్పూను, పంచదార – టీస్పూను, అల్లంపేస్టు – టీస్పూను, పచ్చిమిర్చి – నాలుగు(సన్నగా తరగాలి), కొత్తిమీర తరుగు – మూడు టేబుల్ స్పూన్లు, నిమ్మ రసం – టీస్పూను, ఉప్పు – రుచికి సరిపడా, నూనె టీస్పూను

తాలింపు కోసం: నూనె – మూడు టీస్పూన్లు, ఆవాలు – అరటీస్పూను, నువ్వులు – రెండు టీస్పూన్లు.

తయారీ: ● ఉల్లిపాయ, బీట్‌రూట్, సొరకాయ తురుములను గిన్నెలో వేసి... శనగపిండి, పసుపు, ఇంగువ, ఉప్మారవ్వ, జీలకర్ర, సోంపు, పంచదార, అల్లంపేస్టు, పచ్చిమిర్చి తరుగు, వంటసోడా, కొత్తిమీర, నిమ్మరసం, టీస్పూను నూనె, రుచికి సరిపడా ఉప్పు వేసి ముద్దలా కలపాలి ● ఈ పిండిని ట్రేలో దిబ్బరొట్టిలా పరుచుకుని ఆవిరి మీద ఇరవై నిమిషాలు ఉడికించాలి ● ఉడికిన తరువాత ఐదు అంగుళాల ముక్కలుగా కట్ చేయాలి ● తాలింపు కోసం తీసుకున్న దినుసులతో తాలింపు వేసి ముక్కల మీద చల్లుకుని వేడివేడిగా సర్వ్‌చేసుకోవాలి ● ముఠియాలు మరింత క్రిస్పీగా కావాలనుకుంటే ఆవిరి మీద ఉడికిన తరువాత డీప్ ఫ్రై చేసుకుని కూడా తినవచ్చు.

సొరకాయ ఖీమా



కావలసినవి: మటన్ ఖీమా – అరకేజీ, సొరకాయ – అరకేజీ (తొక్కతీసి ముక్కలు తరగాలి), ఉల్లిపాయలు – రెండు, ఉప్పు – టీస్పూను, ఎర్ర క్యాప్సికం పేస్టు – టీస్పూను, పసుపు – టీస్పూను, మిరియాలపొడి టీస్పూను, అల్లం వెల్లుల్లి పేస్టు – టీస్పూను, అల్లం – అంగుళం ముక్క, జీలకర్ర – టీస్పూను, టొమాటోలు – నాలుగు(సన్నగా తరగాలి), పచ్చిమిర్చి – ఐదు, కొత్తిమీర, పుదీనా తరుగు –రెండు టేబుల్ స్పూన్లు, నూనె – అరకప్పు.

తయారీ: – ఖీమాను శుభ్రంగా కడిగి, సొరకాయ ముక్కలు వేసి నీళ్లు ఇగిరిపోయేంత వరకు ఉడికించి పక్కన పెట్టుకోవాలి – స్టవ్ మీద బాణలి పెట్టి నూనెవేయాలి. నూనె బాగా మరిగాక ఉల్లిపాయలను ముక్కలు తరిగి వేయాలి – ఉల్లిపాయ వేగాక పసుపు, అల్లం వెల్లుల్లి పేస్టు, క్యాప్సికం పేస్టు వేసి ఐదు నిమిషాలు వేయించాలి – ఇవన్నీ వేగాక ఉడికించిన ఖీమా మిశ్రమం వేసి పదినిమిషాలు నూనెలో వేయించాలి – ఇప్పుడు టొమాటో ముక్కలు, రుచికి సరిపడా ఉప్పువేసి కలపాలి – టొమాటో ముక్కలు మగ్గాక, మిరియాలపొడి, జీలకర్ర, అల్లాన్ని సన్నగా తరిగి వేయాలి – రెండు నిమిషాలు వేగాక కొత్తిమీర, పుదీనా తరుగు, పచ్చిమిర్చిని సన్నగా తరిగి వేసి ఐదునిమిషాలు పాటు వేయించి దించేయాలి. అన్నం, చపాతీల్లోకి ఈ ఖీమా చాలా బావుంటుంది.

లౌ చింగ్రీ



కావలసినవి: పచ్చిరొయ్యలు – పావుకేజీ, సొరకాయ – కేజీ(తొక్కతీసి చిన్నముక్కలుగా తరుక్కోవాలి) అల్లం పేస్టు – అరటీస్పూను, పచ్చిమిర్చి – మూడు, జీలకర్ర – అర టీస్పూను, ఎండు మిర్చి – రెండు, బిర్యానీ ఆకు – ఒకటి, పసుపు – టీస్పూను, కారం – అరటీస్పూను, జీలకర్ర పొడి – అరటీస్పూను, పంచదార – రెండు టీస్పూన్లు, ఉప్పు – రుచికి సరిపడా, ఆవనూనె – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ: – రొయ్యలను శుభ్రంగా కడిగి అర టీస్పూను ఉప్పు, అర టీస్పూను పసుపువేసి కలిపి పదినిమిషాలు పక్కన పెట్టుకోవాలి – బాణలిలో ఆవనూనె వేసి కాగనివ్వాలి. మరిగిన నూనెలో రొయ్యలు వేసి రెండు నిమిషాలు వేయించాలి. రొయ్యలను రెండు వైపులా వేయించి తీసి పక్కన పెట్టుకోవాలి – ఇదే బాణలిలో ఎండుమిర్చి, బిర్యానీ ఆకు, జీలకర్ర వేసి వేయించాలి – ఇవి వేగాక సొరకాయ ముక్కలు వేసి ఒకసారి కలిపి ఐదు నిమిషాలు మూతపెట్టి మగ్గనివ్వాలి – ఇప్పుడు అల్లం పేస్టు వేసి పచ్చివాసన పోయేంత వరకు సన్నని మంట మీద మగ్గనివ్వాలి – ఐదు నిమిషాలు తరువాత రుచికి సరిపడా ఉప్పు, పసుపు, కారం వేసి తిప్పి సన్నని మంట మీద మగ్గనివ్వాలి – పదినిమిషాల తరువాత పచ్చిమిర్చి వేసి ఉడికించాలి – ఇప్పుడు జీలకర్రపొడి, పంచదార, వేయించిన రొయ్యలు వేసి తిప్పి మరో ఐదు నిమిషాలు మగ్గనిచ్చి దించేయాలి. అన్నం, చపాతీల్లోకి లౌచింగ్రీ మంచి సైడ్ డిష్.

ఇన్‌స్టంట్ బర్ఫీ



కావలసినవి: పంచదార – ఒకటింబావు కప్పులు, సొరకాయ తురుము – ఐదు కప్పులు, నెయ్యి – అరకప్పు, పాలపొడి – కప్పు, యాలుకుల పొడి – అర టీస్పూను, పిస్తాపలుకులు – అరకప్పు.

తయారీ: – కుకర్ గిన్నెలో పంచదారను పొరలా వేయాలి. దీనిపైన సొరకాయ తురుముని పరచాలి. ఈ రెండింటిని కలపకూడదు – కుకర్ గిన్నె మూతపెట్టి ఐదు నిమిషాలు పెద్ద మంటమీద ఉడికించాలి – ఐదు నిమిషాల తరువాత మంటను ఆపేసి కుకర్ ప్రెజర్‌ను విడుదల చేసి మూత తీయాలి. ఇప్పుడు నెయ్యి, పాలపొడి, యాలకుల పొడి వేసి కలపాలి – కుకర్ గిన్నెను సన్నని మంట మీద పెట్టి మరో పదినిమిషాలపాటు కలుపుతూ ఉడికించాలి – నెయ్యి పైకి తేలేంతవరకు సిమ్‌లో ఉంచి అడుగంటకుండా కలుపుతూ ఉడికిన తర్వాత దించేయాలి – ఒక ప్లేటుకి కొద్దిగా నెయ్యిరాసి ఉడికిన మిశ్రమాన్ని పోయాలి. దీనిమీద పిస్తా పలుకులు వేసి చల్లారనివ్వాలి. చల్లారాక ముక్కలు కోసి సర్వ్ చేసుకోవాలి.

శుక్రవారం 23-9-2022



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 183

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	337	59,120
నిఫ్టీ ▽	89	17,630

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	11,099	▽	121
డోజోన్స్	30,073	▽	111
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,160	▽	78
డాక్స్	12,532	▽	236
షాంఘై	3,109	▽	8
నికాయ్	27,154	▽	159

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

కెనరాబ్యాంక్ కస్టమర్లకు మెరుగైన డిజిటల్ సేవలు



ముంబై: ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ తన కస్టమర్లకు మరింత మెరుగైన డిజిటల్ సేవలు అందించే దిశగా ముందడుగు వేసింది. రోజువారీ లావాదేవీలను సులభతరం చేస్తూ, యూపీఐ ఎల్‌ఐటీఈ, కెనరా క్యూఆర్ సౌండ్ బాక్స్, కెనరా ఏఐ1 మర్చంట్ యాప్‌లను ఆవిష్కరించింది. 'యూపీఐ ఎల్‌ఐటీఈ'.. రూ.200 వరకూ తక్కువ స్థాయిలో విలువ లావాదేవీ నిర్వహించడంసహా పలు ప్రయోజనాలను అందించే ఒక ''ఆన్–డివైస్'' వాలెట్. గరిష్ట రోజువారీ వినియోగ విలువ పరిమితి రూ.4,000. ఇక ఇన్‌స్టెంట్ క్యూఆర్ పేమెంట్ కన్ఫర్మేషన్‌సహా పలు ప్రయోజనాలను 'కెనరా క్యూఆర్ సౌండ్‌బాక్స్' ద్వారా లభ్యమవుతాయి. ఆన్‌బోర్డెడ్ బీహెచ్‌ఐఎం క్యూఆర్ మర్చంట్స్‌కు 'కెనరా ఏఐ1' యూజర్ ఫ్రెండ్లీ ప్లాట్‌ఫామ్‌గా ఉండనుంది. ఈ కీలక ఫీచర్ల కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంక్ సీనియర్ అధికారులను చిత్రంలో తిలకించవచ్చు.

మార్కెట్లకు ఫెడ్ దెబ్బ

- 337 పాయింట్లు పతనం
- 59,120కు చేరిన సెన్సెక్స్
- ఇంట్రాడేలో 624 పాయింట్లు డౌన్
- 89 పాయింట్లు తగ్గిన నిఫ్టీ
- ఎఫ్ఎంసీజీ ప్లస్– బ్యాంక్స్ వీక్



ముంబై: ఆర్థికవేత్తల ఆందోళనలను నిజం చేస్తూ యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లను మూడోసారి 0.75 శాతం పెంచడంతో దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. ఇన్వెస్టర్లు అమ్మకాలకే ప్రాధాన్యత ఇవ్వడంతో సెన్సెక్స్ 337 పాయింట్లు క్షీణించింది. 59,120 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 89 పాయింట్ల వెనకడుగుతో 17,630 వద్ద స్థిరపడింది. ప్రస్తుతం 3.25 శాతంగా ఉన్న ఫండ్స్ రేట్లను ఈ ఏడాది చివరికల్లా 4.4 శాతానికి చేర్చే వీలున్నట్లు ఫెడ్ సంకేతాలివ్వడంతో ప్రపంచ కరెన్సీలతో మారకంలో డాలరు ఇండెక్స్ 111ను దాటింది. ఫలితంగా రూపాయి ఇంట్రాడేలో 100 పైసలు కోల్పోయి చరిత్రాత్మక కనిష్టం 80.96కు చేరింది. వీటికితోడు ఉక్రెయిన్‌పై దాడికి రష్యా సైనిక బలగాలను పెంచుతుండటంతో సెంటిమెంటు దెబ్బతిన్నట్లు మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. దీంతో మిడ్‌సెషన్‌కల్లా సెన్సెక్స్ 624 పాయింట్లు పతనమైంది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 17,723–17,532 పాయింట్ల మధ్య ఆటుపోట్లను చవిచూసింది. అయితే ట్రేడర్లు షార్ట్ కవరింగ్‌కు దిగడంతో ఒక దశలో సెన్సెక్స్ నామమాత్ర లాభాల్లోకి ప్రవేశించడం గమనార్హం!

మీడియా అప్

ఫెడ్ బాటలో ఇతర కేంద్ర బ్యాంకులూ కఠిన విధానాలను అవలంబించనున్న అంచనాలు ఇన్వెస్టర్లలో ఆందోళనలు పెంచుతున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. దీంతో వర్ధమాన మార్కెట్లలో కరెన్సీలు, ఈక్విటీలు నీరసిస్తున్నట్లు తెలియజేశారు. ఎన్ఎస్ఈలో ప్రధానంగా బ్యాంకింగ్ 1.4 శాతం నీరసించగా.. మీడియా, ఎఫ్ఎంసీజీ, వినియోగ వస్తువులు, ఆటో రంగాలు 1.9–0.7 శాతం మధ్య బలపడ్డాయి. బ్లూచిప్స్‌లో పవర్‌గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, యాక్సిస్, ఓఎన్‌జీసీ, కోల్ ఇండియా, ఎస్‌బీఐ లైఫ్, ఐసీఐసీఐ, బజాజ్ ఫిన్, శ్రీసిమెంట్, బీపీసీఎల్ 3–1.2 శాతం మధ్య నష్టపోయాయి. అయితే టైటన్, హెచ్‌యూఎల్, ఏషియన్ పెయింట్స్, మారుతీ, ఐషర్, అదానీ పోర్ట్స్, బ్రిటానియా, ఐటీసీ 2.8–1.4 శాతం మధ్య ఎగశాయి.

చిన్న షేర్లు ఓకే..

తాజాగా చిన్న షేర్లకు డిమాండ్ నెలకొంది. బీఎస్ఈలో మిడ్, స్మాల్‌క్యాప్స్ 0.5–0.3 శాతం చొప్పున బలపడ్డాయి. నగదు విభాగంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) రూ. 2,510 కోట్ల అమ్మకాలు చేపట్టగా.. దేశీ ఫండ్స్(డీఐఐలు) రూ. 263 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి.

స్టాక్ హైలైట్స్

- పట్టణీకరణతోపాటు వినియోగం పెరుగుతుండటంతో జాకీ బ్రాండ్ దుస్తుల కంపెనీ పటిష్ట ఫలితాలు సాధించనున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. ఈ షేరు 4 శాతం జంప్‌చేసి రూ. 53,225 వద్ద ముగిసింది.
- రూ. 10 ముఖ విలువగల షేర్లను రూ. 1 ముఖ విలువగల 10 షేర్లుగా విభజిస్తుండటంతో ఐటీ సేవల కంపెనీ శాక్‌సాఫ్ట్ షేరు 12 శాతం దూసుకెళ్లి రూ. 1,278 వద్ద స్థిరపడింది.
- ప్రమోటర్ సంస్థ విల్మర్ తాజాగా వర్కింగ్ క్యాపిటల్ తదితర అవసరాలకు మద్దతునివ్వడంతో శ్రీ రేణుకా షుగర్స్ 6.5% ఎగసి 60.50 వద్ద క్లోజైంది.

ఆల్‌టైమ్ కనిష్టానికి రూపాయి

- ఒకేరోజు 83 పైసలు డౌన్
- 80.79 వద్ద ముగింపు



అమెరికా ఫెడ్ ఫండ్ రేటు పెంపు నేపథ్యంలో డాలర్ మారకంలో రూపాయి విలువ గురువారం ఒకేరోజు భారీగా 83 పైసలు బలహీనపడి, 80.79 రికార్డు కనిష్ట స్థాయికి పడిపోయింది. ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో గడచిన ఏడు నెలల్లో (ఫిబ్రవరి 24న 99 పైసలు పతనం) రూపాయి ఒకేరోజు ఈ స్థాయిలో బలహీనపడ్డం ఇదే తొలిసారి. అమెరికా ఫెడ్ రేటు పెంపుతోపాటు, రష్యా–ఉక్రెయిన్ భౌగోళిక ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం భయాలు కూడా రూపాయిని వెంటాడుతున్నట్లు ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. బుధవారం రూపాయి ముగింపు 79.96. ట్రేడింగ్ ప్రారంభంలోనే 80.27 వద్ద ప్రారంభమైన రూపాయి విలువ ఒక దశలో ఆల్‌టైమ్ ఇంట్రాడేలో 80.96కు కూడా పడిపోయింది. ఫెడ్ ఫండ్ రేటు పెంపు నేపథ్యంలో ఇక ఇన్వెస్టర్ల దృష్టి ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ జపాన్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌పై ఉన్నట్లు ట్రేడర్లు పేర్కొన్నారు. మరోపక్క, అంతర్జాతీయ మార్కెట్‌లో ఆరు ప్రధాన కరెన్సీల ప్రాతిపదిక లెక్కించే డాలర్ ఇండెక్స్ 20యేళ్ల గరిష్టం 111 వద్ద ట్రేడవుతోంది. రూపాయి విలువ భారీ నష్టంతో 81.18 వద్ద ట్రేడవుతోంది.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	49,894	▲	288
బంగారం (99.5 స్వచ్ఛత)	49,694	▲	287
వెండి (కిలో)	57,343	▲	676

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-9-2022	
విశాఖ	435–00
చిత్తూరు	443–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	435–00
విజయవాడ	435–00
రిటైల్ ధర (డజను)	66.00
22-9-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	403–00
వరంగల్	405–00
రిటైల్ ధర	4.65

ఫోర్టిస్ హెల్త్‌కేర్ మాజీ ప్రమోటర్లకు ఆరు నెలల జైలు

సుప్రీంకోర్టు కీలక తీర్పు



న్యూఢిల్లీ: జపాన్ సంస్థ దైచీ సాంక్యోకు ర్యాన్‌బాక్సీ విక్రయ వ్యవహారంలో పలు అంశాలను దాచిపెట్టడం, ఈ కేసు విచారణలో ఉండగా.. కోర్టు ధిక్కరణకు పాల్పడుతూ తమ ఫోర్టిస్ షేర్లను మలేసియాకు చెందిన ఐహెచ్‌హెచ్ హెల్త్‌కేర్‌కు విక్రయించిన కేసులో ఫోర్టిస్ హెల్త్‌కేర్ మాజీ ప్రమోటర్లు మల్వీందర్ సింగ్, శివిందర్ సింగ్‌లకు సుప్రీం కోర్టు గురువారం 6 నెలల జైలు శిక్ష విధించింది. ఫోర్టిస్ హెల్త్‌కేర్‌లో 26 శాతం వాటా కోసం ఐహెచ్‌హెచ్ హెల్త్‌కేర్ బెర్హాద్ ఇచ్చిన ఓపెన్ ఆఫర్‌పై విధించిన స్టే ఎత్తివేసేందుకూ ప్రధాన న్యాయమూర్తి ఉదయ్ ఉమేష్ లలిత్ నేతృత్వంలోని ధర్మాసనం నిరాకరించింది. 2018 ఫోర్టిస్–ఐఐహెచ్ ఒప్పందంపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని కూడా అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. అలాగే కేసును తిరిగి ఢిల్లీ హైకోర్టుకు విచారణ నిమిత్తం రిమాండ్ చేసింది. దైచి– ఫోర్టిస్ హెల్త్‌కేర్ మాజీ ప్రమోటర్ల మధ్య చట్టపరమైన పోరాటం కారణంగా ఐహెచ్‌హెచ్–ఫోర్టిస్ ఒప్పందం నిలిచిపోయింది. ఫోర్టిస్–ఐహెచ్‌హెచ్ షేర్ డీల్‌ను దైచీ సాంక్యో సవాలు చేసింది. జపనీస్ డ్రగ్ మేకర్ దైచీ 2008లో ఫోర్టిస్ హెల్త్‌కేర్ మాజీ యజమానులైన సింగ్ సోదరుల నుండి ర్యాన్‌బాక్సీ కొనుగోలు చేసింది. అయితే పలు అంశాలు దాచిపెట్టి ఈ ఒప్పందం చేసుకున్నారని దైచీ ఆరోపిస్తూ, సింగ్ సోదరులపై న్యాయపోరాటాన్ని జరిపింది. సింగ్ సోదరులకు వ్యతిరేకంగా సింగపూర్ ట్రిబ్యునల్‌లో రూ.3,600 కోట్ల ఆర్బిట్రేషన్ అవార్డు అమలుకు దైచీ న్యాయపోరాటం చేస్తోంది.

షేర్ భారీ పతనం..: కాగా, ఐహెచ్‌హెచ్ హెల్త్‌కేర్‌కు షేర్ అమ్మకాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలన్న సుప్రీం ఆదేశాల అనంతరం ఫోర్టిస్ ఒక ప్రకటన చేస్తూ, దీనిపై న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఫోర్టిస్ హెల్త్‌కేర్ షేర్ 15% పడిపోయి రూ.265.55 వద్ద ముగిసింది.

టెలికం పరిధిలోకి ఓటీటీ సంస్థలు

- ఇంటర్నెట్ కాలింగ్, మెసేజింగ్ సేవలకూ లైసెన్సు
- ముసాయిదా టెలికం బిల్లు–2022లో ప్రతిపాదనలు
- వాట్సాప్, జూమ్ తదితర సంస్థలపై ప్రభావం



న్యూఢిల్లీ: ఇంటర్నెట్ కాలింగ్, మెసేజింగ్ వంటి సర్వీసులు అందించే ఓవర్–ది–టాప్ (ఓటీటీ) సంస్థలను కూడా టెలికం లైసెన్సుల పరిధిలోకి తీసుకువచ్చేలా టెలికమ్యూనికేషన్ బిల్లు 2022 ముసాయిదాను కేంద్రం ఆవిష్కరించింది. దీంతో వాట్సాప్, జూమ్, గూగుల్ డ్యువో వంటి ఓటీటీ సంస్థలు ఇకపై దేశీయంగా కార్యకలాపాలు సాగించాలంటే లైసెన్సులు తీసుకోవాల్సి రానుంది. ముసాయిదా ప్రకారం, ఒకవేళ టెలికం లేదా ఇంటర్నెట్ ప్రొవైడింగ్ సంస్థలు తమ లైసెన్సులను వాపసు చేస్తే అవి కట్టిన ఫీజులను టెలికం శాఖ రిఫండ్ చేస్తుంది. సందర్భాన్ని బట్టి .. టెలికం నిబంధనల కింద నమోదు చేసుకున్న సంస్థ లేదా లైసెన్సుదారుకు సంబంధించి ఎంట్రీ ఫీజులు, లైసెన్సు ఫీజులు, రిజిస్ట్రేషన్ ఫీజులు లేదా ఇతరత్రా ఏవైనా ఫీజులు లేదా చార్జీలు, వడ్డీలు, అదనపు చార్జీలు, పెనాల్టీ మొదలైన వాటిని కేంద్ర ప్రభుత్వం పాక్షికంగా లేదా పూర్తిగానైనా రద్దు చేయవచ్చు. 'ముసాయిదా టెలికం బిల్లు 2022పై అభిప్రాయాలను ఆహ్వానిస్తున్నాం' అంటూ టెలికం శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. సంబంధిత వర్గాలు తమ అభిప్రాయాలు తెలియజేసేందుకు అక్టోబర్ 20 ఆఖరు తేదీ.

పరిశ్రమలో నవకల్పనలకు మార్గదర్శ ప్రణాళిక: అశ్విని వైష్ణవ్

టెలికం పరిశ్రమ పునర్‌వ్యవస్థీకరణకు, నవకల్పనలను ఆవిష్కరించేందుకు కొత్త టెలికం బిల్లు స్పష్టమైన మార్గదర్శ ప్రణాళిక కాగలదని మంత్రి వైష్ణవ్ చెప్పారు. వచ్చే ఏడాదిన్నర–రెండేళ్లలో డిజిటల్ నియంత్రణ వ్యవస్థను సమూలంగా మార్చే ప్రక్రియ పూర్తి కాగలదని పబ్లిక్ అఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన తెలిపారు. సామాజిక లక్ష్యాలు, వ్యక్తుల బాధ్యతలు.. హక్కుల మధ్య సమతౌల్యం పాటించడం, ఎలాంటి టెక్నాలజీలకైనా వర్తించే విధానాలను రూపొందించడం లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి పేర్కొన్నారు.

సాక్షి స్పోర్ట్స్



ఐపీఎల్ మళ్లీ పాత ఫార్మాట్‌లో...

వచ్చే ఏడాది ఐపీఎల్ పూర్తి స్థాయిలో పాత ఫార్మాట్‌లో నిర్వహిస్తామని బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ప్రకటించారు. కరోనాకు ముందు ఉన్న విధంగా ప్రతీ జట్టు తమ సొంత మైదానంలో ఒక మ్యాచ్, ప్రత్యర్థి మైదానంలో మరో మ్యాచ్ ఆడుతుందని ఆయన వెల్లడించారు. ఇప్పుడు ఐపీఎల్‌లో 10 జట్లు ఉండగా, ప్రతీ టీమ్ మిగిలిన 9 టీమ్‌లను రెండేసి సార్లు ఎదుర్కొంటుంది. 2022లో ఐపీఎల్ పూర్తిగా భారత్‌లోనే జరిగినా... కొన్ని వేదికలకే లీగ్‌ను పరిమితం చేశారు. వచ్చే సీజన్‌నుంచి అంతా సాధారణంగా మారిపోతుందని గంగూలీ స్పష్టం చేశారు. మరో వైపు 2023 సీజన్‌తో పూర్తి స్థాయిలో మహిళల ఐపీఎల్ కూడా నిర్వహిస్తామని గంగూలీ చెప్పారు. దీంతో పాటు టీనేజ్ అమ్మాయిల ప్రతిభను గుర్తించేందుకు తొలిసారి జాతీయ స్థాయిలో బాలికల అండర్–15 టోర్నీ కూడా జరపనున్నట్లు సౌరవ్ గంగూలీ వివరించారు.

శార్దుల్‌కు 4 వికెట్లు

తొలి వన్డేలో భారత్ 'ఎ' విజయం



చెన్నై: న్యూజిలాండ్ 'ఎ'తో జరిగిన తొలి అనధికారిక వన్డేలో భారత్ 'ఎ' 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 40.2 ఓవర్లలో 167 పరుగులకే కుప్పకూలింది. మైకేల్ రిప్పన్ (104 బంతుల్లో 61; 4 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించగా, జో వాకర్ (36) ఫర్వాలేదనిపించాడు. శార్దుల్ ఠాకూర్ (4/32) ప్రత్యర్థిని దెబ్బ తీయగా...కుల్దీప్‌సేన్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం భారత్ 31.5 ఓవర్లలో 3 వికెట్లకు 170 పరుగులు చేసింది. రజత్ పటిదార్ (45 నాటౌట్), రుతురాజ్ గైక్వాడ్ (41), రాహుల్ త్రిపాఠి (31), సంజు సామ్సన్ (29 నాటౌట్) రాణించారు.

సౌత్‌జోన్‌కు ఆధిక్యం

కోయంబత్తూర్: వెస్ట్‌జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో సౌత్‌జోన్‌కు కీలకమైన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. మ్యాచ్ రెండో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 318 పరుగులు సాధించింది. బాబా ఇంద్రజిత్ (125 బంతుల్లో 118; 14 ఫోర్లు) సెంచరీతో చెలరేగాడు. మనీశ్ పాండే (48), కృష్ణప్ప గౌతమ్ (43), రోహిన్ కున్నుమ్మల్ (31) రాణించాడు. ప్రస్తుతం చేతిలో మరో 3 వికెట్లు ఉన్న సౌత్ 48 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 250/8తో ఆట కొనసాగించిన వెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 270 పరుగులకు ఆలౌటైంది.

పాకిస్తాన్ గెలుపు

కరాచీ: ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టి20లో పాకిస్తాన్ 10 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ముందుగా ఇంగ్లండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 199 పరుగులు చేసింది. మొయిన్ అలీ (23 బంతుల్లో 55 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), బెన్ డకెట్ (22 బంతుల్లో 43; 7 ఫోర్లు), హ్యారీ బ్రూక్ (19 బంతుల్లో 31; 1 ఫోర్, 3 సిక్స్‌లు) చెలరేగారు. అనంతరం పాక్ 19.3 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 203 పరుగులు సాధించింది. బాబర్ ఆజమ్ (66 బంతుల్లో 110 నాటౌట్; 11 ఫోర్లు, 5 సిక్స్‌లు), మొహమ్మద్ రిజ్వాన్ (51 బంతుల్లో 88 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు బ్యాటింగ్‌తో జట్టును గెలిపించారు.

సిరీస్ కాపాడుకునేందుకు...

- ఆస్ట్రేలియాతో భారత్ పోరు
- నేడు రెండో టి20
- రోహిత్ సేనపై ఒత్తిడి
- రా.గం.7 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం



నాగ్‌పూర్: రేసులో నిలవాలంటే... హైదరాబాద్‌లో సిరీస్‌ను తేల్చుకోవాలంటే... టీమిండియా ఇక్కడ ఈ మ్యాచ్ తప్పక గెలవాల్సిన పరిస్థితి. తొలి మ్యాచ్ ఓటమితో వెనుకబడిన రోహిత్ సేన శుక్రవారం జరిగే రెండో టి20లో ఆస్ట్రేలియాపై గెలవాలనే పట్టుదలతో ఉంది. మరోవైపు సిరీస్‌లో శుభారంభం చేసిన కంగారూ సేన వరుస విజయాలతో ఏకంగా సిరీస్‌పైనే కన్నేసింది. ఈ నేపథ్యంలో నాగపూర్‌లో సమరం ఆసక్తికరంగా మారింది. పొట్టి ఫార్మాట్‌లో కచ్చితమైన ఫేవరెట్, సొంతగడ్డ అనుకూలతలేవీ ఉండవు. ఎవరు మెరిపిస్తే ఆ జట్టే గెలుస్తుంది. ఇక్కడ బంతికంటే బ్యాట్ ఆధిపత్యమే కొనసాగుతుంది. గత మ్యాచ్‌లో 200 పైచిలుకు పరుగులు చేసినా భారత్‌కు ఓటమి తప్పలేదు. కారణం చేజింగ్‌లో మనకన్న ప్రత్యర్థి మెరుపులే మెరిశాయి.

డెత్ ఓవర్లపైనే దృష్టి

ఒత్తిడంతా ఆతిథ్య భారత జట్టుపైనే ఉంది. బ్యాటింగ్ బాగున్నా... బౌలింగ్ ఆందోళన పెంచుతోంది. డెత్ ఓవర్లు మన భారీ స్కోరును సులభంగా ఛేదించేలా చేస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 33 మంది బౌలర్లు 20 డెత్ ఓవర్లు వేశారు. సగటున ప్రతి ఒక్కరు ఓవర్‌కు 10 పరుగులకంటే ఎక్కువే ఇచ్చారు. కలవరపెడుతున్న గణాంకాల నేపథ్యంలో జట్టు మేనేజ్‌మెంట్ కూడా ప్రత్యేకించి బౌలింగ్ విభాగంపైనే దృష్టి సారించింది. పూర్తి ఫిట్‌నెస్‌గా ఉన్న బుమ్రాను ఈ మ్యాచ్‌లో ఆడించే ప్రయత్నం చేయొచ్చు. బ్యాటింగ్ దళం పటిష్టంగానే ఉంది. కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ కోహ్లి గత మ్యాచ్‌లో విఫలమైనప్పటికీ ఆసియా కప్‌తో ఫామ్‌లోకి వచ్చారు. సూర్యకుమార్ తన పాత్రకు న్యాయం చేయగా, హార్దిక్ పాండ్యా తన బ్యాటింగ్ సత్తాను చుక్కలతో చూపించాడు. ఇదే జోరు నాగ్‌పూర్‌లోనూ కొనసాగితే భారత్ భారీస్కోరుకు తిరుగుండదు.

ఉత్సాహంగా కంగారూ సేన

శుభారంభం తాలుకు ఉత్సాహం పర్యాటక జట్టులో తొణికిసలాడుతోంది. టి20 ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియా సొంతగడ్డపై జరిగే మెగా ఈవెంట్‌కు ముందు ఈ సిరీస్‌ను తీసుకెళ్లాలని ఆశిస్తోంది. మొహాలిలో ఆసీస్ బౌలింగ్‌లో ధారాళంగా పరుగులు సమర్పించుకున్నప్పటికీ క్రీజులోకి దిగిన బ్యాట్స్‌మెన్‌లో ఒక్క మ్యాక్స్‌వెల్ (1) మినహా అందరు వేగంగానే పరుగులు చేశారు. ఫించ్ (13 బంతుల్లో 22), గ్రీన్ (30 బంతుల్లో 61), ఇంగ్లిస్ (10 బంతుల్లో 17), వేడ్ (21 బంతుల్లో 45 నాటౌట్) ఇలా అందరూ బ్యాట్‌కు పనిచెప్పడంతో ఆతిథ్య బౌలింగ్ చెదిరింది. కొండంత లక్ష్యం చకచకా కరిగిపోయింది. అయితే బౌలింగ్‌కు సహకరించే నాగ్‌పూర్ పిచ్‌పై పరుగుల మోత ఏ విధంగా ఉంటుందో చూడాలి. ఈ వేదికపై 12 టి20 మ్యాచ్‌లు జరిగితే మొదట బ్యాటింగ్ జట్టు చేసిన సగటు స్కోరు 151 పరుగులే! ఈ నేపథ్యంలో ఇక్కడ బ్యాటే కాదు బంతి కూడా ప్రభావం చూపుతుంది.


జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), రాహుల్, కోహ్లి, సూర్యకుమార్, హార్దిక్ పాండ్యా, దినేశ్ కార్తీక్, అక్షర్, హర్షల్ పటేల్, భువనేశ్వర్, బుమ్రా / ఉమేశ్, చహల్ / అశ్విన్.

ఆస్ట్రేలియా: ఫించ్ (కెప్టెన్), గ్రీన్, స్మిత్, మ్యాక్స్‌వెల్, ఇంగ్లిస్, టిమ్ డేవిడ్, వేడ్, కమిన్స్, ఎలిస్, జంపా, హాజల్‌వుడ్.

పిచ్–వాతావరణం

పూర్తిగా మెరుపుల పిచ్ కాదు. బౌలర్లకు చక్కని అవకాశమున్న వికెట్ ఇది. చివరి సారిగా 2019లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో దీపక్ చహర్ (6/7) అసాధారణ బౌలింగ్ చేశాడు. అయితే మ్యాచ్‌కు వర్షం ముప్పుంది. గురువారం వాన కారణంగా భారత్ ప్రాక్టీస్ రద్దు అయింది.



'సంతాపం కాదు...సంబరంలా ఉండాలి'

- నేడు ఫెడరర్ చివరి మ్యాచ్
- లేవర్ కప్‌లో నాదల్‌తో కలిసి డబుల్స్ బరిలోకి
- అర్ధరాత్రి 1.30నుంచి 'సోనీ' నెట్‌వర్క్‌లో ప్రత్యక్షప్రసారం

లండన్: రెండు దశాబ్దాలకు పైగా టెన్నిస్ ప్రపంచాన్ని శాసించిన స్టార్ ప్లేయర్ రోజర్ ఫెడరర్ చివరి పోరుకు సమయం ఆసన్నమైంది. గత గురువారం రిటైర్మెంట్ ప్రకటించిన ఫెడరర్ శుక్రవారం చివరిసారిగా బరిలోకి దిగనున్నాడు. లేవర్ కప్‌లో టీమ్ యూరోప్ తరపున ఆడనున్న ఫెడరర్... ఈ మ్యాచ్‌లో మరో స్టార్ రాఫెల్ నాదల్‌తో కలిసి డబుల్స్ మ్యాచ్ ఆడనుండటం విశేషం. ఫెడరర్–నాదల్ జోడి జాక్ సాక్–ఫ్రాన్సిస్ టియాఫో (టీమ్ వరల్డ్)తో తలపడుతుంది. లేవర్ కప్ తొలి రోజే ఫెడెక్స్ ఆటకు గుడ్‌బై చెప్పనున్నాడు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ...'నా చివరి మ్యాచ్ ఏదో అంతిమ యాత్రలాగ ఉండరాదు. అదో సంబరంలా కనిపించాలి. కోర్టులో చాలా సంతోషంగా ఆడాలని, మ్యాచ్ హోరాహోరీగా సాగాలని కోరుకుంటున్నా. సరిగ్గా చెప్పాలంటే ఒక పార్టీలో పాల్గొన్నట్లు అనిపించాలి. చాలా రోజుల తర్వాత బరిలోకి దిగుతున్నాను కాబట్టి కొంత ఒత్తిడి ఉండటం సహజం. నేను మ్యాచ్‌లో పోటీ ఇవ్వగలనని నమ్ముతున్నా' అని ఫెడరర్ స్పష్టం చేశాడు. ఆటలో కొనసాగే శక్తి తనలో లేదని తెలిసిన క్షణానే రిటైర్మెంట్ గురించి ఆలోచించానని, పూర్తి సంతృప్తితో తప్పుకుంటున్నట్లు అతను చెప్పాడు. 'వీడ్కోలు పలకడం బాధ కలిగించే అంశమే. కోర్టులోకి అడుగు పెట్టాలని, ఇంకా ఆడాలని ఎప్పుడూ అనిపిస్తుంది. ప్రతీ కోణంలో నా కెరీర్‌ను ఇష్టపడ్డాను. వాస్తవం ఏమిటంటో ప్రతీ ఒక్కరు ఏదో ఒక క్షణంలో పరుగు ఆపి ఆట నుంచి తప్పుకోవాల్సిందే. అయితే నా ప్రయాణం చాలా అద్భుతంగా సాగింది కాబట్టి చాలా సంతోషం' అని ఈ స్విస్ దిగ్గజం తన కెరీర్‌ను విశ్లేషించాడు. రిటైర్మెంట్ తర్వాతి ప్రణాళికల గురించి చెబుతూ...'ఆటకు గుడ్‌బై చెప్పిన తర్వాత బోర్గ్‌లాంటి దిగ్గజం దశాబ్దాల పాటు కోర్టు వైపు రాలేదని విన్నాను. నేను అలాంటివాడిని కాను. ఎప్పుడూ జనంలో ఉండాలని కోరుకుంటాను. ఏదో ఒక హోదాలో టెన్నిస్‌తో కొనసాగుతాను. ఒకటి మాత్రం స్పష్టంగా చెప్పగలను. ఎవరికీ కనిపించకుండా దెయ్యంలా మాత్రం ఉండిపోను' అని ఫెడరర్ సరదాగా వ్యాఖ్యానించాడు.

'జులన్‌కు ఘనంగా వీడ్కోలు ఇస్తాం'

- హర్మన్‌ప్రీత్ కౌర్ వ్యాఖ్య
- రెండో వన్డేలో 88 పరుగులతో భారత్ ఘన విజయం
- ఇంగ్లండ్‌పై 2–0తో సిరీస్ సొంతం



కాంటర్‌బరి: వరుసగా రెండు మ్యాచ్‌ల విజయాలతో 2–0తో సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత మహిళల జట్టు ఇక ఏ ఒత్తిడి లేకుండా ఆఖరి పోరు ఆడుతుందని కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తెలిపింది. 'తొలి మ్యాచ్ గెలిచిన మాకు రెండో మ్యాచ్ కీలకమైంది. ఇందులో గెలిచి సిరీస్ సాధించాలనే పట్టుదలతో ఆడాం. అనుకున్నది సాధించాం. ఎన్నో ఏళ్ల తర్వాత ఇంగ్లండ్ గడ్డపై సిరీస్ సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇక మాకు లార్డ్స్‌లో జరిగే ఆఖరి మ్యాచ్ నామమాత్రమైంది. అక్కడ ఏ బెంగ లేకుండా ఆడేయొచ్చు. అంతేకాదు... దిగ్గజ సీమర్ జులన్ గోస్వామి కెరీర్‌లో ఆఖరి మ్యాచ్ కాబట్టి విఖ్యాత లార్డ్స్ మ్యాచ్ మాకిపుడు ప్రత్యేకమైంది. మా పేసర్‌కు విజయంతో వీడ్కోలు ఇస్తాం' అని హర్మన్ మ్యాచ్ ముగిసిన అనంతరం పేర్కొంది.

ఇంగ్లండ్ గడ్డపై 23 ఏళ్ల తర్వాత...

భారత అమ్మాయిల జట్టు బుధవారం జరిగిన రెండో వన్డేలో 88 పరుగుల తేడాతో ఆతిథ్య జట్టుపై జయభేరి మోగించింది. తద్వారా 2–0తో ఇంగ్లండ్ గడ్డపై 23 ఏళ్ల తర్వాత వన్డే సిరీస్ గెలిచింది. చివరి సారిగా 1999లో అక్కడ సిరీస్ నెగ్గింది. బుధవారం జరిగిన పోరులో మొదట భారత్ 5 వికెట్ల నష్టానికి 333 పరుగుల భారీస్కోరు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (111 బంతుల్లో 143 నాటౌట్; 18 ఫోర్లు, 4 సిక్సర్లు) ఆఖరి దాకా చెలరేగింది. హర్లీన్ డియోల్ (72 బంతుల్లో 58; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), స్మృతి మంధాన (51 బంతుల్లో 40; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. తర్వాత ఇంగ్లండ్ 44.2 ఓవర్లలో 245 పరుగుల వద్ద ఆలౌటైంది. వ్యాట్ (58 బంతుల్లో 65; 6 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించగా, కాప్సీ (39; 6 ఫోర్లు), కెప్టెన్ అమీ జోన్స్ (39; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడారు. రేణుక సింగ్ (4/57) చావు దెబ్బ తీయగా, హేమలత 2 వికెట్లు పడగొట్టింది. రేపు లార్డ్స్‌లో ఆఖరి వన్డే జరుగుతుంది.

క్వార్టర్స్‌లో అర్జున్, ప్రజ్ఞానంద

న్యూయార్క్: భారత గ్రాండ్ మాస్టర్లు ఇరిగేశి అర్జున్, ప్రజ్ఞానంద జూలియస్ బేర్ జనరేషన్ కప్ ఆన్‌లైన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. 15 రౌండ్లు ముగిసే సరికి ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) 34 పాయింట్లతో అగ్ర స్థానంలో ఉండగా, తెలంగాణ ఆటగాడు అర్జున్ (25), ప్రజ్ఞానంద (23) వరుసగా రెండు, నాలుగో స్థానంలో కొనసాగుతున్నారు. 16 మంది గ్రాండ్‌మాస్టర్లు తలపడుతున్న ఈ టోర్నీలో టాప్–8లో నిలిచిన ప్లేయర్లు క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత పొందుతారు.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+4 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 183
శుక్రవారం 23-9-2022
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLIGUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL





ఇప్పుడంటే అనుకున్న సమయానికి నిద్ర లేవడానికి అలారమ్‌లు ఉన్నాయి. సెల్‌ఫోన్ అలారమ్‌లు కూడా వచ్చాయి. ఒకానొక కాలంలో ఇంగ్లాండ్ పారిశ్రామిక ప్రాంతంలో 'నాకర్ అప్పర్' అనే ఉద్యోగులు ఉండేవారు. వీరి పని ఏమిటంటే... డోర్ కొట్టో, బెల్ మోగించో ఆ ఇంటి వారిని తగిన సమయానికి నిద్ర లేపడం! ఆలారమ్ మోగితే గొంతు నొక్కి మళ్లీ నిద్రించవచ్చు. 'నాకర్ అప్పర్' జమానాలో మాత్రం చచ్చినట్లు నిద్రలేవాల్సిందే!

ENGLISH ఇడియమ్స్

ప్రతి ఒక్కరికీ ప్రత్యేకమైన, సంతోషకరమైన, ఎప్పుడూ గుర్తుంచుకునే రోజు ఒకటి ఉంటుంది. దీన్ని 'రెడ్ లెటర్ డే' అంటారు.

ఉదా: ది డే దట్ ఆ స్టార్టెడ్ మై జర్నీ టువర్డ్స్ మై రియల్ కెరీర్ వాజ్ ఏ రెడ్ లెటర్ డే ఫర్ మీ

రెడ్ లెటర్ డే అంటే?



దీని మూలంలోకి వెళితే...వన్స్ అపాన్ ఏ టైమ్ రోమన్ రిపబ్లిక్‌లో క్యాలెండర్‌లో ముఖ్యమైన రోజులపై రెడ్‌మార్క్ వేసేవారు. అచ్చు యంత్రం వచ్చే వరకు ఈ సంప్రదాయం కొనసాగింది. ఇప్పటికీ కొన్ని క్యాలెండర్‌లలో పండగలు, ప్రత్యేక సందర్భాలను రెడ్‌మార్క్ వేస్తున్నారు. నార్వే, స్వీడన్, సౌత్ కొరియా, ఇండోనేషియా, లాటిన్ అమెరికా దేశాలలో కొన్ని పబ్లిక్ హాలిడేలను 'రెడ్ లెటర్ డే'గా వ్యవహరిస్తారు.

● గేమింగ్

మిస్టరీ బాక్స్




టర్న్-బేస్డ్ స్ట్రాటజీ టేబుల్ టాప్ గేమ్ 'మూన్ బ్రేకర్' ఇటీవల విడుదల అయింది. చిన్న పాటి సౌరవ్యవస్థ నేపథ్యంగా సాగే సైన్స్‌ఫిక్షన్ గేమ్ ఇది. 'మూన్ బ్రేకర్' ప్రపంచం, అందులోని క్యారెక్టర్ల గురించి అవగాహన కలిగించడానికి డెవలపర్స్ ఆడియో డ్రామాను ఆవిష్కరించారు. 'మూన్‌బ్రేకర్'లో ఏఐ ఎనిమీస్‌తో పోరాడటానికి 'కార్గో మోడ్' ఉంది. 'ప్లేయర్స్‌కు కొత్త అనుభూతిని ఇచ్చే గేమ్ ఇది. దీనిలో పదిమంది భిన్నమైన కెప్టెన్‌లు ఉంటారు. స్టోరీ గురించి చెప్పాలంటే ఇదొక మిస్టరీ బాక్స్' అంటున్నాడు గేమింగ్ కంపెనీ కో-ఫౌండర్ చార్లీ క్లైవ్‌ల్యాండ్. గేమ్ డిజైనర్ బ్రాండన్ సాండర్సన్ రచన బాధ్యత స్వీకరించారు.

డెవలపర్: అన్‌నోన్ వరల్డ్ ఎంటర్‌టైన్‌మెంట్ **జానర్:** టర్న్-బేస్డ్ ట్యాక్టిక్స్
ప్లాట్‌ఫామ్: మైక్రోసాఫ్ట్ విండోస్, మాకింతోష్ ఆపరేటింగ్ సిస్టమ్

● ఆర్ట్ అండ్ కల్చర్

గిట్లనే ఉంటదానయ్య!



ఏ మాటలు లేని ఈ కార్టూన్‌ను ఎన్ని రకాలుగానైనా వ్యాఖ్యానించుకోవచ్చు. కొందరికి ఫోన్‌లో మాట్లాడితే గానీ మాట్లాడినట్లే ఉండదు. ఆ వ్యక్తి ఎదురుగా ఉన్నా సరే! ఇక రెండో రకం...ఒక పని కోసం ఫోన్‌లో మాట్లాడుతూ బయలుదేరుతారు. తీరా వచ్చిన తరువాత వచ్చిన పని మరిచిపోయి నాలుక కరుచుకుంటారు. ఇలా ఎన్నయినా చెప్పుకోవచ్చు. అజర్‌బైజాన్ కార్టూనిస్ట్ సెరన్ కెఫెర్లీ ఈ కార్టూన్ గీశాడు. దేశంలో ఏర్పడిన కార్టూనిస్ట్ యూనియన్‌కు సెరన్ తొలి అధ్యక్షుడు. ఇంటర్నేషన్ కార్టూన్ మ్యాగజైన్ 'హ్యామర్'కు చీఫ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నాడు.

● యంగ్ టాలెంట్

'అవును... గుర్రం ఎగరావచ్చు' అంటారు.
ఈ గుర్రం మాత్రం ఎగరడమే కాదు...
యంగ్ డైరెక్టర్ మహర్షి కశ్యప్‌ను కూర్చోబెట్టుకొని బెంగళూరు నుంచి జైపూర్ వరకు తిప్పింది.
రేపు ఆస్కార్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు కూడా తీసుకువెళ్లవచ్చు...

అవును... గుర్రం ఎగిరింది!



▲ అస్సామీ షార్ట్ ఫిల్మ్ మర్ గౌరర్ దురొంటో గోటి (ది హార్స్ ఫ్రమ్ హెవెన్)

ఆస్కార్ 2023 బరిలో 'షార్ట్ ఫిల్మ్ ఫిక్షన్' విభాగంలో మన దేశం నుంచి అస్సామీ షార్ట్ ఫిల్మ్ మర్ గౌరర్ దురొంటో గోటి (ది హార్స్ ఫ్రమ్ హెవెన్) ఎంపికైంది. 27 సంవత్సరాల మహర్షి తుహిన్ కశ్యప్ దీని దర్శకుడు. కథ విషయానికి వస్తే...

ఒక పెద్దాయన ఎప్పుడూ పగటి కల కంటూ ఉంటాడు. నగరంలో జరిగే గుర్రపు పందేలలో తన గుర్రం కూడా ఉండాలి. ఆ గుర్రం ఎలాంటిదంటే, మెరుపు వేగంతో పరుగులు తీస్తుంది. ఎప్పుడు గుర్రపు పందేలు జరిగినా తానే విజేత. 'మీ గుర్రానికి ఎంత బాగా శిక్షణ ఇచ్చారు' అంటూ అందరూ తనను వేనోళ్ల పొగుడుతుంటారు.

'ఇంతకీ నా గుర్రం ఏదీ?' అని వెదుకుతాడు ఆ పెద్దాయన. కానీ ఆ గుర్రం ఊహల్లో తప్ప వాస్తవప్రపంచంలో కనిపించదు. అక్కడ కనిపించేది తన గాడిద మాత్రమే!

'కలా? నిజమా! అనిపిస్తుంది. చాలా సంతోషంగా ఉంది. ఆస్కార్ గురించి వింటూ, చూస్తూ పెరిగాను. ఇప్పుడు నేను ఆస్కార్ బరిలో నిలవడం అనేది గర్వంగా ఉంది' అంటున్నాడు మహర్షి.

కోల్‌కతాలోని సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఫైనల్ ఇయర్ స్టూడెంట్ అయిన మహర్షి స్టూడెంట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ చిత్రాన్ని తీశాడు. సర్రియలిజం, డార్క్ హ్యూమర్‌లతో కూడిన ఈ కథను చెప్పడానికి సంప్రదాయ కళ 'ఒజపాలి'ని సమర్థవంతంగా వాడుకున్నాడు దర్శకుడు. ఆరువందల సంవత్సరాల ఘన చరిత్ర ఉన్న అస్సామీ కళారూపం 'ఒజపాలి'లో కళాకారులు ఆడుతూ, పాడుతూ, నవ్విస్తూ పురాణాలలో నుంచి కథలు చెబుతుంటారు.



'ది హార్స్ ఫ్రమ్ హెవెన్'ను ఎక్కువ భాగం క్యాంపస్‌లో చిత్రీకరించారు. కొంత భాగం కోల్‌కతా శివారులలో చిత్రీకరించారు.

ఈ చిత్రం కోల్‌కతా ఇంటర్నేషనల్ ఫిల్మ్‌ఫెస్టివల్, జైపూర్ ఫిల్మ్‌ఫెస్టివల్, ది హిమాలయన్ ఫిల్మ్ ఫెస్టివల్, డీప్ ఫోకస్ స్టూడెంట్ ఫిల్మ్‌ఫెస్టివల్...మొదలైన ఎన్నో చిత్రోత్సవాలకు ఎంపికైంది.

తాజాగా బెంగళూరు ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్(బీఐఎస్ఎఫ్ఎఫ్)లో 'బెస్ట్ ఫిల్మ్' అవార్డ్ అందుకొని ఆస్కార్ బరిలోకి దిగబోతుంది.

ఫీచర్ ఫిల్మ్స్‌లా కాకుండా ఒక షార్ట్‌ఫిల్మ్‌ను ఆస్కార్‌కు పంపాలంటే అది ఆస్కార్ - క్వాలిఫైయింగ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డ్ గెలుచుకోవాలి. మన దేశంలో అలాంటి ఏకైక ఫిల్మ్ ఫెస్టివల్ బీఐఎస్ఎఫ్ఎఫ్.

'చిత్ర రూపకల్పన అనేది ఎంత క్లిష్టమైన విషయమో అందులో దిగాక కాని తెలియదు. ప్రతిరోజూ ఏదో ఒక విషయం నేర్చుకుంటూనే ఉన్నాను. స్వర్గం నుంచి దిగి వచ్చిన గుర్రం మమ్మల్ని ఎన్నో నగరాలు తిప్పింది. భవిష్యత్‌లో ఎన్ని చోట్లకు తీసుకువెళుతుందో తెలియదు' అంటున్నాడు మహర్షి.

కల్లోల ప్రాంతంలో పుట్టి పెరిగిన మహర్షికి ఎనిమిదవ తరగతిలో డైరెక్టర్ కావాలనే కోరిక పుట్టింది. చాలామందిలో ఆతరువాత కాలంలో ఆ కోరిక ఆవిరైపోతుంది. కానీ మహర్షి విషయంలో మాత్రం అది ఇంకా బలపడింది.

సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్‌లో అడుగు పెట్టిన రోజు తన కలకు రెక్కలు దొరికినట్లుగా సంతోషపడ్డాడు.

మహర్షిలో ఉన్న ప్రశంసనీయమైన ప్రత్యేకత ఏమిటంటే... నేల విడిచి సాము చేయాలనుకోవడం లేదు. తన నేల మీద నడయాడిన కథలనే చిత్రాల్లోకి తీసుకురావాలనుకుంటున్నాడు. ఉత్తర, దక్షిణ భారతాలతో పోల్చితే వెండి తెర మీద కనిపించిన ఈశాన్య భారత ప్రాంత కథలు తక్కువ. ఇప్పుడు ఆ లోటు మహర్షి కశ్యప్ రూపంలో తీరబోతుంది.

ఆస్కార్ ఎంట్రీ అనేది ఆరంభం మాత్రమే!

● టెక్..టాక్

వాట్సాప్‌లో ఎడిట్ మెసేజ్ ఫీచర్

పాపులర్ మెసేజింగ్ యాప్ వాట్సాప్ 'ఎడిట్ మెసేజ్' అనే కొత్త ఫీచర్‌ను పరీక్షిస్తుంది. కొన్నిసార్లు తొందరపాటు వల్లో, పరధ్యానం వల్లో పంపిన మెసేజ్‌లో తప్పులు దొర్లుతుంటాయి. ఇక ముందు నాలుక కర్చుకొని అయ్యో అనుకోనక్కర్లేదు. ఎడిట్ మెసేజ్ ఫీచర్‌తో పంపిన మెసేజ్‌లో తప్పును సరిద్దుకోవచ్చు. ఇప్పటికీ వాట్సాప్‌లో 'డిలిట్ ఫర్ ఎవ్రీవన్' ఫీచర్ అందుబాటులో ఉంది. దీంతో యూజర్స్ సెంట్ మెసేజ్‌లను డిలిట్ చేయవచ్చు. అయితే 'ఎడిట్ మెసేజ్'తో పూర్తిగా డిలిట్ చేయాల్సిన అవసరం లేకుండానే అవసరం ఉన్న చోట ఎడిట్ చేసుకోవచ్చు. దీనికి సంబంధించి మరిన్ని వివరాలు త్వరలో ప్రకటిస్తారు.

ఇన్‌స్టాగ్రామ్ లాగిన్ యాక్టివిటీ

భద్రతాపరమైన కోణంలో ఎప్పటికప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో లాగిన్ యాక్టివిటీ చెక్ చేసుకోవడం అవసరం. దీని కోసం...
● ఇన్‌స్టాగ్రామ్ యాప్ ఓపెన్ చేయాలి ● బాటమ్ రైట్ కార్నర్‌లో ప్రొఫైల్‌ను ట్యాప్ చేయాలి. ● టాప్ రైట్ కార్నర్‌లో 3-హారిజంటల్ లైన్స్ ట్యాప్ చేయాలి ● సెట్టింగ్ ఆప్షన్ సెలెక్ట్ చేసుకోవాలి ● లిస్ట్ నుంచి సెక్యూరిటీ ఆప్షన్‌ను సెలెక్ట్ చేసుకోవాలి ● లాగిన్ యాక్టివిటీ ఆప్షన్‌ను ట్యాప్ చేయాలి.



ఇన్‌స్టాలో లాగిన్ యాక్టివిటీని డిలిట్ చేయడానికి...

1. సెట్టింగ్స్‌లోని 'లాగిన్ యాక్టివిటీ'ను సెలెక్ట్ చేసుకోవాలి
2. 3-డాట్ బటన్ నొక్కాలి **3.** లాగ్ ఔట్ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి.

గూగుల్‌లో త్వరలో...

రెండు సంవత్సరాల క్రితం 'ఐవోఎస్' కోసం ప్రైవసీ స్క్రీన్‌ను తీసుకువచ్చింది గూగుల్. కొన్ని గూగుల్ యాప్స్‌ను ఉపయోగించడానికి యూజర్స్ టచ్ లేదా ఫేస్ ఐడీ అథంటికేషన్‌ను యూజ్ చేయాలి. ఇలాంటిదే 'ఆండ్రాయిడ్' కోసం కొత్త ఫీచర్‌ను తీసుకురానుంది క్రోమ్.

'లాక్ ఇన్‌కాగ్నెటో ట్యాబ్స్ వెన్ యూ లీవ్ క్రోమ్' అనే ఈ ఆప్షన్ సెట్టింగ్స్‌లోని ప్రైవసీ అండ్ సెక్యూరిటీలో కనిపిస్తుంది. దీనితో యూజర్ ఇన్‌కాగ్నెటో ట్యాబ్స్ లాక్ చేయడానికి, ఫింగర్ ప్రింట్ అథింటికేషన్‌తో అన్‌లాక్ చేయడానికి వీలవుతుంది.

సినిమా

ఓటీటీకి ఓకే

టెక్నాలజీ పెరిగిన తర్వాత డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ విస్తృతి పెరిగింది. దీంతో అగ్ర నటీనటులు ఓటీటీ ప్రాజెక్ట్స్‌పై మొగ్గు చూపుతున్నారు. ఇప్పుడు దర్శకులు కూడా ఓటీటీకి ఓకే చెబుతున్నారు. అలా హిందీ చిత్రసీమలో కొందరు దర్శకులు చేస్తున్న వెబ్ సిరీస్‌లు, వెబ్ ఫిల్మ్స్ గురించి తెలుసుకుందాం.



● సంజయ్ లీలా భన్సాలీ

● 'దేవదాస్', 'బ్లాక్', 'రామ్‌లీల', 'బాజీరావ్ మస్తానీ', 'పద్మావత్', 'గంగూబాయి కతియావాడి' వంటి హిట్ చిత్రాలు తెరకెక్కించిన అగ్రదర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ప్రస్తుతం 'హీరామండి' అనే వెబ్ సిరీస్ చేస్తున్నారు. ఎనిమిది ఎపిసోడ్స్‌గా రానున్న ఈ వెబ్ సిరీస్‌లో సోనాక్షీ సిన్హా, అదితీరావ్ హైదరీ, మనీషా కొయిరాల తదితరులు నటిస్తున్నారని తెలిసింది. భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు ఇప్పటి పాకిస్తాన్‌లోని లాహోర్‌లో నెలకొన్న పరిస్థితుల ఆధారంగా ఈ సిరీస్ సాగుతుందట.

● 'గోల్‌మాల్', 'సింగమ్' ఫ్రాంచైజీలతో పాటు 'చెన్నై ఎక్స్‌ప్రెస్', 'సింబ' వంటి చిత్రాలతో కమర్షియల్ డైరెక్టర్స్‌లో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు రోహిత్ శెట్టి. ఇదే కమర్షియల్ క్రేజ్‌ను డిజిటల్ వరల్డ్‌లో కూడా రిపీట్ చేయాలనుకుంటున్నారాయన. ఇందులో భాగంగానే 'ఇండియన్ పోలీస్ ఫోర్స్' అనే వెబ్ సిరీస్ చేస్తున్నారు. ప్రధానంగా ఢిల్లీ పోలీసుల బ్యాక్‌డ్రాప్‌లో ఈ వెబ్ సిరీస్ ఉంటుంది. ఇందులో సిద్ధార్థ్ మల్హోత్రా, శిల్పా శెట్టి, వివేక్ ఒబెరాయ్ ప్రధాన తారాగణం.



● రోహిత్ శెట్టి



● జోయా అక్తర్

● వెబ్ వరల్డ్‌లో 'లస్ట్ స్టోరీస్', 'ఘోస్ట్ స్టోరీస్' ఆంథాలజీకి మంచి వ్యూయర్‌షిప్ లభించింది. ఈ ఆంథాలజీలోని ఓ భాగానికి దర్శకత్వం వహించారు జోయా అక్తర్. ఇప్పుడు సోలోగా ఓ వెబ్‌ఫిల్మ్ చేస్తున్నారామె. అమెరికన్ కామిక్ బుక్ 'ది ఆర్చీస్' ఆధారంగా ఈ వెబ్ ఫిల్మ్ తీస్తున్నారు. ఈ వెబ్‌ఫిల్మ్‌తోనే అమితాబ్ బచ్చన్ మనవడు అగస్త్యా నంద, షారుక్ ఖాన్ కుమార్తె సుహానా, బోనీకపూర్-దివంగత ప్రముఖ నటి శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ యాక్టర్స్‌గా ప్రయాణం మొదలు పెడుతున్నారు. ఇక 'జిందగీ నా మిలేగీ దోబారా', 'గల్లీ బాయ్' వంటి చిత్రాలతో జోయా అక్తర్ దర్శకురాలిగా సుపరిచితురాలే.

● 'బరేలీ కీ బర్ఫీ', 'పంగా' వంటి చిత్రాలతో మంచి దర్శకురాలిగా పేరు సంపాదించుకున్నారు అశ్వనీ అయ్యర్ తివారి (ప్రముఖ దర్శకుడు నితీష్ తివారి భార్య). ఇప్పటికే భర్త నితీష్‌తో కలిసి 'బ్రేక్ పాయింట్' అనే డాక్యుమెంటరీ ఫిల్మ్‌లో భాగస్వామ్యులయ్యారు అశ్విని. ఇప్పుడు సోలోగా 'ఫాదు' అనే వెబ్ సిరీస్ చేస్తున్నారు. భిన్న మనస్తత్వాలు కలిగిన ఇద్దరు ప్రేమలో పడితే ఎలా ఉంటుంది? అనే పాయింట్‌తో పావైల్ గులాటి, సయామీ ఖేర్ ముఖ్య తారలుగా ఈ సిరీస్ తీస్తున్నారు అశ్వనీ.



● అశ్వనీ అయ్యర్

రెండో సిరీస్‌తో...

కొందరు దర్శకులు రెండో వెబ్ సిరీస్‌కి రెడీ అయ్యారు. ఆ వివరాల్లోకి వస్తే...


● సల్మాన్ ఖాన్‌తో 'సుల్తాన్', 'టైగర్ జిందా హై' చిత్రాలను తీసిన దర్శకుడు అలీ అబ్బాస్ జాఫర్ తొలిసారిగా 'తాండవ్' అనే వెబ్ సిరీస్ చేశారు. తాజాగా షాహిద్ కపూర్ లీడ్ రోల్‌లో 'బ్లడీ డాడీ' అనే సిరీస్ తీశారు. ఇక 'స్కామ్ 1992'తో ఓటీటీలో సంచలనం సృష్టించిన దర్శకుడు హన్సల్ మెహతా తాజాగా భారత జాతిపిత మహాత్మాగాంధీ జీవితం ఆధారంగా ఓ వెబ్ సిరీస్ తీస్తున్నారు. ఇందులో ప్రతీక్ గాంధీ టైటిల్ రోల్ చేస్తున్నారు. 'కహానీ', 'బద్లా' వంటి హిట్ సినిమాలు చేసిన సుజోయ్ ఘోష్ ఇప్పటికే 'టైప్ రైటర్' అనే వెబ్ సిరీస్ చేశారు. ఈ దర్శకుడు ప్రస్తుతం కరీనా కపూర్‌తో ఓ వెబ్ సిరీస్ చేసేందుకు రెడీ అవుతున్నారు. అలాగే 'సాక్రెడ్ గేమ్స్' వెబ్ సిరీస్‌తో డిజిటల్ వరల్డ్‌లోకి వెళ్లిన అనురాగ్ కశ్యప్ మరో వెబ్ సిరీస్‌కు కథ రెడీ చేశారట. ఇక హిట్ చిత్రాలు 'క్వీన్', 'సూపర్ 30' ఫేమ్ దర్శకుడు వికాశ్ బాల్ రెండో వెబ్ సిరీస్‌గా 'ది క్యాన్సర్ బిట్స్' చేస్తున్నారు. 'సన్ ఫ్లవర్' అనే సిరీస్‌తో వికాశ్ వెబ్ ఎంట్రీ ఇచ్చారు.

వీరితో పాటు మరికొందరు దర్శకులు ఒకవైపు సినిమాలు చేస్తూనే మరోవైపు వెబ్ సిరీస్‌లు, వెబ్ ఫిల్మ్‌లు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

"పాన్ ఇండియా సినిమా చేయాలంటే మంచి కథ కుదరాలి.. అంతేకానీ మనం పాన్ ఇండియాకి ప్లాన్ చేయకూడదు. మంచి కంటెంట్‌తో సినిమా తీస్తే పాన్ వరల్డ్ చూస్తారు. అప్పుడు అది పాన్ వరల్డ్ సినిమా అవుతుంది. తెలుగు సినిమా పరిశ్రమ ఇప్పుడు డామినేటింగ్‌గా ఉన్న సమయంలో మేము ఉండటం లక్‌గా భావిస్తున్నా" అన్నారు నాగశౌర్య. అనీష్ ఆర్. కృష్ణ దర్శకత్వంలో నాగశౌర్య, షిర్లే సేథియా జంటగా నటించిన చిత్రం 'కృష్ణ వ్రింద విహారి'. శంకర్ ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఉషా ముల్పూరి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నాగశౌర్య పంచుకున్న విశేషాలు.

అప్పుడు పాన్ వరల్డ్ సినిమా అవుతుంది

- నాగశౌర్య



● 'కృష్ణ వ్రింద విహారి' కథ చాలా ఎగ్జయిటింగ్‌గా అనిపించడంతో అనీష్‌కి ఓకే చెప్పాను. మంచి ఫన్, ఫ్యామిలీ, మాస్.. ఇలా అన్ని అంశాలు ఉన్నాయి. సినిమా చూసినవారు తమ ఫ్యామిలీతో రిలేట్ చేసుకుంటారు. కుటుంబం ఉన్నంతవరకూ మా 'కృష్ణ వ్రింద విహారి'లాంటి కథలకు తిరుగులేదు. ఈ సినిమాలో రాధికగారి పాత్ర మినహా మిగతా పాత్రలన్నీ హిలేరియస్‌గా ఉంటాయి. ● 'అదుర్స్, డీజే, అంటే సుందరానికీ'.. ఇలా ఎన్నో సినిమాల్లో బ్రాహ్మణ పాత్రలు ఉన్నప్పటికీ దేనికదే భిన్నమైనది. 'కృష్ణ వ్రింద విహారి' కూడా భిన్నమైన కథ. కమల్ హాసన్, ఎన్టీఆర్, అల్లు అర్జున్‌గార్లు.. వంటి వారు బ్రాహ్మణ పాత్రల్లో అద్భుతంగా నటించారు. ఈ సినిమా చేస్తున్నప్పుడు స్వతహాగా బ్రాహ్మణుడైన అవసరాల శ్రీనివాస్ వద్ద కొన్ని విషయాలు నేర్చుకున్నాను. రొమాంటిక్ సీన్స్‌లో నేను చాలా వీక్ (నవ్వుతూ).. మా దర్శకుడు కష్టపడి చేయించారు. ● ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా చేసిన పాదయాత్రలో ప్రేక్షకుల అభిమానం ఒక వరం అనిపించింది. ఇక నేను నటించిన 'ఫలానా అమ్మాయి ఫలానా అబ్బాయి' షూటింగ్ పూర్తయింది.. త్వరలో విడుదల చేస్తాం.



● ధనుష్


వీర సూర రారా..

ధనుష్ హీరోగా సెల్వ రాఘవన్ దర్శకత్వంలో తెరకెక్కిన నాలుగో చిత్రం 'నానే వరువేన్'. కలైపులి ఎస్. థాను నిర్మించిన ఈ తమిళ చిత్రాన్ని 'నేనే వస్తున్నా' పేరుతో గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ చిత్రం నుండి తాజాగా 'వీర సూర ధీర రారా..' అనే పాటని విడుదల చేశారు. యువన్ శంకర్ రాజా స్వరపరచిన ఈ పాటకి చంద్రబోస్ సాహిత్యం అందించగా, రాహుల్ నంబియార్ ఆలపించారు. ఈ నెల 29న చిత్రం విడుదల కానుంది. ఎల్లి అవ్రామ్, ఇందుజా రవిచంద్రన్, యోగిబాబు తదితరులు నటించిన ఈ చిత్రానికి సమర్పణ: గీతా ఆర్ట్స్, కెమెరా: ఓం ప్రకాష్.

కెప్టెన్ మిల్లర్ ఆరంభం

ధనుష్ హీరోగా అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'కెప్టెన్ మిల్లర్' చిత్రం షురూ అయింది. ప్రియాంకా అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సందీప్ కిషన్ ముఖ్యమైన పాత్ర చేస్తున్నారు. టీజీ త్యాగరాజన్ సమర్పణలో జి. శరవణన్, సాయి సిద్ధార్థ్ నిర్మిస్తున్న ఈ సినిమా గురువారం చెన్నైలో ప్రారంభమైంది. తమిళ్, తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, కెమెరా: శ్రేయాస్ కృష్ణ.

అభిమన్యుణ్ణి కాదు



● ఆదర్శ్

ఆదర్శ్, చిత్రా శుక్లా జంటగా ఆంథోని మట్టిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గీత సాక్షిగా'. పుష్పక్, జేబీహెచ్ఆర్ఎస్‌కేఎల్ సమర్పణలో చేతన్ రాజ్ ఫిలిమ్స్ పతాకంపై చేతన్ రాజ్ నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. 'పద్మవ్యూహంలో చిక్కుకోవడానికి నేను అభిమన్యుణ్ణి కాదు వాడి బాబు అర్జునుణ్ణి రా' అంటూ ఆదర్శ్ చెప్పే డైలాగ్‌తో టీజర్ సాగుతుంది. ఈ టీజర్ చూస్తుంటే కోర్ట్ డ్రామాగా ఈ చిత్రం ఉండనుందని తెలుస్తోంది. 'నిజ జీవిత ఘటనల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: గోపీసుందర్, కెమెరా: వెంకట్ హనుమ నరిసేటి.

సూర్యాపేట జంక్షన్‌లో...



● ఈశ్వర్

ఈశ్వర్, నైనా సర్వర్ జంటగా 'కథనం' ఫేమ్ నాదెండ్ల రాజేష్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సూర్యాపేట జంక్షన్'. అనిల్ కుమార్ కాత్రగడ్డ, ఎన్.ఎస్. రావు, విష్ణువర్ధన్ నిర్మించిన ఈ మూవీ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ''కొత్తగా మా ప్రయాణం' తర్వాత నేను చేసిన రెండో చిత్రం 'సూర్యాపేట జంక్షన్'. నేనే కథ రాసుకున్నాను. నాదెళ్ల రాజేష్‌కి నచ్చడంతో, ఇద్దరం కలసి ఫుల్ స్టోరీ డెవలప్ చేశాం'' అన్నారు ఈశ్వర్. ''ఇది మంచి యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్'' అన్నారు దర్శక-నిర్మాతలు. ఈ చిత్రానికి సంగీతం: రోషన్ సాలూరి, గౌర హరి, కెమెరా: అరుణ్ ప్రసాద్.

రీ రిలీజ్‌లా లేదు!


- వీవీ వినాయక్



● బెల్లంకొండ సురేష్, వీవీ వినాయక్

''చెన్నకేశవ రెడ్డి' సినిమాని 20 ఏళ్ల క్రితం ఒక పండగలా రిలీజ్ చేశాం. ఇప్పుడు కూడా రీ రిలీజ్‌లా లేదు.. కొత్త సినిమాని విడుదల చేస్తున్నట్లే అనిపిస్తోంది. మంచి ఉద్దేశం కోసం రీ రిలీజవుతున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు, నందమూరి ఫ్యాన్స్ ఆదరించాలి'' అని డైరెక్టర్ వీవీ వినాయక్ అన్నారు. బాలకృష్ణ హీరోగా, టబు, శ్రియ హీరోయిన్లుగా వీవీ వినాయక్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'చెన్నకేశవ రెడ్డి'. బెల్లంకొండ సురేష్ నిర్మించిన ఈ సినిమా 2002 సెప్టెంబర్ 25న రిలీజైంది. ఈ సినిమా రిలీజై 20 ఏళ్లవుతున్న సందర్భంగా ఈ నెల 25న రీ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు బెల్లంకొండ సురేష్. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వీవీ వినాయక్ మాట్లాడుతూ- ''చెన్నకేశవ రెడ్డి'లో బాలయ్యగారిని ఎలా చూపించాలా? అనే పిచ్చితో కొన్ని గంటలు మాత్రమే నిద్రపోయేవాణ్ణి. ఈ సినిమాలో వచ్చే మేజర్ రెవెన్యూని 'బసవతారకం ట్రస్ట్'కి విరాళంగా ఇస్తాం'' అన్నారు.

బెల్లంకొండ సురేష్ మాట్లాడుతూ- ''చెన్నకేశవ రెడ్డి' రీ రిలీజ్ గురించి బాలకృష్ణగారికి చెప్పగానే సంతోషపడ్డారు. ఈ నెల 24న ప్రీమియర్ షోలతో మొదలు పెట్టి, 25న రెగ్యులర్ షోలతో విడుదల చేస్తున్నాం. రీ రిలీజ్‌లో ఒక సినిమాని కోటి రూపాయలకు అడిగిన దాఖలాలు లేవు.. కానీ పలువురు డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ కోటి రూపాయలకు అడగడం 'చెన్నకేశవ రెడ్డి' క్రేజ్‌కి నిదర్శనం. ఈ సినిమాకి వచ్చే రెవెన్యూలో 75 శాతం 'బసవతారకం ట్రస్ట్'కి, మిగతాది నాకు సంబంధించిన అసోషియేషన్స్‌కి ఇస్తాను. నవంబర్ నుంచి మళ్లీ యాక్టివ్‌గా ప్రొడక్షన్ మొదలు పెట్టాలనుకుంటున్నాను'' అన్నారు.


'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 | వెల: ₹ 5.50

సంపుటి: 15 | సంచిక: 183

శుక్రవారం | 23-9-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'జింఖానా' వద్ద తొక్కిసలాట

ఏడుగురికి గాయాలు.. ఊపిరాడక ఇబ్బందిపడ్డ క్రికెట్ అభిమానులు - 9లో



2047 కల్లా స్వదేశీ పరిజ్ఞానం

విశాఖ హెచ్ఎస్ఎల్ నిర్మించిన నిస్తార్, నిపుణ్ జల ప్రవేశం - 8లో



'పాపులర్ ఫ్రంట్'పై గురి

పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా సభ్యుల నివాసాల్లో ఎన్ఐఏ సోదాలు నిర్వహించి.. 106 మందిని అరెస్టు చేసింది.

వివరాలు 6లో



ఒక వ్యక్తికి ఒకే పదవి

'ఒక వ్యక్తికి ఒకే పదవి. ఈ నిర్ణయంపై పార్టీ ఏకాభిప్రాయంతో ఉంది' అని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అన్నారు.

వివరాలు 6లో

రోజూ ప్రత్యేక మెనూ

హాస్టళ్లలో మంచి భోజనం.. టీవీ, ఇంటర్నెట్ సదుపాయం

- గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాల్లో నాడు–నేడు పనులపై సమీక్షలో సీఎం జగన్
- హాస్టళ్లలో రెండు దశల్లో, గురుకులాల్లో మూడు దశల్లో నాడు–నేడు
- హాస్టళ్ల నిర్వహణకు ప్రత్యేక అధికారుల నియామకం
- ఇందుకు ప్రత్యేక యాప్.. కాస్మొటిక్స్‌లో నాణ్యత ముఖ్యం
- విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను వైద్యులు పర్యవేక్షించాలి
- కిచెన్ ఆధునికీకరణ, ఫర్నిచర్ కోసం ప్రతిపాదనలు



సాక్షి, అమరావతి: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో ప్రతి రోజు ప్రత్యేక మెనూ అమలు చేయడంతో పాటు టీవీ, ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ హాస్టళ్లలో రెండు దశల్లో, గురుకుల పాఠశాలల్లో మూడు దశల్లో నాడు–నేడు కార్యక్రమాన్ని పటిష్ట కార్యాచరణతో పూర్తి చేయాలని చెప్పారు. గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాల్లో నాడు–నేడు పనులపై గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. గురుకుల పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్ల పర్యవేక్షణకు సంబంధించి ప్రత్యేక అధికారులను నియమించాలన్నారు. గురుకులాల విద్య (అకడమిక్) వ్యవహారాల పర్యవేక్షణను పాఠశాల విద్య (స్కూల్ ఎడ్యుకేషన్) పరిధిలోకి తేవాలని చెప్పారు. మండలాల్లో అకడమిక్ వ్యవహారాలు చూస్తున్న మండల విద్యా శాఖ అధికారు(ఎంఈఓ)లకే గురుకులాల అకడమిక్ బాధ్యతలు అప్పగించాలా.. లేక మరో విధంగా చేయాలా.. అనే విషయంపై పూర్తి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. 'మండలాల్లో ఇద్దరు ఎంఈఓల నియామకం ద్వారా ఏ విధంగా పర్యవేక్షణను పటిష్టం చేస్తున్నామో.. గురుకులాల్లో కూడా అదే తరహాలోనే

మిగతా 2వ పేజీలో ▶

డ్రైనేజీ.. కరెంట్.. నీళ్లు

- పేదల ఇళ్ల నిర్మాణాల్లో ఈ సదుపాయాలపై ప్రధానంగా దృష్టి
- 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు'పై ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం జగన్
- వైఎస్సార్, జగనన్న కాలనీల్లో సదుపాయాలన్నీ కల్పించాలి 2లో
- ఈ విషయంలో రాజీపడొద్దు.. నిర్మాణాల్లో వెనుకబడ్డ జిల్లాలపై ప్రత్యేక దృష్టి
- లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు త్వరగా వచ్చేలా చూడండి.. ఆప్షన్–3 ఇళ్ల నిర్మాణాలనూ వేగంగా చేపట్టండి
- ఫ్యాన్లు, బల్బులు, ట్యూబ్ లైట్లు నాణ్యమైనవిగా ఉండాలి

నేడు కుప్పం వేదికగా 'చేయూత'

- రూ.4,949.44 కోట్లు జమ చేయనున్న సీఎం జగన్ 2లో
- 26,39,703 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు లబ్ధి

ఏపీలో రూ.5 లక్షల కోట్లతో

రహదారుల అభివృద్ధి



- 2024కు పూర్తయ్యేలా ప్రణాళికలు
- రాష్ట్రంలో 27 గ్రీన్ ఎక్స్‌ప్రెస్ హైవేల నిర్మాణం
- గోదావరి జిల్లాల్లో రూ.3 వేల కోట్లతో 129 కిలోమీటర్ల జాతీయ రహదారులు 8లో
- సీఎం జగన్, ఎంపీల అభ్యర్థనల మేరకు అనుమతులు
- హైదరాబాద్, విశాఖ నుంచి కాకినాడ సెజ్ రోడ్డు అనుసంధానం
- ప్రజా రవాణాలో విద్యుత్, బయో ఇథనాల్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి
- గోదావరి నీళ్లతో గ్రీన్ హైడ్రోజన్ తయారు చేయొచ్చు
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

బీటెక్ సీటు హాట్ కేకు

రికార్డు సృష్టిస్తున్న ఏపీ ఈఏపీ సెట్ సీట్ల కేటాయింపు

తొలివిడతలోనే 82% సీట్లు ఫుల్

- 1,11,864 సీట్లకు 91,249 సీట్ల కేటాయింపు పూర్తి.. గత ఏడాది తొలివిడత 75% సీట్ల భర్తీ
- సీఎస్ఈ, ఈసీఈకి భారీ డిమాండ్
- బాబు హయాంలో చివరి కౌన్సెలింగ్ నాటికీ 61 శాతం సీట్లే భర్తీ
- బాబు ఇచ్చింది అరకొర ఫీజు రీయింబర్స్‌మెంట్.. అప్పట్లో వేరే రాష్ట్రాలకు విద్యార్థులంతా వలస
- వైఎస్ జగన్ ప్రభుత్వం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్.. జగనన్న వసతి దీవెన కింద ఏడాదికి రూ.20 వేలు
- కాలేజీల్లో ప్రమాణాలు మెరుగు, ఇంటర్న్‌షిప్, స్కిల్‌డెవలప్‌మెంట్
- ఫలితంగా రాష్ట్రంలో చదవడానికి విద్యార్థుల ఆసక్తి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంజనీరింగ్ సీట్లు హాట్‌కేకుల్లా భర్తీ అవుతున్నాయి. వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన చర్యల కారణంగా రాష్ట్రంలోని కాలేజీల్లో చదవడానికి ఇంజనీరింగ్ విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ఏపీ ఈఏపీ సెట్–2022 అడ్మిషన్ల కౌన్సెలింగ్ (ఎంపీసీ స్ట్రీమ్)లో గురువారం తొలి విడత సీట్ల కేటాయింపులో 82% సీట్లు భర్తీ అయ్యాయి. కన్వీనర్ కోటా ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపులో ఇదో రికార్డు. గత ఏడాదిలో కూడా తొలి విడతలోనే 75 శాతానికి పైగా భర్తీ అయ్యాయి. ఇప్పుడు మరిన్ని ఎక్కువ సీట్లు భర్తీ అయ్యాయి. జగన్ సీఎం అయిన తర్వాత

మిగతా 8వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ఇప్పుడిప్పుడే తెలుస్తుంది మేడం! ఒక్క రాహుల్‌కి తప్ప అందరికీ అధ్యక్షులవ్వాలని ఉందని..!

నీట్ యూజీ రాష్ట్ర అర్హుల జాబితా విడుదల



నీట్ యూజీ–2022లో అర్హత పొందిన రాష్ట్ర విద్యార్థుల జాబితాను గురువారం ప్రకటించారు. జాబితా ప్రకారం 710 స్కోర్‌తో జాతీయ స్థాయిలో 12వ ర్యాంక్ సాధించిన ఎం.దుర్గసాయి కీర్తి తేజ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచారు. 15వ ర్యాంక్‌తో ఎస్.వెంకట సాయివైష్ణవి రెండో స్థానంలో, 25వ ర్యాంక్‌తో జి.హర్షవర్ధన్‌నాయుడు మూడో స్థానంలో ఉన్నారు. 8లో

అదనపు చార్జీల్లేకుండానే దసరా స్పెషల్ బస్సులు



ప్రయాణికులపై అదనపు చార్జీల భారం లేకుండానే దసరా ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని నిర్ణయించినట్టు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు చెప్పారు. ఈ ఏడాది దసరాకు 4,500 ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు చెప్పారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరులతో పాటు రాష్ట్రంలోని 21 నగరాలు, ముఖ్య పట్టణాలకు ప్రత్యేక బస్సులు నడుపుతామని చెప్పారు. 9లో

ప్రకృతి సాగులో ఏపీ భేష్

- మీతో కలిసి పని చేయడానికి సిద్ధం.. మా దేశాల్లో కూడా అమలుచేస్తాం 8లో
- తక్కువ ఖర్చుతో లాభసాటి వ్యవసాయం చేయిస్తున్న తీరు అమోఘం



'గ్రౌండ్స్‌వెల్' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్టీవ్

- ఇక్కడి విధానాలను అందరూ నేర్చుకోవాలి.. భూమి సారవంతం కావడంతో పాటు వాతావరణంలో స్పష్టమైన మార్పులు గమనించాం
- అనంతపురంలో గ్రౌండ్స్‌వెల్ ఇంటర్నేషనల్ గ్లోబల్ కాన్ఫరెన్స్‌లో 15 దేశాల ప్రతినిధుల కితాబు

ఎకో ఇండియాతో వైద్య శాఖ ఎంవోయూ

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యుల్లో సామర్థ్యం, నైపుణ్యాల పెంపునకు, కొన్ని రకాల క్లిష్టమైన కేసుల్లో నిపుణుల సలహాలు తీసుకోవడం కోసం ఎకో ఇండియాతో వైద్య, ఆరోగ్య శాఖ గురువారం ఎంవోయూ కుదుర్చుకుంది. తాడేపల్లిలోని ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(ఏపీ శ్యాక్స్) కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి జీఎస్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఏపీ శ్యాక్స్ ఏపీడీ డాక్టర్ కామేశ్వరప్రసాద్, ఎకో ఇండియా సంస్థ ఉపాధ్యక్షుడు డాక్టర్ సందీప్ భల్లా ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాల్ని పరస్పరం అందజేసుకున్నారు. ఎకో ఇండియాకు దేశంలో 200 హబ్స్ ఉన్నాయి. కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ, 23 రాష్ట్ర ఎన్‌హెచ్‌ఎం, 11 నర్సింగ్ కౌన్సిల్స్, నేషనల్ క్యాన్సర్ స్క్రీనింగ్, నేషనల్ మెంటల్ హెల్త్ కార్యక్రమాలతో పాటు, టాటా మెమోరియల్ వంటి ప్రముఖ సంస్థలతో కలిసి ఎకో ఇండియా పనిచేస్తోంది. ఎంవోయూ కుదుర్చుకున్న కార్యక్రమంలో ఎన్సీడీ నోడల్ అధికారి డాక్టర్ శాస్త్రి, క్యాన్సర్ కేర్ నోడల్ అధికారి డాక్టర్ నరసింగరావు, పెప్ఫార్ సమన్వయకర్త డాక్టర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అది పాదయాత్ర కాదు.. పెట్టుబడిదారుల యాత్ర

- స్టూడెంట్ జేఏసీ కన్వీనర్ కాంతారావు
- పాదయాత్రను వ్యతిరేకిస్తూ విశాఖలో ర్యాలీ, మానవహారం



మూడు రాజధానులకు మద్దతుగా విశాఖపట్నంలో ఇసుకతోట వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు): అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించాలంటూ జరుగుతున్న పాదయాత్ర రైతులది కాదని.. అది కేవలం అమరావతి పెట్టుబడిదారుల యాత్రేనని స్టూడెంట్ జేఏసీ కన్వీనర్ బి.కాంతారావు అన్నారు. విశాఖలో పరిపాలన రాజధానికి మద్దతుగా గురువారం ఎంవీపీ కాలనీలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఏఎస్ రాజా సర్కిల్ నుంచి ర్యాలీగా ఇసుకతోట కూడలికి చేరుకున్నారు. అనంతరం జాతీయ రహదారిపై విద్యార్థులు మానవహారం నిర్వహించారు. విశాఖ పరిపాలన రాజధానికి మద్దతుగా, అమరావతి రైతుల ముసుగులో జరుగుతున్న పాదయాత్రకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్టూడెంట్ జేఏసీ కన్వీనర్ బి.కాంతారావు మాట్లాడుతూ.. రైతుల ముసుగులో జరుగుతున్నది మహాపాదయాత్ర కాదని.. అది కేవలం చంద్రబాబు బినామీ రైతులతో చేయిస్తున్న పెట్టుబడిదారుల యాత్రని దుయ్యబట్టారు. చంద్రబాబు తన సామాజికవర్గం అభివృద్ధి కోసం రాష్ట్ర పురోగతిని, రాష్ట్ర ప్రజల అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం విశాఖను పరిపాలన రాజధానిగా అభివృద్ధి చేస్తానంటే ఈ ప్రాంత టీడీపీ నేతలు ఓర్వలేకపోతున్నారన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను పక్కనపెట్టి చంద్రబాబు బినామీలకు కొమ్ముకాస్తున్నారన్నారు. ఇలాంటి వారిని ఉత్తరాంధ్ర ప్రజలు తరిమికొడతారన్నారు.

విశాఖ రాజధానితోనే పురోగతి

ఆచార్య షారోను రాజు మాట్లాడుతూ వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ప్రభుత్వం విశాఖను పరిపాలన రాజధానిగా ప్రకటించిందన్నారు. రాజధాని విశాఖ తరలివస్తేనే ఈ ప్రాంత అభివృద్ధి, ఇక్కడ యువతకు ఉద్యోగ అవకాశాలు, రాష్ట్ర పురోగతి సాధ్యమవుతాయన్నారు. ఉత్తరాంధ్ర పురోగతిని అడ్డుకోవాలని తలపెట్టిన మహా పాదయాత్రను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉత్తరాంధ్రలో సాగనివ్వబోమన్నారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ జేఏసీ నేతలు.. నవీన్‌దాస్, నమ్మి భరత్, దువ్వి హరీష్, సోమశేఖర్, బాలాజీ, మాధవ్‌రెడ్డి, జానీ, ఉదయ్, వివేక్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరయ్యారు.

డ్రైనేజీ.. కరెంట్.. నీళ్లు

- పేదల ఇళ్ల నిర్మాణాల్లో ఈ సదుపాయాలపై ప్రధానంగా దృష్టి
- 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు'పై ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- డిసెంబర్ కల్లా టిడ్కో ఇళ్లన్నింటినీ లబ్ధిదారులకు అందించాలి
- మరో 1.07 లక్షల మందికి ఇళ్ల పట్టాల పంపిణీకి సన్నద్ధం



క్యాంప్ కార్యాలయంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలకు పక్కా గృహాలు నిర్మించి ఇచ్చే 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ప్రధానంగా డ్రైనేజీ, కరెంట్, తాగు నీటిపై దృష్టి పెట్టామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. ఈ క్రమంలో ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు మరింత కృషి చేయాలని, పనులు వేగంగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు'పై తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమీక్షలో సీఎం జారీ చేసిన ఆదేశాల అమలు తీరును అధికారులు వివరించారు. ఈ పథకం కింద 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.4,318 కోట్ల విలువైన పనులు చేశామని తెలిపారు. తొలి దశలో 15.6 లక్షలు, రెండో దశలో 5.65 లక్షలు.. మొత్తంగా 21.25 లక్షల ఇళ్లను ఇప్పటి వరకు మంజూరు చేశామన్నారు. ఇన్నాళ్లూ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగాయని, ప్రస్తుతం వర్షాల నేపథ్యంలో మందకొడిగా సాగుతున్నాయని తెలిపారు. వర్షాలు తగ్గగానే మళ్లీ పనులు ఊపందుకుంటాయన్నారు. అక్టోబర్ నుంచి వారానికి 70 వేల ఇళ్ల చొప్పున ఒక దశ నుంచి వేరే దశకు నిర్మాణం మారేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఇంటిని ప్రభుత్వమే నిర్మించి ఇచ్చే ఆప్షన్–3 ఎంపిక చేసుకున్న ఇళ్ల పనులు కూడా వేగవంతంగా చేపడుతున్నామని చెప్పారు. ఆప్షన్–3 ఇళ్లు నిర్మించే కాంట్రాక్టర్లతో వారం వారం పనుల పురోగతిపై సమీక్ష చేస్తున్నామని తెలిపారు. పనులు పూర్తయిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పజెబుతున్నామని చెప్పారు. ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న 96.8 వేల మందికి పట్టాలు ఇచ్చామన్నారు. మరో 1.07 లక్షల మందికి పట్టాలు ఇవ్వడానికి సిద్ధమవుతున్నామని చెప్పారు. ఈ క్రమంలో సీఎం వైఎస్ జగన్ ఏమన్నారంటే..

ఏజెన్సీ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోండి. గృహ నిర్మాణంలో వెనకబడ్డ జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి.
- ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే సరికి వైఎస్సార్ జగనన్న కాలనీల్లో డ్రైనేజీ, కరెంటు, తాగు నీరు వంటి కనీస మౌలిక వసతులు కల్పించాలి. ఈ విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడొద్దు. ప్రాధాన్యత పనులపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకుని, ఆ మేరకు అడుగులు ముందుకు వేయాలి. మరో వైపు ఇళ్ల నిర్వహణపైనా ప్రత్యేక దృష్టి పెట్టండి. లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు త్వరగా మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలి.
- ఆప్షన్–3 ఇళ్ల నిర్మాణాలను వేగంగా చేపట్టండి. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ) ప్రకారం కాంట్రాక్ట్ సంస్థలు లే అవుట్లలో బ్రిక్స్ ప్లాంట్ల ఏర్పాటు, ఇతర చర్యలు చేపట్టాయో లేదో పరిశీలించాలి. నిర్మాణమైన ఇళ్లలో సమకూర్చే ఫ్యాన్లు, బల్బులు, ట్యూబ్ లైట్లు నాణ్యమైనవిగా ఉండాలి. కాలనీల రూపంలో కొన్ని చోట్ల ఏకంగా మున్సిపాలిటీలే వెలుస్తున్నాయి. అలాంటి చోట్ల మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పౌర సేవలు తదితర అంశాలపై ప్రత్యేక ప్రణాళిక ఉండాలి.
- ఈ ఏడాది డిసెంబర్ నాటికి అన్ని టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలి. ఈ ఇళ్లలో మౌలిక సదుపాయాల కల్పన పనులను అత్యంత నాణ్యతతో చేపట్టాలి.

> "నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇప్పటిదాకా మొత్తం 21.25 లక్షల ఇళ్లను మంజూరు చేశాం. ఆ ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి. ప్రాధాన్యత పనులపై ప్రధానంగా దృష్టి సారించి, ప్రణాళిక మేరకు పనులు చేపట్టాలి. చాలా చోట్ల కాలనీలు కాదు.. ఏకంగా పట్టణాలనే నిర్మిస్తున్నందున మౌలిక సదుపాయాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా శ్రద్ధ పెట్టాలి."
> – ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఈ సమీక్షలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, సీఎస్ సమీర్ శర్మ, ఏపీఎస్‌హెచ్‌సీఎల్ చైర్మన్ దవులూరి దొరబాబు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీఎస్ సాయి ప్రసాద్, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, గృహ నిర్మాణ సంస్థ ఎండీ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా, టిడ్కో ఎండీ శ్రీధర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు కుప్పం వేదికగా చేయూత

రూ.4,949.44 కోట్లు జమ చేయనున్న సీఎం వైఎస్ జగన్

- వరుసగా మూడో ఏడాది వైఎస్సార్ చేయూత అమలు
- 26,39,703 మంది పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు లబ్ధి
- కుప్పంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్న సీఎం
- భారీ కటౌట్లు, ఫ్లెక్సీలతో పార్టీ శ్రేణులు, అభిమానుల స్వాగత ఏర్పాట్లు



కుప్పంలో వైఎస్సార్ చేయూత ప్రారంభోత్సవానికి ముస్తాబైన సభా ప్రాంగణం

సాక్షి, అమరావతి/చిత్తూరు: వైఎస్సార్ చేయూత పథకం కింద శుక్రవారం చిత్తూరు జిల్లా కుప్పం వేదికగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంప్యూటర్‌లో బటన్ నొక్కి రాష్ట్ర వ్యాప్తంగా 26,39,703 మంది అక్కచెల్లెమ్మల ఖాతాల్లో రూ.4,949.44 కోట్ల ఆర్థిక సాయాన్ని నేరుగా జమ చేయనున్నారు. పేద అక్కచెల్లెమ్మల ఆర్థిక స్వావలంబన, సాధికారతే లక్ష్యంగా వరుసగా మూడో ఏడాది వైఎస్సార్ చేయూత కింద సాయాన్ని అందిస్తున్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు తోబుట్టువుగా ఈ పథకం ద్వారా ఏటా రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో మొత్తం రూ.75 వేలు ఆర్థిక సాయం చేయడం ద్వారా వారి జీవనోపాధిని మెరుగు పరుస్తున్నారు.

ఇప్పటి వరకు రూ.14,110.62 కోట్ల లబ్ధి

- రాష్ట్ర వ్యాప్తంగా 26,39,703 కుటుంబాల్లోని మహిళలకు తద్వారా కోటి మంది జనాభాకు మేలు కలిగిస్తూ ఇప్పటి వరకు వైఎస్సార్ చేయూత ద్వారా రూ.14,110.62 కోట్లు (నేడు జమ చేసే మొత్తంతో కలిపి) అందించారు. అంటే మూడేళ్లలో అర్హులైన ఒక్కో లబ్ధిదారుకు రూ.56,250 చొప్పున జమ చేశారు.
- వైఎస్సార్ చేయూత పథకం ద్వారా అందిన నగదును లబ్ధిదారులు చిన్న, మధ్యతరహా వ్యాపారాలు చేసుకోవడానికి, ఇతర అవసరాలకు, జీవనోపాధి కార్యక్రమాలకు వినియోగించుకునేందుకు ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛనిస్తోంది.
- సాంకేతిక, బ్యాంకింగ్, మార్కెటింగ్ సహకారాలు అందిస్తూ.. కిరాణా షాపులు, గేదెలు, ఆవులు, మేకల పెంపకం వంటి వాటి ద్వారా జీవనోపాధి మార్గాలను చూపిస్తోంది. దిగ్గజ సంస్థలు, బ్యాంకులతో ఒప్పందం చేసుకుని వారి వ్యాపారాలను ముందుకు నడిపిస్తోంది.
- వీటితో పాటు 60 ఏళ్లు నిండిన అర్హులైన వారికి వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా ప్రతి నెలా 1వ తేదీనే కచ్చితంగా పింఛన్ పంపిణీ చేస్తోంది. అమ్మ కడుపులోని బిడ్డ నుంచి అవ్వల వరకు అందరినీ అన్ని దశల్లోనూ కంటికి రెప్పలా ఆదుకుంటోంది.

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం కుప్పంలో పర్యటించనున్నారు. అనిమిగానిపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వైఎస్సార్ చేయూత మూడో విడత నగదు జమ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా కుప్పం పురపాలక సంఘం అభివృద్ధికి సంబంధించి రూ.66 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన, రూ.11 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ప్రారంభోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. సీఎం హోదాలో వైఎస్ జగన్ తొలిసారి ఇక్కడ పర్యటించనున్న నేపథ్యంలో భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు, స్వాగత తోరణాలతో కుప్పం నిండిపోయింది. కుప్పం చెరువు వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి బహిరంగ సభ వేదిక వరకు మూడు కిలోమీటర్ల మేర దారిపొడవునా స్వాగత తోరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. తగిన విధంగా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కాగా, ముఖ్యమంత్రి ఉదయం 9.15 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి, రేణిగుంట మీదుగా 10.45 గంటలకు కుప్పం చేరుకుంటారు. ఇక్కడ కార్యక్రమాల అనంతరం తిరిగి మధ్యాహ్నం 3.10 గంటలకు తాడేపల్లి చేరుకుంటారు.

జీవనోపాధి పెంపు ఇలా..

- ఇప్పటి వరకు 5,82,662 మంది అక్కచెల్లెమ్మలు వైఎస్సార్ చేయూత ద్వారా కుటుంబ జీవన ప్రమాణాలను పెంచుకున్నారు. వీరిలో 1.10 లక్షల మంది కిరాణా దుకాణాలు, 60,995 మంది వస్త్ర వ్యాపారం, 1,15,446 మంది ఇతర జీవనోపాధి, 2,96,221 మంది ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల పెంపకంలో రాణిస్తూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.
- ప్రతి మండలానికి ఒక వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ ద్వారా అక్కచెల్లెమ్మలకు తక్కువ ధరకే నాణ్యమైన సరుకులు అందించడంతో పాటు మార్కెటింగ్‌లో శిక్షణ ఇవ్వడం ద్వారా ప్రభుత్వం వారిని వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దుతోంది.
- కిరాణా దుకాణాలు ఏర్పాటు చేసుకున్న అక్కచెల్లెమ్మలకు ఐటీసీ, హెచ్‌యూఎల్, పీఅండ్‌జీ, రిలయెన్స్ వంటి కార్పొరేట్ కంపెనీలతో టైఅప్ చేయించి మార్కెట్ రేటు కంటే తక్కువకు నాణ్యమైన సరుకులు అందేలా చర్యలు తీసుకుంది. పాడి గేదెలు, ఆవులు కొనుగోలు చేయడానికి సహాయం చేస్తూనే అమూల్ భాగస్వామ్యంతో మార్కెట్‌లో ఇస్తున్న ధర కంటే లీటర్ పాలపై రూ.5 నుంచి రూ.15 వరకు అదనంగా అందిస్తోంది.
- పేద అక్కచెల్లెమ్మలకు ఆర్థిక శక్తిని అందిస్తే వారి కుటుంబానికి మంచి జరుగుతుందని, జీవన స్థితిగతులు మెరుగు పడతాయన్న ఉద్దేశంతో సీఎం జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వివిధ పథకాల ద్వారా 5,30,01,223 మంది అక్కచెల్లెమ్మలకు రూ.2,39,013.40 కోట్లు లబ్ధి చేకూర్చారు.

రోజూ ప్రత్యేక మెనూ



గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాల్లో నాడు–నేడు పనులపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం వైఎస్ జగన్

▶ మొదటి పేజీ తరువాయి

పర్యవేక్షణ జరగాలి. ఇందుకోసం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ), ప్రత్యేక యాప్ రూపొందించాలి. గురుకుల పాఠశాలలు, వెల్ఫేర్ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు, భోజనం నాణ్యత, నిర్వహణ తదితర అంశాలపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ జరగాలి. ఇందుకోసం ఒక్కో అధికారికి ప్రత్యేక పరిధిని నిర్ణయించి సమగ్రంగా పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలి. మండలాల్లో స్కూళ్ల నిర్వహణ, పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా నియమిస్తున్న రెండో ఎంఈఓకు సంబంధించి విధివిధానాలు ఖరారు చేయాలి' అని ఆదేశించారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

నాణ్యమైన భోజనం పెట్టాలి

- రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లలో దాదాపు 6 లక్షల మంది విద్యార్థులున్నారు. వీరికి పెట్టే భోజనం అత్యంత నాణ్యతగా ఉండాలి. అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో భోజనంలో నాణ్యత పెంచాలి. ప్రతిరోజూ ఒక మెనూ ఇవ్వాలి. ఈ మేరకు అవసరమైన ప్రతిపాదనలు ఇవ్వండి.
- హాస్టల్ పిల్లలకు ఇచ్చే కాస్మోటిక్స్ సహా వస్తువులన్నీ నాణ్యతతో ఉండాలి. విద్యాకానుకతో పాటు వీటిని కూడా అందించడానికి చర్యలు తీసుకోవాలి. హాస్టళ్లలో పారిశుద్ధ్యం, పరిశుభ్రతలపై దృష్టి పెట్టాలి. డ్రైనేజీని లింక్ చేయడంపై కూడా శ్రద్ధ వహించాలి. హాస్టళ్లలో టాయిలెట్ల నిర్వహణ, మౌలిక సదుపాయాల నిర్వహణ బాగుండాలి.
- వైద్యులు క్రమం తప్పకుండా హాస్టళ్లకు వెళ్లి, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించాలి. (ఇందుకోసం ప్రత్యేక యాప్ రూపొందిస్తున్నామని అధికారులు తెలిపారు) విలేజ్ క్లినిక్స్, స్థానిక పీహెచ్‌సీలతో ప్రభుత్వ హాస్టళ్లను మ్యాపింగ్ చేయాలి. హాస్టళ్ల నిర్వహణలో సిబ్బంది ఖాళీలను గుర్తించి, భర్తీ చేయాలి. వీటన్నింటిపై తగిన కార్యాచరణ సిద్ధం చేసి నాకు నివేదించాలి.

నాడు–నేడు ప్రతిపాదనలు ఇలా

- రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో నాడు–నేడు కింద టాయిలెట్లు, విద్యుదీకరణ, ఫ్యాన్లు, లైట్లు, తాగునీరు, పెయింటింగ్, మరమ్మతులు, ప్రహరీ గోడలు, మస్కిటో ప్రూఫింగ్ పనులు, సిబ్బందికి.. విద్యార్థులకు ఫర్నిచర్.. డెస్క్‌లు, బంకర్ బెడ్స్, స్టడీ టేబుల్స్, చైర్లు, ఆఫీసు టేబుళ్లు, లైబ్రరీ రాక్స్, షూ రాక్స్, డైనింగ్ టేబుల్, గార్బేజ్ బిన్స్ తదితరాలకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు సీఎంకు వివరించారు.
- కిచెన్ ఆధునికీకరణలో భాగంగా స్టోరేజీ రాక్స్, గ్యాస్ స్టవ్స్, గ్రైండర్, పూరి మేకింగ్ మెషీన్, ప్రెషర్ కుక్కర్, ఇడ్లీ కుక్కర్, చిమ్నీ, కుకింగ్ వెసల్స్, డస్ట్ బిన్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. 55 ఇంచ్‌ల స్మార్ట్ టీవీతో పాటు క్రీడా సామగ్రి, లైబ్రరీ బుక్స్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు తయారు చేశామని తెలిపారు.

ఈ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి (గిరిజన సంక్షేమ శాఖ) పీడిక రాజన్న దొర, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖ మంత్రులు మేరుగు నాగార్జున, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, పాఠశాల విద్యా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శాప్ క్రీడగా కరాటే

- అధికారులకు సీఎం వైఎస్ జగన్ ఆదేశం
- సీఎంను కలిసిన అంతర్జాతీయ కరాటే చాంపియన్ అరబండి కార్తీక్ రెడ్డి
- రూ.10 లక్షల నగదు ప్రోత్సాహకం



సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన అంతర్జాతీయ కరాటే చాంపియన్ కార్తీక్ రెడ్డి

సాక్షి, అమరావతి: కరాటేను శాప్ క్రీడగా గుర్తించేలా తగిన చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడలలో పతకాలు సాధించిన క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం.. క్రీడలకు మరింత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో గురువారం తిరుపతికి చెందిన అంతర్జాతీయ కరాటే చాంపియన్ అరబండి కార్తీక్ రెడ్డి వైఎస్ జగన్‌ను కలిశారు. తాను సాధించిన పతకాలను ఆయనకు చూపించి, ప్రభుత్వం నుంచి తనకు సహకారం కావాలని విన్నవించారు. సీఎం వెంటనే స్పందిస్తూ అతనికి రూ.10 లక్షల నగదు ప్రోత్సాహకం ప్రకటించారు. మున్ముందు అవసరమైన మేరకు మరింత సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. అంతర్జాతీయ వేదికలపై తెలుగు వారి ఖ్యాతిని నిలబెడుతున్న క్రీడాకారులను ఈ సందర్భంగా సీఎం అభినందించారు. కాగా, ఇటీవల జరిగిన కామన్‌వెల్త్ కరాటే చాంపియన్‌షిప్‌లో కార్తీక్ భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. అండర్ 16 బాలుర 70 కేజీల కుమిటే విభాగంలో స్వర్ణ పతక విజేతగా నిలిచాడు. ఏప్రిల్‌లో లాస్‌వేగాస్‌లో జరిగిన యూఎస్‌ఏ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు. దీంతో వరసగా రెండు స్వర్ణాలు నెగ్గిన తొలి ఇండియన్ ప్లేయర్‌గా రికార్డు సృష్టించాడు. అక్టోబర్‌లో టర్కీలో వరల్డ్ కరాటే ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే అఫీషియల్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో సైతం పతకం సాధిస్తానని కార్తీక్ ధీమా వ్యక్తం చేశాడు. కార్తీక్‌తో పాటు తల్లిదండ్రులు శిరీషా రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మంత్రి ఆర్కే రోజా సీఎంను కలిశారు.

పెరుగుతున్న గోదావరి

పోలవరం రూరల్/శ్రీశైలంప్రాజెక్ట్/విజయపురిసౌత్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, ఉపనదుల నీటితో గోదావరిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రానికి పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద నీటిమట్టం 30.710 మీటర్లకు చేరుకుంది. స్పిల్‌వే మీదుగా 3,21,805 క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తోంది. శ్రీశైలం జలాశయానికి 1,38,522 క్యూసెక్కుల కృష్ణా వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. బుధవారం రాత్రి ఎనిమిది గేట్లను తెరచి నీరు విడుదల చేసిన అధికారులు ప్రవాహం తగ్గడంతో గురువారం సాయంత్రం ఏడు గేట్లను మూసివేశారు. ప్రస్తుతం ఒక గేటును పదడుగులు ఎత్తి 27,800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బుధవారం నుంచి గురువారం వరకు కుడి, ఎడమగట్టు కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి అనంతరం 66,155 క్యూసెక్కులను దిగువకు వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 884.40 అడుగుల మట్టంలో 212.4385 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నాగార్జునసాగర్ జలాశయానికి 84,913 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. సాగర్ నాలుగు రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా 31,980 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన అనంతరం మరికొంత నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్‌లో 589 అడుగుల మట్టంలో 309.0570 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

అరటి ఉత్పత్తులు పెంచేలా పరిశోధనలు

పులివెందుల రూరల్: ఏపీ కార్ల్ పరిశోధన కేంద్రంలో అరటి ఉత్పత్తులు పెంచే విధంగా పరిశోధనలు జరుగుతున్నాయని ఏపీ కార్ల్ చైర్‌పర్సన్ పూనం మాలకొండయ్య చెప్పారు. గురువారం వైఎస్సార్ జిల్లా పులివెందుల పరిధిలోని ఏపీ కార్ల్‌లో ఆమె డైరెక్టర్లతో సమావేశమయ్యారు. అరటిపై పరిశోధనలు చేయడానికి శాస్త్రవేత్తలను, సిబ్బందిని నియమిస్తున్నట్లు ఆమె చెప్పారు. పులివెందుల అరటికి విదేశాల్లో మంచి గిరాకీ ఉందన్నారు. ఏపీ కార్ల్‌లో రూ.5 కోట్ల వ్యయంతో పశువులకు ఇన్ఫెక్షన్ నివారణకు వ్యాక్సిన్లు తయారు చేసి.. ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సుమారు రూ.270 కోట్లతో ఏర్పాటు చేస్తున్న అరటి పరిశోధన కేంద్రం పనులను ఆమె పరిశీలించారు. ఏపీ కార్ల్ సీఈవో రమణారెడ్డి, ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్కార్యాల్లో, దైవభక్తికి సంబంధించిన పనుల్లో పరస్పరం సహకరించుకోండి. పాపకార్యాల్లో, హింసా దౌర్జన్యాల్లో ఎవరికీ సహకరించకూడదు. దేవునికి భయపడండి. నేరస్థుల్ని ఆయన కఠినంగా శిక్షిస్తాడని తెలుసుకోండి.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, సెప్టెంబర్, 23

‘అణు’ పల్లవి!

కొన్ని మొదలుపెట్టడం సులభమే. ముగించడమే కష్టం. రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఇప్పుడు ఆ సంగతి బాగా తెలిసొచ్చినట్టుంది. సరిగ్గా 7 నెలల క్రితం ఫిబ్రవరి 24న లక్షన్నర పైగా సైనికులతో, వివిధ మార్గాల ద్వారా ఉక్రెయిన్‌పై ‘ప్రత్యేక సైనిక ఆపరేషన్’కు సిద్ధమైనప్పుడు ఆ దేశాన్ని లొంగదీసుకోవడం ఆయన సులభమనుకున్నారు. తీరా అమెరికా, ఐరోపాల ఆర్థిక, సైనిక అండదండలతో ఉక్రెయిన్ ఎదురుదెబ్బకి దిగేసరికి పీటముడి పడింది. పాశ్చాత్యలోకం నుంచి ముప్పు ఉందంటూ, 3 లక్షల మందితో పాక్షిక సైనిక సమీకరణకు సిద్ధమవుతున్నట్టు బుధవారం పుతిన్ చేసిన ప్రకటన మొదట అనుకున్న వ్యూహం విఫలమైందనడానికి స్పష్టమైన సంకేతం. జాతిని ఉద్దేశించి టీవీలో ప్రసంగిస్తూ, అణుదాడులకు సిద్ధమన్న ఆయన మాట ఇప్పుడు ప్రపంచ దేశాల్ని కలవరపెడుతోంది. ఇవి ఉత్తుత్తి మాటలు కావనడంతో ఆయన బెదిరింపు ధోరణి బాధ్యతారహితమనీ, ఐరాస నిబంధనావళికి విరుద్ధమనీ అమెరికా అధ్యక్షుడు ఖండించాల్సి వచ్చింది. వెరసి, అంతులేని కథగా సాగుతున్న ఉక్రెయిన్ అంశం మళ్ళీ ఒక్కసారిగా అందరిలో వేడి పెంచింది.

అణ్వస్త్ర దేశాల్లో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనాతో పాటు రష్యా ఒకటి. అణుయుద్ధం చేయరాదంటూ ఈ జనవరి 3న రష్యా సహా ఆ దేశాలన్నీ సమష్టి ప్రకటన చేశాయి. ఆ తర్వాతే ఉక్రెయిన్‌పై పుతిన్ ఆకస్మిక దాడి ఆరంభించారు. సమయానికి తగ్గట్టు మాటలు, చేష్టలు మార్చేయడం సోవియట్ యూనియన్ విచ్ఛిన్నాన్ని ఇప్పటికీ జీర్ణం చేసుకోలేకపోతున్న ఈ మాజీ రష్యన్ గూఢచారికి మంచినీళ్ళ ప్రాయం. ఉక్రెయిన్‌లో తాము పట్టు బిగించిన తూర్పు, దక్షిణ ప్రాంతాలపై దృష్టి నిలపడానికి ఆ మధ్య కీవ్, ఖార్కివ్‌ల నుంచి రష్యా సేనల్ని ఉపసంహరించుకున్నారు. తీరా ఈ నెల మొదట్లో ఉక్రెయిన్ మెరుపుదాడితో ఈశాన్యంలో దెబ్బతిని, సైన్యం తిరోగమించింది. ప్రతీకారంతో రగిలిపోతున్న పుతిన్ ‘అణు’పల్లవి అందుకున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత తొలి సారి సైనిక సమీకరణకూ దిగారు. అదేమంటే సోవియట్‌లా రష్యా విచ్ఛిత్తికీ కుట్ర జరుగుతోందన్నారు.

ఒక పక్క ఇలా సమరం చేస్తూనే, మరోపక్క ఉక్రెయిన్‌లో తమ స్వాధీనంలోకి వచ్చిన కీలక ప్రాంతాల్లో రష్యన్ సమాఖ్యలో చేరికపై ప్రజాభిప్రాయ సేకరణలు జరిపించాలని పుతిన్ ప్రయత్నం. ఆ కంటితుడుపు రిఫరెండమ్‌ల వెనుక ఉద్దేశం, వచ్చే ఫలితం ఇట్టే ఊహించవచ్చు. వాటిని అడ్డుపెట్టుకొని, ఉక్రెయిన్‌లో పట్టుబిగించిన ప్రాంతాలను కలిపేసుకొని ముందరికాళ్ళకు బంధం వేయాలని రష్యా వ్యూహం. గురువారం ఐరాస భద్రతామండలి సైతం రిఫరెండం ప్రతిపాదనల్ని ఖండిస్తూ, కనుచూపు మేరలో యుద్ధానికి ముగింపు కనపడకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. ఇక, యుద్ధభూమిలో ఎక్కడ, ఎవరిది, ఎంత పైచేయి అన్నది పక్కనపెడితే ఉక్రెయిన్‌కు సైతం భరించలేని ఉక్కపోత ఉంది. అమెరికా, ఐరోపా దేశాల అండ చూసుకొని బరిలో నిలిచిన ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీకి సైతం ఇప్పుడు తగిలిన దెబ్బలతో తత్త్వం తలకెక్కుతోంది. బుధవారం ఐరాస సర్వప్రతినిధి సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, తమ దేశ శాంతిభద్రతల పరిరక్షణకు అంతర్జాతీయ సమాజం పంచసూత్రాలు పాటించాలని ఆయన అభ్యర్థించడం అందుకు తాజా ఉదాహరణ.

ఉక్రెయిన్ బాధ... ప్రపంచపు బాధగా భావించాలనేదే ఇప్పటికీ జెలెన్‌స్కీ ధోరణి. చిత్రం ఏమిటంటే, ఆంక్షల వల్ల రష్యాపై పెద్దగా ప్రభావం పడకపోయినప్పటికీ, పాశ్చాత్య ప్రపంచం మాత్రం అదే మంత్రాన్ని నమ్ముకున్నట్టుంది. తాజాగా 8వ విడత ఆంక్షలను రష్యాపై విధించింది. నిజానికి, పలు పాశ్చాత్య ఆహార, వస్తూత్పత్తి బ్రాండ్లు తమ భూభాగాన్ని వీడినా, రష్యా సొంత బ్రాండ్లు సృష్టించుకుంటోంది. చైనా నుంచి సరకుల సరఫరా సాగుతుండడంతో ఆ విధమైన నొప్పి కూడా తెలియడం లేదు. రష్యా నుంచి గ్యాస్ సరఫరాకు ఆంక్షలు పెట్టి, పాశ్చాత్య ప్రపంచమే ఇరుకున పడింది. ఐరోపా, అమెరికాలతో పోలిస్తే రష్యాలోనే ద్రవ్యోల్బణం తక్కువగా ఉంది. నిజానికి, రష్యా గడపలోకొచ్చి ‘నాటో’ రెచ్చగొట్టడం వల్లే పుతిన్ దూకుడు చూపారు. కానీ, అరకొర వ్యూహం, అతిగా బలాన్ని అంచనా వేసుకోవడంతో తంటా వచ్చింది. ‘నాటో’కు ముకుతాడు వేయాలన్న వ్యూహం ఫలించకపోగా, బలహీనపడుతున్న కూటమి ఫిన్లాండ్, స్వీడన్ లాంటి కొత్త చేరికలతో బలం పుంజుకుంది. లేని ప్రాసంగికతను సమకూర్చుకుంది. ఇది పుతిన్ వ్యూహాత్మక తప్పిదమే!

పరిమిత యుద్ధంతో సైనిక లక్ష్యాలు సాధించాలని మొదలుపెట్టిన పుతిన్ వెనక్కి రాలేనంత దూరం వెళ్ళారు. ఈ ప్రక్రియలో తడబడి కిందపడ్డా, తనదే పైచేయిగా చూపాలని తాపత్రయపడుతున్నారు. నిన్నటి దాకా ‘నిస్సైనికీకరణ’ అన్న రష్యా ఇప్పుడు సమష్టి పాశ్చాత్య ప్రపంచంపై యుద్ధం అంటోంది. అతివాద జాతీయతతో పుతిన్ రేపిన ఈ యుద్ధం రష్యా యుద్ధమనే రంగు అద్దుకుంది. కానీ, ఇప్పటికే వేల సంఖ్యలో సైనికుల్ని కోల్పోయిన రష్యాలో తాజా సైనిక సమీకరణ యత్నంపై వందల మంది నిరసనకు దిగారు. మొదట నల్లేరుపై బండి నడక అనుకున్న ఉక్రెయిన్‌పై విజయం ఇప్పుడు పుతిన్‌కు ముగింపు తెలియని పీడకలగా మారింది. ఈ పరిస్థితుల్లో ఈ గాయపడ్డ పులి ఎలాంటి దుందుడుకు చర్యలకు దిగుతుందో? ఐరాసను ఆడిస్తున్న పాశ్చాత్య ప్రపంచం సైతం భేషజాలతో అగ్నికి ఆజ్యం పోసే కన్నా, సామరస్య పరిష్కారానికి కృషి చేస్తే మేలు. ఇటీవల సమర్కండ్‌లో పుతిన్‌ను కలిసినప్పుడు భారత ప్రధాని చెప్పినట్టు ప్రపంచంలో ‘‘సమరానికి ఇది సమయం కాదు.’’ కరోనా అనంతర క్లిష్టపరిస్థితుల్లో కావాల్సింది శాంతి, సామరస్యం, సౌభాగ్యాలే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.త్రయోదశి రా.1.35 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** మఖ తె.4.11 వరకు (తెల్లవారితే శనివారం) తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ప.3.11 నుండి 4.55 వరకు **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.05 వరకు, తదుపరి ప.12.16 నుండి 1.04 వరకు, **అమృతఘడియలు:** రా.1.35 నుండి 3.20 వరకు.

సూర్యోదయం : 5.52
సూర్యాస్తమయం: 5.55
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

అంబేడ్కర్ పేరు ఎందుకు పెట్టాలంటే...

ప్రపంచంలో ఇప్పటివరకూ ఏ దేశస్థులూ తమ పార్లమెంట్ భవనానికి ఒక వ్యక్తి పేరు పెట్టుకున్న దాఖలాలు లేవు. కానీ భారత నూతన పార్లమెంట్ భవనానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టాలన్న డిమాండ్ బయలుదేరింది. దీనిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న తరుణమిది. కొంతమంది ఇది సమంజసమైనది కాదంటున్నారు. కానీ ఈ దేశంలో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సంక్షేమం, లౌకికత్వం వంటి ప్రజాస్వామ్య లక్షణాలు పాదుకొల్పడానికీ, అవి సజావుగా మనగలగడానికీ రాజ్యాంగంలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినవారు అంబేడ్కర్. అటువంటి వ్యక్తి పేరు ప్రజాస్వామ్యానికి వాహికైన పార్లమెంట్ భవనానికి పెట్టడం ముమ్మాటికీ సబబే అని మరికొందరు అంటున్నారు. పేరు అంటూ పెట్టాల్సి వస్తే రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యాన్ని వ్యవస్థీకరించడంలో కీలక పాత్ర పోషించిన అంబేడ్కర్ పేరు పెట్టడమే సముచితం.

ప్రపంచానికి పరివర్తన సంకేతం

సందర్భం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

ప్రస్తుతం ఒక సరికొత్త డిమాండ్ పుట్టుకొచ్చింది. న్యూఢిల్లీలోని సెంట్రల్ విస్టాలో నిర్మించిన కొత్త పార్లమెంట్ భవనానికి తప్పకుండా అంబేడ్కర్ పేరు పెట్టాలన్నదే ఆ డిమాండ్. హైదరాబాద్ నగరంలో కొత్తగా నిర్మిస్తున్న సచివాలయ భవనానికి బీఆర్ అంబేడ్కర్ పేరు పెడుతున్నట్లు తెలంగాణ ప్రభుత్వం 2022 సెప్టెంబర్ 15న ప్రకటించింది. కొత్త పార్లమెంట్ భవనానికి ‘అంబేడ్కర్ పార్లమెంట్’ అని పెట్టాల్సిందిగా తాను ప్రధానికి ఉత్తరం రాస్తానని కూడా తెలంగాణ సీఎం కేసీఆర్ చెప్పారు. దీని చుట్టూ దేశంలోని వివిధ ప్రాంతాల్లో సోషల్ మీడియా చర్చలు మొదలైపోయాయి. దీనిపై రెండు ముఖ్యమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒక వ్యక్తికి ఎంత స్థాయి, ఆమోదనీ యత ఉన్నా సరే... దేశం కోసం దీర్ఘకాలంగా చట్టాలను రూపొందిస్తున్న పార్లమెంట్‌కు ఆ వ్యక్తి పేరు పెట్టవచ్చా? భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలుగా నిలిచిన మరికొందరిని పక్కనబెట్టి ఈ కొత్త భావనకు అంబేడ్కర్ అర్హుడేనా?

తొలి ప్రశ్నకు సమాధానం పూర్తిగా నైతిక పరమైనది. సాధారణంగా పార్లమెంట్ భవంతికి ఒక వ్యక్తి పేరు పెట్టరు. ఆ వ్యక్తి ఎంత గొప్పవారైనా సరే. కానీ భారతదేశంలో ప్రతి విషయానికీ వ్యక్తుల పేర్లను తగిలించే పద్ధతి, సంస్కృతి ఉన్నాయి కదా. అలాంటప్పుడు దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మించడంలో గొప్పగా దోహదం చేసిన ఏ వ్యక్తి పేరయినా పార్లమెంట్ భవనానికి ఎందుకు పెట్టకూడదు?

ఇక రెండో ప్రశ్నకు సమాధానంగా భారత దేశంలో రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యాన్ని వ్యవస్థీకరించడంలో కీలక పాత్ర పోషించిన ముగ్గురు వ్యక్తులను తులనాత్మకంగా మదింపు చేయవలసి ఉంది. వారెవరో కాదు. అంబేడ్కర్, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయి పటేల్. వీరిలో నెహ్రూ పట్ల ద్వేషపూరిత దృక్పథం రాజ్యమేలుతోంది. ప్రధాని మోదీ ఇప్పుడు నెహ్రూతో, ఆయన కుటుంబంతో ప్రత్యక్షంగా ఘర్షణాత్మక వైఖరితో వ్యవహరిస్తున్నారు. మోదీ ప్రభుత్వం సానుకూలత ప్రదర్శించడానికి అవకాశం గల పేర్లు రెండే. అవి అంబేడ్కర్, పటేల్.

పటేల్ నేపథ్యం, పరిణామ క్రమం చూస్తే ఆయన గొప్ప పోరాటయోధుడిగా, కార్యకర్తగా, నేతగా, పాలనా దురంధరుడిగా నిరూపించుకున్నారు. ఉక్కు సంకల్పంతో దేశాన్ని ఐక్యం చేసినవానిగా నిలిచి పోయారు. వృత్తిరీత్యా ఆయన న్యాయవాది. కానీ పటేల్ ఎన్నడూ న్యాయ తత్వవేత్త, చరిత్రకారుడు, ఆర్థికవేత్త, ప్రాపంచిక వ్యవహారాలలో నిపుణుడు కాలేదు.

మరోవైపు దయనీయంగా అస్పృశ్యతను అనుభవించి వచ్చిన అంబేడ్కర్, అనేకమందిలో ఒకే ఒక్కడుగా పరిణమించారు. ఆయన కూడా పోరాటయోధుడు, యాక్టివిస్టు, లీడర్, తనదైన కోణంలో పాలనా దురంధరుడు కూడా. న్యాయ, నైతిక పరమైన తత్వవేత్త. చరిత్ర, సామాజిక శాస్త్రం, రాజకీయ అర్థ శాస్త్రం వంటి అంశాలలో శిక్షణ పొందారు. భారతీయ చరిత్రపై, బౌద్ధ, వైదిక, జైన, ఇస్లాం, క్రైస్తవ వగైరా బహుళ ప్రాపంచిక ఆలోచనా విధానాలపై అపారమైన పట్టు ఉండేది. రాజ్యాంగ రచన చేస్తూ, దాంట్లోని అన్ని ఆర్టికల్స్‌నీ రాజ్యాంగ సభలో ఆమోదింపజేసుకుంటున్నప్పుడు ఆయన దీక్ష గానీ, ఆయన జోక్యం చేసుకున్న తీరు గానీ మరే వ్యక్తిలో కంటే ఎక్కువగా ప్రదర్శితమయ్యేవి.

ఢిల్లీ అధికార వ్యవస్థలు కాంగ్రెస్ పూర్తి నియంత్రణలో ఉన్నంతకాలం ఆయన్ను నిర్లక్ష్యం చేశారు. మండల్ కమిషన్ అనంతర కాలంలో భారత్ అంబేడ్కర్‌ను అధికాధికంగా కనుగొంది. రాజ్యాంగ సభలో ఆయన రాసిన రచనలు, చేసిన ప్రసంగాలు భారత్ సంక్షోభంలోకి ప్రవేశించిన ప్రతి సందర్భంలోనూ ప్రజాస్వామ్య రక్షణకు ఆయుధాలుగా మారాయి. అందుకే భారతీయ ప్రజాస్వామ్యం, అంబేడ్కర్ పర్యాయ పదాలై పోయాయి. ‘మండల్’ అనంతర కాలాలు భారత్‌ను ఒక జాతిగా మల్చడంలో ఆయన నిబద్ధతా శక్తిని పునరుత్థానం చెందించాయి. భారతీయ



ప్రజాస్వామిక సంప్రదాయ జ్ఞానాన్ని ఆయన సంశ్లేషించారు. ప్రత్యేకించి బౌద్ధులు, గిరిజన జనాభాకు చెందిన సంప్రదాయిక జ్ఞానాన్ని ఆయన రాజ్యాంగంలోకి తీసుకురావడమే కాదు... రాజ్యాంగంలోని ప్రతి ఒక్క నిబంధనకు న్యాయం చేయడానికి, రాజ్యాంగ సభ ఉపన్యాసాలలో వాటిని పొందుపర్చారు. ప్రత్యేకించి ఇంగ్లండ్, అమెరికాల్లోనూ; ఇంకా అనేక దేశాల్లోనూ ఉద్భవించిన పాశ్చాత్య రాజ్యాంగ మూల సూత్రాలు ఆయనకు తెలిసినప్పటికీ, భారతీయ చరిత్ర నుంచి సాధికారికమైన సందర్భోచితమైన ఎన్నో మూలసూత్రాలను రాజ్యాంగంలో పొందుపర్చారు. అందు చేత మన జాతీయవాదాన్ని ఆయన ఏ ఒక్కదాని కంటే మిన్నగా ఉన్నత స్థానంలో నిలిపారు. బుద్ధుడి ఉపమానాలను, అశోకుడి పాలనా సూత్రాలు, చిహ్నాలను ఆధునిక కాలంలో కూడా పునశ్చరణ కావడానికి అంబేడ్కరే కారణం.

ఫ్రెంచ్ ఆలోచనా విధానం నుంచి కాకుండా, మన ప్రాచీన భారత చరిత్ర నుండి ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం–సౌభ్రాతృత్వం అనే మూడు కీలక సూత్రాలను పదే పదే వల్లించేవారు. ఆయన జాతీయవాదానికి మూలాలు... పురాణాల్లో కాకుండా భారతీయ ప్రజారాశుల సజీవ ఉత్పాదకతా జీవితం నుంచి పుట్టుకొచ్చాయి. చారిత్రకంగా పీడితులైన దళితులు, ఆదివాసులు, శూద్ర ప్రజానీకం ఈరోజు తమ జీవితాల్లో నెమ్మదిగా అయినా సరే కచ్చితంగా మార్పులు వస్తున్నందుకు అంబేడ్కర్‌కు రుణపడి ఉంటున్నారు.

ఈ అన్ని కారణాల వల్ల భారత నూతన పార్లమెంట్ భవంతికి అంబేడ్కర్ పేరు పెట్టినట్లయితే, భారతదేశంలో ఒక నిజమైన నాగరికతా పరివర్తన చోటు చేసుకుంటోందని ప్రపంచం గుర్తిస్తుంది. అప్పుడు మాత్రమే భారతీయ సంపూర్ణ నిర్వలసీకరణ ప్రక్రియ కొత్త ఉదాహరణను ప్రతిష్ఠించుకుంటుంది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

ప్రత్యామ్నాయ భావజాల దార్శనికుడు

సందర్భం



డా॥ కత్తి పద్మారావు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావి. భారత రాజ్యాంగ నిర్మాత. ఆయన పేరు పార్లమెంట్‌కు పెట్టడం సముచితమైంది. భారతదేశంలో కులం చట్రం నుండి బయటకు రాలేక చాలామంది దేశ నాయకులు ప్రపంచ మేధావులు కాలేక పోయారు. అంబేడ్కర్ ప్రపంచ మేధావిగా ఎదగడానికి కారణం అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో సాగిన ఉన్నత విద్యాభ్యాసం, పరిశోధనలే. ఇక్కడ సంపాదించిన జ్ఞానంతోనే అస్పృశ్యత, లింగవివక్ష, మతమౌఢ్యాలన్నింటినీ ఎదిరించగలిగాడు. ప్రత్యామ్నాయ తత్వాన్ని రూపొందించగలిగాడు.

రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుల్లోనూ, పార్లమెంట్ లోనూ, బహిరంగ వేదికల మీదా అనర్గళంగా మాట్లాడాడు. ఎన్నో పుస్తకాలు రాశాడు. హౌస్ ఆఫ్ కామన్స్ (బ్రిటిష్ పార్లమెంట్)లో ఆయన శత జయంతిని జరిపారంటే... ఆయన స్థాయి ఏమిటో అర్థమవుతుంది. ముక్కుసూటిదనం, తప్పును నిర్భయంగా ఖండించే తత్వం, అధ్యయన శీలత, దేశం పట్ల ప్రేమ ఆయన్ని దార్శనికునిగా నిలిపాయి. ఆయన 1951 అక్టోబర్ 29న పాటియాలాలో జరిగిన ఒక మహాసభలో మాట్లాడుతూ... ‘కాంగ్రెస్‌లో చేరాల్సిందిగా నాపై ఎంతో ఒత్తిడి తెచ్చారు. నా అస్పృశ్యులకు ఏమాత్రం మంచి పని చేయని పార్టీలో నేనెందుకు చేరాలి? నేను చేరలేదు సరికదా మంత్రి పదవికి కూడా రాజీనామా చేశాను. ఇతర మంత్రులను రాజీనామా చేయమని అడిగినట్లుగా నన్నెవరూ రాజీనామా చేయమని అడగలేదు. నాపై ఎటువంటి ఆరోపణలూ లేవు. ఎవరైనా నా శీలంపైన మచ్చపడే విధంగా ఏవైనా చెప్పమని ఛాలెంజ్ చేశా. నాపై వేలెత్తి చూపడానికి ఏ ఒక్కరూ సాహసించలేదు’ అన్నాడు.

ఇక రాజ్యాంగ రచన దగ్గరికొద్దాం. రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్ రాసింది. రాజ్యాంగానికి ఒక రూపాన్ని ఇచ్చే నిమిత్తం ఏడుగురు సభ్యులతో ఒక ‘రాజ్యాంగ ముసాయిదా రూపకల్పన సంఘం’ ఏర్పాటు చేయబడింది. ఆ సంఘానికి అంబేడ్కర్ అధ్యక్షులు. వివిధ ఉప సంఘాలు పంపిన నివేదికలను క్రోడీకరించి, క్రమబద్ధీకరించి ఆ సంఘం రాజ్యాంగ ముసాయిదాను (చిత్తుప్రతి) తయారు చేసింది. 1948 జనవరిలో ఆ రాజ్యాంగ ముసాయిదా ప్రచురించబడి విడుదలయింది. ఆ ముసాయిదా రాజ్యాంగానికి 7,635 సవరణల ప్రతిపాదనలు వచ్చాయి. అయితే, వాటిలో కేవలం 2,473 సవరణలను మాత్రమే రాజ్యాంగ పరిషత్ చర్చించింది. మిగిలిన వాటిని తిరస్కరించింది. నూతన రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న రాజ్యాంగ పరిషత్ ఆమోదించగా, 1950 జనవరి 26 నుండి అమలులోకి వచ్చింది. దీంతో భారత్ గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించింది.

1947 ఏప్రిల్ 29వ తేదీన సమావేశమైన చట్టసభలో అస్పృశ్యతను నిర్మూలిస్తూ తీర్మానం జరిగింది. దీనికి సంబంధించిన చిత్తుబిల్లును సర్దార్ వల్లభాయ్ పటేల్ చట్టసభలో ప్రవేశపెట్టారు. ఇలా అస్పృశ్యతను చట్టరీత్యా నిర్మూలించే పరిస్థితి రావడానికి కారణం అంబేడ్కర్ మహోన్నతమైన కృషే కారణం. తరతరాలుగా అస్పృశ్యతలో మగ్గిపోతున్న ప్రజలకు ఈ చట్టం ఎంతో ఊరటను కలిగించింది. ఒక్క ఉదుటన వారు సంకెళ్ళను తెంచుకొని ప్రధాన స్రవంతి సమాజంలోకి పరుగులెత్తడానికి ఈ చట్టం రాచబాట వేసింది. అయితే ఈ కీర్తినంతా మహాత్మ గాంధీకి అంటగట్టాలని కాంగ్రెస్‌పార్టీ ఎంతో ప్రయత్నం చేసి విఫలమైంది. ఏ అస్పృశ్యతకైతే అంబేడ్కర్ గురి అయ్యారో ఆ అస్పృశ్యతా నివారణ చట్టాన్ని నిర్మించగలగడం, దాన్ని అగ్రవర్ణాలు అధికంగా వున్న రాజ్యాంగ పరిషత్తులో నెగ్గేలా చేయడం అంబేడ్కర్ రాజనీతిజ్ఞతకు నిదర్శనం.

ఆయన తన ప్రత్యర్థులను, శత్రువుల్ని కూడా తన వాదనా పటిమతో, తన జ్ఞాన వికాసంతో, తన శాస్త్ర ప్రమాణాలతో ఒప్పించగలిగిన ధీశక్తి గలవాడు. భారతదేశంలో ఉన్న ప్రతి మనిషినీ ఆయన కులం నుండి బయటపడేయాలని ప్రయత్నం చేశాడు. కులం మనిషికి గీతలు గీస్తుందనీ, అతడు ఎదగాల్సిన దిశ నుండి ఎదగకుండా, హద్దుల్లో వుంచుతుందనీ, ఇవ్వాళ అస్పృశ్యులుగా చెప్పబడుతున్న వారు ఆర్యుల చేత ఓటమి చెందిన జాతులే కాని అస్పృశ్యులు కాదనీ, వారు భారత్‌ను పాలించిన జాతులనీ నొక్కి వక్కాణించారు.

ఫ్రెంచి విప్లవం నుండి రూపొందిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వ భావాలను ఆయన రాజ్యాంగంలో పాదిగారు. భారత పార్లమెంట్‌ను అత్యంత ఉన్నతమైన, ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద, భావజాల పూర్ణంగా రూపొందించారు. ఆయన నిర్మించిన ఈ ప్రజాస్వామ్య ‘భవనాని’కి ఆయన నామవాచకం పెట్టడం సముచితమైంది. అయోధ్యలోని రామ మందిరానికి రాముని పేరు పెడుతున్నారు కదా. అలాగే ఇదీ ప్రత్యామ్నాయ భావజాలాల మానవతా మందిరం, మమతల సౌధం. అంబేడ్కర్ బౌద్ధ తత్వాన్ని జీర్ణించుకొన్న తాత్వికుడు. బౌద్ధ అంతస్సారమైన మానవత్వం, వ్యక్తిత్వ నిర్మాణం, అవినీతి రహిత జీవనం లాంటి భావాలన్నింటినీ ఆయన రాజ్యాంగంలో పొందుపరిచారు. అలా మౌఖిక దశలో వున్న బౌద్ధ ధర్మాలను చట్టరూపంలోకి తీసుకురాగలిగాడు. ఈ రాజ్యాంగ సౌధాన్ని ఎవరూ కదిలించలేరు. దానికి ప్రతివాదం చేసిన వారంతా ఆ వాదంలో ఇమిడి పోవాల్సిందే.

భారతదేశం ఈనాడు ప్రపంచం ముందు ప్రజాస్వామ్యం, ఆర్థిక స్వావలంబన, పౌర హక్కులు, స్త్రీ అభ్యున్నతి, రాజకీయ సమతుల్యత వంటి అనేక విషయాల్లో తల ఎత్తుకుని నిలబడిందంటే అది అంబేడ్కర్ సిద్ధాంతాలు, ఆశయాలు, నిర్మాణ దక్షత వల్లనే. భారత ఉపఖండంలో చరిత్రను మార్చిన వారు బుద్ధుడు, అశోకుడు, అంబేడ్కర్. వారు చరిత్ర విస్మరించలేని విశ్వజనీనులు. అందుకే అశోకుడి ధర్మ చక్రం భారత పతాకలో చేరింది. బుద్ధుడు ప్రపంచవ్యాప్తంగా విస్తరించారు. అంబేడ్కర్ అస్తమించని సూర్యుడయ్యాడు. ఇప్పుడు పార్లమెంట్ భవనానికి ఆయన పేరే ఒక వెలుగు దివ్వె. ఆ వెలుగులో మనం నడుద్దాం!

వ్యాసకర్త ‘అంబేడ్కర్ జీవిత చరిత్ర’ రచయిత
మొబైల్: 98497 41695

చరిత్ర వక్రీకరణ మహానేరం



మల్లెపల్లి లక్ష్మయ్య

తమ రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను వక్రీకరిస్తోన్న శక్తుల సంఖ్య గణనీయంగా పెరిగి పోతున్నది. సమత, మమత, కరుణ, ప్రేమలకు ప్రతీకగా ఉన్న తెలంగాణ సమాజాన్ని విద్వేషపు విషంతో నింపాలని చూస్తున్నారు. హైదరాబాద్ రాష్ట్రం మూడు భాషా ప్రాంతాల కలయిక. హైదరాబాద్ రాజ్యం కేవలం ముస్లింలు పాలించినది కాదు. రాజ్యానికి కేంద్రం నిజాం అయితే, గ్రామీణ ప్రాంతాలు హిందూ సామాజిక వర్గానికి చెందిన జమీందారులు, జాగీర్దారుల కబంధ హస్తాల్లో ఉండేవి. పరోక్షంగా నిజాంలు సాగించిన దుర్మార్గాల కన్నా, ఎందరో జమీందారులు సాగించిన అమానుషాలు ఎన్నో రెట్లు ఎక్కువ. కానీ నిజాం పాలన అనగానే కేవలం నిజాం గుర్తుకు రావడమే సహజంగా జరుగుతోంది. ‘మానుకోట’(ఇప్పటి మహబూబాబాద్) జెన్నారెడ్డి ప్రతాప రెడ్డి, విసునూరు రామచంద్రారెడ్డి లాంటి జమీందారులు జరిపిన దారుణాలు మనం చరిత్రలో మరెక్కడా చూడం. వీటన్నింటికీ రజాకార్ల దాడులు, దౌర్జ న్యాలు తోడయ్యాయి.

రజాకార్ ఉద్యమం 1938లో ప్రారంభమైంది. రజాకార్ అంటే స్వయం సేవకులు అని అర్థం. ప్రభుత్వానికి అండగా ఉండడానికి రజాకార్లను వినియోగించాలన్న కొందరు ముస్లిం జమీందారుల ఒత్తిడికి తలొగ్గి వారికి ప్రత్యేకమైన అధికారాలను ప్రకటించారు. దీనితో రజాకార్లు కమ్యూ నిస్టులపైనా, ఇతర ఉద్యమకారులపైనా దాడులు కొన సాగించారు. 1947 జూలై 30 నుంచి 1948 సెప్టెంబర్ 17 వరకు రజాకార్లు విచ్చలవిడి దౌర్జన్యాలు చేసిన మాట నిజం. వాళ్ళను ప్రతిఘటించి ప్రజలకు రక్షణగా నిలిచింది కమ్యూ నిస్టులే. జమీందారుల, భూస్వాముల దౌర్జన్యాలకు పరాకాష్ఠగా నిలిచిన దొడ్డి కొమరయ్య హత్యతో అంటే 1946 జూలై 4న కమ్యూనిస్టులు తమ సాయుధ పోరాటాన్ని ప్రారంభించారు.

ఈ క్రమంలోనే 1947 ఆగస్టు 15వ తేదీన బ్రిటిష్ పాలనలో ఉన్న భారతదేశం స్వతంత్రమైంది. ఆనాటికి 565 సంస్థానాలు ఉన్నాయి. స్వాతంత్ర్యం సిద్ధించేనాటికి హైదరాబాద్ స్వతంత్ర పాలనా ప్రాంతంగా ఉండేది. బ్రిటిష్ ప్రభుత్వంతో కొన్ని ఒప్పందాలు చేసుకొన్నప్పటికీ అన్ని విషయాల్లో స్వేచ్ఛగానే నిర్ణయాలు తీసుకునేది. బ్రిటిష్ ప్రభుత్వం తన ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి తన సైన్యాన్ని హైదరాబాద్‌లో ఉంచింది. అదే మనం చూస్తోన్న కంటోన్మెంట్. 1947లో స్వాతంత్ర్యం పొందిన భారతదేశం అన్ని సంస్థానాలను భారత యూనియన్‌లో కలపాలని అడిగింది. కశ్మీర్, హైదరాబాద్ సంస్థానాలు తాము స్వతంత్రంగా ఉంటామని ప్రకటించుకున్నాయి. అందుకుగానూ భారత ప్రభుత్వం, హైదరాబాద్ రాజ్యం ఒక ఒడంబడికను కుదుర్చుకున్నాయి. దానినే స్టాండ్ స్టిల్ అగ్రి మెంట్ అంటారు. బ్రిటిష్ ప్రభుత్వం భారత దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చేటప్పుడు కొన్ని నిబంధనలను పెట్టింది. అందులో ఒకటి, ఇప్పటి వరకూ బ్రిటిష్ పాలనలో లేని సంస్థానం అటు పాకిస్తాన్‌లోగానీ, ఇటు భారతదేశంలో గానీ చేరవచ్చు. లేదా స్వతంత్రంగా ఉండవచ్చు. అయితే నిజాం స్వతంత్ర పాకిస్తాన్ ఆహ్వానాన్ని తిరస్కరించాడు. భారతదేశంతో మాత్రం స్నేహంగా ఉండడానికి అంగీకరించాడు.

1947లో ఉనికిలోకి వచ్చిన రజాకార్ల దాడులను ఆసరాగా తీసుకొని భారత ప్రభుత్వం నిజాం మీద ఆంక్షలను పెంచింది. భారత ప్రభుత్వం పెంచుతోన్న ఒత్తిడిని తట్టుకోలేక నిజాం ప్రభుత్వం 1948 ఆగస్టు 9న ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిని ఆశ్రయించింది. భారత ప్రభుత్వం కొనసాగిస్తున్న ఆంక్షలను ఎత్తివేయాలనీ, తాము స్వతంత్రంగా కొనసాగే అవకాశం కల్పించాలనీ నివేదించింది. అది 1948 ఆగస్టు 21న చర్చలకు వచ్చింది. ఆ అభ్యర్థనను స్వీకరించాలా లేదా అనేది చర్చకు వచ్చినప్పుడు అందులో ఉన్న పది దేశాల్లో ఫ్రాన్స్, అమెరికా, కెనడా, కొలంబియా, సిరియా, బెల్జియం, అర్జెంటీనా అభ్యర్థనను స్వీకరించడానికి తమ మద్దతును తెలియజేశాయి. రష్యా, చైనా, ఉక్రెయిన్ తటస్థంగా ఉన్నాయి. ఇది 1948 సెప్టెంబర్ 16న జరిగింది.

కొత్త కోణం



అయితే దానిని ఒక రెండు రోజులు వాయిదా వేయాలని భారత ప్రభుత్వ ప్రతినిధులు తెరవెనుక కథ నడిపారు. అప్పటికే భారత సైన్యం హైదరాబాద్‌లో సైనిక చర్యలను ప్రారంభించింది. దాదాపు హైదరాబాద్ సంస్థానం పూర్తిగా ఆక్రమణకు గురైంది. తెల్లారితే సెప్టెంబర్ 17. ఆరోజు హైదరాబాద్‌ను హస్తగతం చేసుకున్నారు. సెప్టెంబర్ 17 మధ్యాహ్నంకల్లా నిజాం చేత భారత ప్రతినిధి కె.ఎం. మున్షీ ఒక ప్రకటన చేయించారు. హైదరాబాద్ ప్రభుత్వం తరఫున భద్రతా మండలిలో చేసిన ఫిర్యాదును వెనక్కి తీసుకుంటున్నామనేది అందులోని ప్రధానాంశం.

సెప్టెంబర్ 12న మొదలుపెట్టిన సైనికదాడి మొదటి లక్ష్యం ఐక్యరాజ్య సమితి నుంచి ఫిర్యాదును వెనక్కి తీసుకునేటట్టు చేయడం. సైనిక చర్య జరిగిన సెప్టెంబర్ 13 నుంచి 17 వరకు సైన్యం చేతిలో గానీ, అక్కడక్కడా జరిగిన ఘర్షణల్లో గానీ 25 వేల నుంచి 30 వేల మంది వరకు మరణించినట్టు నిజాం ప్రభుత్వం నియమించిన సుందర్‌లాల్ కమిటీ నివేదిక వెల్లడించింది. ఇది ఒక ఘట్టం. దీనినే మనం విమోచన అంటున్నాము. విమోచన అంటే శత్రువును పదవీచ్యుతుడిని చేయాలి. కానీ అలా జరగలేదు. నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ పేరుమీదనే 1950 జనవరి 26 వరకు ప్రభుత్వం నడిచింది. ఆ తర్వాతనే హైదరాబాద్ భారత ప్రభుత్వంలో అధికారికంగా భాగమైంది.

1948 సెప్టెంబర్ 17న నిజాంను లొంగదీసుకున్న తరువాత భారత సైన్యం కమ్యూనిస్టులపై యుద్ధం ప్రకటించింది. భారత సైన్యం, భూస్వాములు, గూండాలు కలిసి ఊరూరునీ వల్లకాడుగా మార్చేశారు. 1948 సెప్టెంబర్ 17 నుంచి 1951 అక్టోబర్ సాయుధ పోరాట విరమణ వరకూ దాదాపు 4 వేల మంది కమ్యూనిస్టులతో పాటు, వేలాది మంది సాధారణ ప్రజలు చనిపోయారు. మరి 1948 సెప్టెంబర్ 17న విమోచన అయితే, 1951 వరకు భారత సైన్యం తెలంగాణ పల్లెలపై ప్రకటించిన యుద్ధం ఎవరి విమోచనం కోసం జరిగింది? కాబట్టి సెప్టెంబర్ 17న జరిగింది నిజాం బలవంతపు లొంగుబాటుగానే చరిత్ర మనకు చెబుతున్నది. అందువల్ల మనం సెప్టెంబర్ 17న జరపాల్సింది సంబురాలు కాదు. మనల్ని మనం సింహావలోకనం చేసుకోవడమే. రజాకార్ల దౌర్జన్యాలనూ, అమానుషాలనూ ఎండగట్టాల్సిన సమయమిదే. కానీ భారత సైన్యం జరిపిన నరమేధాన్ని తక్కువ చేసి చూడటం ముమ్మాటికీ సరికాదు.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు
మొబైల్: 81063 22077

ఏకాగ్రత కోసమే ప్రదక్షిణ

మనో, వాక్కాయ కర్మలు భగవంతుని చుట్టూ పరిభ్రమించాలన్నదే ప్రదక్షిణలోని పరమార్థం. దీని వల్ల ఏకాగ్రత, నమ్మకం సిద్ధిస్తాయి. రమణ మహర్షి ప్రదక్షిణ పదానికి ఒక వివరణ ఇచ్చారు. ‘ప్ర’ అనే అక్షరం సమస్త పాపాలను నాశనం చేస్తుందనీ, ‘ద’ అంటే కోరికలన్నీ తీరడమనీ, ‘క్షి’ అంటే రానున్న జన్మల క్షయాన్ని సూచిస్తుందనీ, ‘ణ’ అంటే అజ్ఞానం నుండి విముక్తి అనీ చెప్పారు.

దేవాలయానికి వెళ్ళినప్పుడు ముందు గర్భగుడి చుట్టూ ప్రదక్షిణ చేసే దర్శనం చేస్తాం. ప్రదక్షిణ ద్వారా ఆశించిన



ఫలితాన్ని దైవానికి నివేదించుకుంటాం. ప్రత్యేక ఫలితాల కోసం, సమస్యల సత్వర పరిష్కారాల కోసం, 108 ప్రదక్షిణలు చేస్తూ ఉంటాం. అలాంటప్పుడు తొందరగా ముగించాలనీ, లెక్క పొరపాటు కాకూడదనే జాగ్రత్తలలోనే దృష్టి నిలిపి యాంత్రికంగా చేస్తూ ఉంటాం. ఏకాగ్రత లేని పనులు ఏవీ మంచి ఫలితాన్నివ్వవు. ప్రదక్షిణ చేస్తున్నప్పుడు దైవధ్యానంలో మనసు నిలిపి ప్రశాంతంగా ఆచరించటం ప్రధానం. ప్రదక్షిణకున్న విలువ, ఫలితం సాటిలేనివి.

విశ్వమంతా చుట్టి వచ్చినవారికే గణాధిపత్యం అని పార్వతీ పరమేశ్వరులు చెప్పినప్పుడు, తల్లితండ్రులైన పార్వతీ పరమేశ్వరుల చుట్టూ గణపతి భక్తి భావంతో మూడు సార్లు ప్రదక్షిణ చేసి, సోదరునిపై విజయం సాధించాడు. కుమారస్వామి ముల్లోకాలను చుట్టి వస్తూ, ఎక్కడ చూసినా తన కంటే ముందు గణపతి ఉండటంతో ఆశ్చర్యపోతాడు. తల్లితండ్రులకు ప్రదక్షిణ చేయటంలో అంత గొప్ప ఫలితం ఉంది. నిత్య జీవితంలో రోజూ ప్రదక్షిణ చేయలేరు కాబట్టి ఉదయాన్నే తల్లితండ్రులకు నమస్కరించటం ఒక మంచి పద్ధతి. ప్రదక్షిణ ఒక ధ్యానం లాంటిది. అది దైవ దర్శనానికి మానసికంగా సిద్ధం చేసే ఒక గొప్ప ప్రక్రియ కూడా!

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

శ్రీవారి దర్శనానికి 12 గంటలు



ఆలయం వెలుపల తనికెళ్ల భరణి

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 74,817 మంది స్వామిని దర్శించుకోగా, 33,350 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీలో కానుకల రూపంలో భక్తులు రూ.2.97కోట్లు సమర్పించుకున్నారు. దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. కాగా, తిరుమల శ్రీవారిని గురువారం సినీ నటుడు తనికెళ్ల భరణి దర్శించుకున్నారు.

ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లపై నిషేధం

- నవంబర్ ఒకటో తేదీ నుంచి అమలు
- గెజిట్ నోటిఫికేషన్ జారీచేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నవంబర్ 1వ తేదీ నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లను నిషేధిస్తూ ప్రభుత్వం గురువారం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. ఈ నిషేధం అమలు, ఉల్లంఘనలు, వాటిపై చర్యలు, ప్రత్యామ్నాయాలు తదితరాలకు సంబంధించిన మార్గదర్శకాలను నోటిఫికేషన్‌లో వివరించారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీల ఉత్పత్తి, దిగుమతుల తోపాటు వినియోగం, ముద్రణ, రవాణా, ప్రదర్శనలకు నిషేధం వర్తిస్తుంది. నిషేధం అమలును పట్టణాలు, నగరాల్లో కాలుష్య నియంత్రణ అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, శానిటేషన్ సిబ్బంది పర్యవేక్షిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో పర్యవేక్షణ బాధ్యతను కలెక్టర్లు, జెడ్పీ సీఈవోలు, పంచాయతీలు, గ్రామ సచివాలయాల సిబ్బందికి అప్పగించారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లకు బదులుగా కాటన్, నేత వస్త్రాలను వినియోగించాలని ప్రభుత్వం సూచించింది.



ఉల్లంఘిస్తే జరిమానా

నిబంధనలు ఉల్లంఘిస్తే ఫ్లెక్సీ చదరపు అడుగుకు రూ.100 జరిమానా విధిస్తారు. ఉల్లంఘనులపై పర్యావరణ చట్టం -1986 ప్రకారం చర్యలు తీసుకుంటారు. సీజ్‌చేసిన బ్యానర్లను శాస్త్రీయంగా డిస్పోజ్ చేయడానికి అవసరమైన ఖర్చును నిబంధనలు ఉల్లంఘించిన వారినుంచి వసూలుచేస్తారు. పోలీస్, రెవెన్యూ, ట్రాన్స్‌పోర్ట్, జీఎస్టీ అధికారులు ప్లాస్టిక్ ఫెక్సీల నిషేధాన్ని పర్యవేక్షించే అధికారులకు సహాయపడతారు.

చంద్రబాబు కుప్పంలో ఓడిపోవడం ఖాయం

725వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ : రాష్ట్రంలోని అర్హులకు రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని బహుజన పరిరక్షణ సమితి నేతలు చెప్పారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా 725వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. బహుజనులకు అన్యాయం చేసేందుకు పదే పదే అడ్డదారిలో వెళుతున్న చంద్రబాబు.. భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఆయన కుప్పంలో కూడా ఓడిపోవడం ఖాయమని, 34 సంవత్సరాలుగా అక్కడి ప్రజలను అమాయకులను చేసి అభివృద్ధి చేయకుండా కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సమితి నాయకులు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

2 నుంచి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు

- రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ డీఐజీ


కమలాపురం: అక్టోబర్ రెండో తేదీ నుంచి రాష్ట్రంలోని 1,949 గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభమవుతాయని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ డీఐజీ బి.శివరాం తెలిపారు. వైఎస్సార్ జిల్లా కమలాపురం పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, దస్తావేజులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రతి గ్రామ సచివాలయంలో ప్రజలకు రిజిస్ట్రేషన్ శాఖ కార్యకలాపాలను అందుబాటులోకి తీసుకుని రావడానికి చర్యలు చేపట్టారని చెప్పారు. ఇప్పటికే పైలట్ ప్రాజెక్ట్ కింద 51 గ్రామ, వార్డు సచివాలయాలను ఎంపిక చేశామన్నారు. ఆయా సచివాలయాల పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్‌లకు నెట్ వర్క్, స్కానింగ్, వెబ్‌క్యామ్‌లతో పాటు రిజిస్ట్రేషన్లు, సెటిల్ మెంట్లు, పార్టిషియన్లు ఎలా చేయాలనే విషయాలపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. దీంతో ఏ గ్రామానికి చెందిన వారు అదే గ్రామంలో రిజిస్ట్రేషన్ శాఖ సేవలను పొందవచ్చన్నారు. ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉండే రిజిస్ట్రేషన్, వివాహ రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ జారీ, ఈసీల జారీ తదితర సేవలు సచివాలయాల్లో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అనంతరం సంబటూరు, జంభాపురం గ్రామ సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్ చెన్నకేశవరెడ్డి, సబ్ రిజిస్ట్రార్ డీఎం బాషా పాల్గొన్నారు.



కమలాపురంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఐజీ శివరాం

శ్రీశైలం గంగాభవాని స్నాన ఘట్టాల వద్ద చిరుత

క్షేత్ర పరిధిలోని గంగాభవాని స్నాన ఘట్టాల సమీపంలోని రోడ్డు పక్కనే చిరుత సంచరించడం కలకలం రేపింది. గురువారం వేకువజామున బైక్‌లపై కొందరు గంగాభవాని స్నాన ఘట్టాల వైపు వెళ్తుండగా పేవ్‌మెంట్ పక్కనే నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్తున్న చిరుతను చూసి ఫొటోలు తీశారు. అక్కడ నుంచి చిరుత పక్కనే ఉన్న అడవిలోకి వెళ్లిపోయింది. గంగాభవాని స్నాన ఘట్టాలు దాటాక వీఐపీ కాటేజీలు ఓ వైపు, స్నాన ఘట్టాలకు మరో వైపు పుష్కరణి కూడా ఉంది. ఈ మధ్య కాలంలో చిరుత రుద్రాపార్క్, రామయ్య టర్నింగ్, సాక్షిగణపతి తదితర ప్రదేశాల్లో సంచరించడం తెలిసిందే. - శ్రీశైలం



శ్రీశైలంలో గంగాభవాని స్నాన ఘట్టాల వద్ద చిరుత

ఏసీబీకి చిక్కిన ఇద్దరు ఉద్యోగులు



ఆర్‌ఐ షఫీఉల్లా

సాక్షి, అమరావతి /హిందూపురం: లంచాలు తీసుకుంటూ ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వివరాలు.. హిందూపురంలోని మార్కండేయనగర్‌కు చెందిన బాబాఫక్రుద్దీన్ అన్ని అనుమతులతో ఇంటి నిర్మాణం పూర్తి చేశాడు. ఆస్తి పన్ను నిర్ణయించాలని మునిసిపల్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. ఇంటికి పన్ను ఎక్కువ అవుతుందని.. దీనిని తక్కువ చేసేందుకు రూ.20 వేలు ఇవ్వాలని బాబాఫక్రుద్దీన్‌ను ఆర్‌ఐ షఫీవుల్లా డిమాండ్ చేశాడు. అంత ఇవ్వలేననడంతో రూ.15 వేలకు ఒప్పుకున్నాడు. అనంతరం బాబాఫక్రుద్దీన్ దీని గురించి ఏసీబీకి సమాచారమిచ్చాడు. ఏసీబీ ఇన్‌చార్జ్ డీఎస్పీ కంజాక్షన్.. బాబాఫక్రుద్దీన్‌కు ఆస్తి పన్ను ఫైలులో రూ.15వేలు ఇచ్చి పంపించారు. ఆయన గురువారం మధ్యాహ్నం షఫీవుల్లాకు రూ.15 వేలు ఇచ్చాడు. అవి తీసుకొని షఫీవుల్లా జేబులో పెట్టుకున్న తర్వాత.. ఏసీబీ అధికారులు వెంటనే రంగంలోకి దిగి షఫీవుల్లాను అదుపులోకి తీసుకున్నారు. ఫైల్‌ను, లంచంగా తీసుకున్న నగదును సీజ్ చేశారు. షఫీవుల్లాపై కేసు నమోదు చేసి, ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు ఏసీబీ సీఐ ప్రభాకర్ తెలిపారు. అలాగే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.5వేలు లంచం తీసుకుంటూ కృష్ణా జిల్లా కంకిపాడు ఆర్‌ఐ బి.కృష్ణనాయక్ ఏసీబీ అధికారులకు చిక్కారు. అతనిపైనా ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు.

గిరిజన సంప్రదాయాల పరిరక్షణకు కేంద్రం పెద్దపీట

కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ సహాయ మంత్రి రేణుక సింగ్ సరుత



థింసా కళాకారులను సన్మానిస్తున్న కేంద్ర మంత్రి రేణుక సింగ్ సరుత

అరకులోయ రూరల్ (అల్లూరి సీతారామ రాజు జిల్లా): గిరిజన ఆచార సంప్రదాయాల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ సహాయ మంత్రి రేణుక సింగ్ సరుత తెలిపారు. స్థానిక ఏపీ టూరిజం రిసార్ట్ హరితలో గురువారం నిర్వహించిన జాతీయ గిరిజన ఉత్సవ్‌ను జ్యోతి వెలిగించి ఆమె ప్రారంభించారు. గిరిజన కళాకారులను మంత్రి సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గిరిజన హక్కులు, చట్టాలు, ఆచార సంప్రదాయాలను పరిరక్షించేందుకు కేంద్రం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. దేశంలోని అన్ని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్టు తెలిపారు. కేంద్ర నిధులతో ఏకలవ్య పాఠశాలలకు సొంత భవనాలు నిర్మిస్తున్నట్టు తెలిపారు. పాండిచ్చేరి హోం మంత్రి నమఃశివాయం మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

భవిష్యత్తులో అధిక శాతం వైద్యులు ఏపీ నుంచే

- 17 వైద్య కళాశాలల ఏర్పాటు శుభ పరిణామం
- క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు



ఆకివీడు: భవిష్యత్తులో ఆంధ్ర రాష్ట్రం నుంచే ఎక్కువ శాతం వైద్యులు వస్తారని క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తున్నారని, ఇది శుభపరిణామమని తెలిపారు. గత ప్రభుత్వాలు వైద్యాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేయడం వల్ల పేదలు, మధ్య తరగతి ప్రజలకు వైద్యం ఖరీదైపోయిందని చెప్పారు. ఇప్పటివరకు రాష్ట్రంలో ఉన్న ప్రైవేటు, ప్రభుత్వ మెడికల్ కళాశాలలతో పాటు కొత్తగా ఏర్పాటు చేస్తున్న కళాశాలలతో వైద్యులు కోకొల్లలుగా పుట్టుకు వస్తారని చెప్పారు.

‘పాపులర్ ఫ్రంట్’పై గురి

15 రాష్ట్రాల్లోని 93 ప్రాంతాల్లో ఏకకాలంలో ఎన్ఐఏ సోదాలు
- 106 మంది పీఎఫ్ఐ నాయకులు, కార్యకర్తల అరెస్టు
- అత్యధికంగా కేరళలో 22 మందిని అదుపులోకి తీసుకున్న అధికారులు
- సోదాలకు నిరసనగా నేడు కేరళలో హర్తాళ్లు చేపడతామన్న పీఎఫ్ఐ


పీఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి అనీస్ అహ్మద్‌ను పటియాలా కోర్టుకు తీసుకొస్తున్న దృశ్యం

న్యూఢిల్లీ/తిరువనంతపురం: దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వివాదాస్పద పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ) కార్యాలయాలు, సభ్యుల నివాసాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు సోదాలు నిర్వహించారు. గురువారం దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లోని 93 ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. 106 మంది పీఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసినట్లు ప్రకటించారు. కేరళలో 22 మందిని, మహారాష్ట్రలో 20, కర్ణాటకలో 20, తమిళనాడులో 10, అస్సాంలో 9, యూపీలో 8, ఏపీలో 5, మధ్యప్రదేశ్‌లో 4, పుదుచ్చేరిలో 3, ఢిల్లీలో 3, రాజస్తాన్‌లో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలియజేశారు. ఇది అతిపెద్ద దర్యాప్తు ప్రక్రియ అని పేర్కొన్నారు. అరెస్టయిన వారి వివరాలను బహిర్గతం చేయలేదు. ఎన్ఐఏతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సిబ్బంది, ఆయా రాష్ట్రాల పోలీసులు ఈ సోదాల్లో పాల్గొన్నట్లు సమాచారం. ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సమకూర్చడం, ఉగ్రవాద శిక్షణా శిబిరాలు నిర్వహించడం, ఉగ్రవాద సంస్థల్లో చేరేలా జనాన్ని ప్రేరేపించడం వంటి ఘటనల్లో భాగస్వాములైన వారి కార్యాలయాలు, నివాసాల్లో సోదాలు జరిపామని అధికారులు వెల్లడించారు. ఎన్ఐఏ సోదాలపై పీఎఫ్ఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. భిన్నాభిప్రాయాలను వినిపించే గొంతుకలను నొక్కేయడానికి దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకోవడం దారుణమని విమర్శించింది. కేంద్ర ప్రభుత్వానికి, దర్యాప్తు సంస్థలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తిరువనంతపురం, కొల్లాం తదితర జిల్లాల్లో పీఎఫ్ఐ కార్యకర్తలు ర్యాలీలు చేశారు.

పీఎఫ్ఐ నేతలపై ఈడీ చార్జిషీట్లు

భారత్‌లో రాడికల్ ఇస్లాంను పీఎఫ్ఐ ప్రోత్సహిస్తోందని దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్నాయి. దేశంలో పౌరసత్వ(సవరణ) చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనలు, 2020లో ఢిల్లీలో చోటుచేసుకున్న అల్లర్లు, ఉత్తరప్రదేశ్‌లో హత్రాస్ సంఘటనతోపాటు పలుచోట్ల జరిగిన హింసాకాండ వెనుక పీఎఫ్ఐ హస్తం ఉన్నట్లు ఈడీ గుర్తించింది. వాటికి పీఎఫ్ఐ నిధులు సమకూర్చిందన్న కోణంలో దర్యాప్తు సాగిస్తోంది. పీఎఫ్ఐతోపాటు ఆ సంస్థ ఆఫీసు–బేరర్లపై లక్నోలోని ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టులో ఇప్పటికే రెండు చార్జిషీట్లు కోర్టులో దాఖలు చేసింది. గత ఏడాది ఫిబ్రవరిలో మొదటి చార్జిషీట్, ఈ ఏడాది మొదట్లో రెండో చార్జిషీట్ దాఖలు చేసింది.

ఎన్ఐఏ సోదాలకు నిరసనగా పీఎఫ్ఐ శుక్రవారం కేరళవ్యాప్తంగా హర్తాళ్లకు పిలుపునిచ్చింది. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల దాకా ప్రజలంతా హర్తాల్‌లో పాలుపంచుకోవాలని కోరింది. పీఎఫ్ఐ పిలుపును కేరళ బీజేపీ శాఖ తీవ్రంగా ఖండించింది. గతంలో పీఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన హర్తాళ్లు అల్లర్లు, హింసతోనే ముగిశాయని బీజేపీ కేరళ అధ్యక్షుడు కె.సురేంద్రన్ గుర్తుచేశారు. దర్యాప్తు సంస్థల చర్యల విషయంలో ఆగ్రహావేశాలు వద్దని, సహనం వహించాలని పలు ముస్లిం సంఘాలు ఓ వర్గం యువతకు ఉద్బోధించాయి. దేశంలో రాజ్యాంగం, చట్టాలు, న్యాయ వ్యవస్థపై తమకు విశ్వాసం ఉందని ముస్లిం స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా(ఎంఎస్ఓ) ట్వీట్ చేసింది.

ఉన్నతాధికారులతో అమిత్ షా సమావేశం

పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా నేతలు, కార్యకర్తల కార్యాలయాలు, ఇళ్లల్లో ఎన్ఐఏ సోదాల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా గురువారం ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. పీఎఫ్ఐకి చెందిన అనుమానిత ఉగ్రవాదులపై తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించినట్లు తెలిసింది. ఈ భేటీలో జాతీయ భద్రతా సలహాదారు దోవల్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్, ఎన్ఐఏ డైరెక్టర్ జనరల్ గుప్తా పాల్గొన్నారు.

సిమికి మరో రూపమే పీఎఫ్ఐ



దక్షిణ భారత్‌లో మూడు ముస్లిం సంస్థలు విలీనమై 2007లో పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)గా అవతరించింది. కేరళలోని నేషనల్ డెమొక్రాటిక్ ఫ్రంట్, కర్ణాటక ఫోరమ్ ఫర్ డిగ్నిటీ, తమిళనాడులోని మణిత నీతి పసరాయ్ అనే సంస్థలు 2006లో కేరళలోని కోజికోడ్‌లో సమావేశమై ఒక్కటవ్వాలని నిర్ణయించుకున్నాయి. 2007 ఫిబ్రవరి 16న బెంగుళూరులో నిర్వహించిన ఒక ర్యాలీలో పీఎఫ్ఐ ఏర్పాటైనట్టుగా ప్రకటించారు. స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి)పై నిషేధం తర్వాత ఏర్పాటైన పీఎఫ్ఐ తనని తాను మైనార్టీ హక్కుల కోసం పోరాడే సంస్థగా చిత్రీకరించుకుంది. దేశంలో ముస్లిం మత పరిరక్షణ కోసం పోరాడుతున్నట్టు చెప్పుకుంటోంది. కానీ పీఎఫ్ఐ ఉగ్రవాద సంస్థలకు నిధులు అందివ్వడం, ఉగ్రవాదుల శిక్షణ, తీవ్రవాద భావజాలం వ్యాప్తి వంటి కార్యకలాపాలకు ఊతమిస్తోందని ఆరోపణలున్నాయి. లవ్ జీహాది, బలవంతపు మత మార్పిళ్లు, అఫ్గానిస్తాన్, సిరియాలో ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్)లో చేరడానికి యువకుల్ని పంపడం వంటి పనులు చేస్తోందన్న అభియోగాలు కూడా ఉన్నాయి. క్రమక్రమంగా ఈ సంస్థ ఉత్తర, పశ్చిమ, తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లో తమ కార్యకలాపాలను విస్తరించింది. కేరళలో ఎక్కువగా ఈ సంస్థ కార్యకలాపాలు కనిపిస్తాయి, రాష్ట్రంలో జరిగే హత్యలు, దోపిడీలు, దందాల వెనుక పీఎఫ్ఐ హస్తం ఉందన్న ఆరోపణలున్నాయి. 2012లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఒకానొక కేసు సందర్భంగా పీఎఫ్ఐ అంటే సిమికి మరో రూపమనే పేర్కొంటూ ఊమన్ చాండీ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. సీపీఎం, ఆర్ఎస్ఎస్ సభ్యుల హత్య, హత్యాయత్నాలకు సంబంధించిన వందలాది కేసుల్లో పీఎఫ్ఐ హస్తం ఉందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. పీఎఫ్ఐ ఇప్పటివరకు ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టకపోయినప్పటికీ దాని నుంచి వేరుపడిన కొందరు సోషల్ డెమొక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎస్‌డీపీఐ) పేరుతో రాజకీయ పార్టీ పెట్టారు. ముస్లింలు, దళితులు, ఆదివాసీలు, ఇతర అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం రాజకీయ పోరాటం చేస్తామని చెప్పుకున్నారు. ఎస్‌డీపీఐకి తెర వెనుక అన్ని విధాలుగా పీఎఫ్ఐ సహకారం అందిస్తుంది. దక్షిణాదిన ముస్లిం జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో పీఎఫ్ఐ–ఎస్‌డీపీఐ ప్రజల్లో చొచ్చుకుపోవడానికి ప్రయత్నిస్తున్నాయి. కర్ణాటకలో ఉడిపి, దక్షిణ కన్నడ ప్రాంతాల్లో ఎస్‌డీపీఐ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి రాజకీయాల్లోనూ తన ఉనికిని చాటుకుంది. 2018 నాటికి 121 స్థానిక సంస్థల్లో విజయం సాధించింది. 2013లో కర్ణాటక అసెంబ్లీ, 2014, 2019లో పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ బోణీ కొట్టలేకపోయింది. గత ఎనిమిదేళ్లలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఎన్నో ఆందోళనల్ని పీఎఫ్ఐ నడిపిస్తోంది. ముఖ్యంగా పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పీఎఫ్ఐ సభ్యులే అధికంగా పాల్గొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్ల పండుగ జరిగే 2047 నాటికి భారత్‌ని ఇస్లాం రాజ్యంగా మార్చడం కోసం పని చేస్తోందన్న ఆరోపణలు ఈ సంస్థపై ఉన్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఏపీలో ఐదుగురి అరెస్టు

సాక్షి, అమరావతి/హైదరాబాద్: సోదాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐదుగురు వ్యక్తులను ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేశారు. పీఎఫ్ఐ, దాని అనుబంధ రిహాబ్ ఇండియా ఫౌండేషన్, సోషల్ డెమొక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియాతో సంబంధాలున్న గుంటూరు చెందిన అబ్దుల్ వహీద్ అలీ, షేక్ జఫ్రుల్లా, అబ్దుల్ రహీం, రియాజ్ అహ్మద్‌ను అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌కు తరలించారు. కర్నూలుకు చెందిన అబ్దుల్ వారిస్‌ను హైదరాబాద్‌లో అరెస్టు చేశారు.

తీగ లాగితే కదిలిన డొంక

దేశంలో మతకల్లోలాలు సృష్టించేందుకు పీఎఫ్ఐ తెలంగాణలోని నిజామాబాద్‌లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్టు ఎన్ఐఏ గుర్తించింది. నిజామాబాద్‌లో సోదాలు నిర్వహించగా డొంకంతా కదిలింది. కొన్ని రోజుల క్రితం గుంటూరు, కర్నూలు, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లో ఎన్ఐఏ అధికారులు సోదాలు చేపట్టారు. బుధవారం అర్ధరాత్రి దాటాక గుంటూరు, కర్నూలులో ఎన్ఐఏ బృందాలు తనిఖీలు చేపట్టారు. గుంటూరులో పీఎఫ్ఐ, ఎస్‌డీపీఐ కార్యాలయాలతోపాటు పలువురి నివాసాల్లో సోదాలు నిర్వహించారు. నలుగురిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో అబ్దుల్ వహీద్ అలీ, అబ్దుల్ రహీంలు పీఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు. ప్రస్తుతం పీఎఫ్ఐ విస్తరణ విభాగం ఇన్‌చార్జ్‌లు. షేక్ జఫ్రుల్లా పీఎఫ్ఐ సభ్యుడు కాగా రియాజ్ అహ్మద్ పీఎఫ్ఐ రాజకీయ విభాగం ఎస్‌డీపీఐ జిల్లా అధ్యక్షుడు. గుంటూరు జిల్లా పీఎఫ్ఐ అధ్యక్షుడు యూసుఫ్‌కు ఎన్ఐఏ నోటీసులు జారీ చేసింది. 29న హైదరాబాద్‌లో విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. కర్నూలులో వారిస్ ఇంట్లో ఎస్‌డీపీఐకి సంబంధించిన కరపత్రాలు, మినిట్స్ బుక్, బైలా బుక్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిజామాబాద్‌లో పీఎఫ్ఐ సభ్యులకు అతడే శిక్షణా తరగతులు నిర్వహించినట్టు ఎన్ఐఏ గుర్తించింది.

పీఎఫ్ఐ కార్యాలయం సీజ్

హైదరాబాద్ చాంద్రాయణగుట్టలో పీఎఫ్ఐ కార్యాలయాన్ని ఎన్ఐఏ సీజ్ చేసింది. విచారణకు హాజరు కావాలని సంబంధిత ప్రతినిధులను ఆదేశించారు. కరీంనగర్‌లో సోదాలు నిర్వహించిన ఎన్ఐఏ.. పీఎఫ్ఐ సానుభూతిపరులను విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. ఈ కేసులో ఈడీ కూడా రంగంలోకి దిగింది. పీఎఫ్ఐకి అందుతున్న నిధులపై ఈడీ దర్యాప్తు వేగవంతం చేయనున్నట్టు తెలిసింది.

క్లుప్తంగా...

యూపీ ఉభయసభల్లో ఒక్క రోజు మహిళలకే!



లక్నో: ఉత్తరప్రదేశ్ ఉభయ సభల్లో గురువారం కేవలం మహిళా ప్రజాప్రతినిధులు మాత్రమే మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. బీజేపీకి చెందిన అనుపమ జైస్వాల్ సభకు అధ్యక్షత వహించారు. మహిళా ప్రతినిధుల ప్రసంగాలను అసెంబ్లీ గ్యాలరీలో నుంచి మహిళా వైద్యులు, విద్యార్థినులు, బాలికలు ప్రత్యక్షంగా వీక్షించారు. ముందుగా సీఎం యోగి ఆదిత్యనాథ్, ప్రతిపక్ష నేత అఖిలేశ్ యాదవ్‌ల ప్రసంగించారు. ప్రభుత్వం సరైన నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా మహిళా ఎమ్మెల్యేలు సూచనలు అందజేయాలని సీఎం యోగి కోరారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలకు అడ్డుకట్ట వేయాలని అఖిలేశ్ యాదవ్ ప్రభుత్వానికి సూచించారు. యూపీ అసెంబ్లీలోని 403 మంది సభ్యులకు గాను 47 మంది మహిళా ఎమ్మెల్యేలున్నారు. 100 మందితో కూడిన శాసనమండలిలో ఆరుగురు ఎమ్మెల్సీలున్నారు.

యూపీలో వర్షాలకు 10 మంది బలి

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో జన జీవనం అస్తవ్యస్తమైంది. ఇళ్ల గోడలు కూలిన ఘటనలు, పిడుగుపాట్లతో 10 మంది చనిపోగా మరో 12 మంది గాయపడ్డారు. ఇటావా జిల్లా చంద్రపుర గ్రామంలో బుధవారం రాత్రి మూడు చోట్ల నివాసాల గోడలు కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చిన్నారులు సహా ఏడుగురు మృత్యువాతపడగా మరో ముగ్గురు గాయపడ్డారు. ఇటావాలో 24 గంటల వ్యవధిలో 140 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ విభాగం తెలిపింది. ఫిరోజాబాద్‌లో ఇళ్ల గోడలు కూలిన ఘటనల్లో ఒక చిన్నారి సహా ఇద్దరు చనిపోగా మరో 8 మంది గాయపడ్డారు. బలరాంపూర్ జిల్లా బర్‌గద్వా సయిఫ్ గ్రామంలో పిడుగుపాటుకు గురై ఒక బాలుడు చనిపోగా మరొకరు గాయపడ్డారు. అలీగఢ్ జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న కుంభవృష్టితో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శనివారం వరకు అన్ని విద్యాసంస్థలను మూసివేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ఐఎన్ఎల్‌డీ ర్యాలీకి పవార్, నితీశ్, ఠాక్రే

న్యూఢిల్లీ: హరియాణాలోని ఫతేబాద్‌లో ఈ నెల 25వ తేదీన ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్ఎల్‌డీ) తలపెట్టిన ర్యాలీకి ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురు నేతలు హాజరుకానున్నారు. ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, జేడీయూ నేత, బిహార్ సీఎం నితీశ్‌కుమార్, శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే, డీఎంకే నేత కనిమొళి ఈ సమావేశంలో పాల్గొంటారని జేడీయూ ప్రతినిధి కేసీ త్యాగి చెప్పారు. మాజీ ఉప ప్రధాని, ఐఎన్ఎల్‌డీ వ్యవస్థాపకుడు దేవీలాల్ జయంతిని పురస్కరించుకుని చేపట్టే ఈ కార్యక్రమానికి ఆర్‌జేడీ నేత, బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, సీపీఎం నేత సీతారాం ఏచూరి కూడా వస్తామని తెలిపారన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందే ప్రతిపక్ష పార్టీలను ఏకం చేసే దిశగా చారిత్రక ఘట్టం కానుందని పేర్కొన్నారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, తెలంగాణ సీఎం కేసీఆర్‌లకు కూడా ఐఎన్ఎల్ డీ నేత ఓం ప్రకాశ్ చౌతాలా ఆహ్వానాలు పంపారన్నారు.

అవినీతిపై రోజుకు 195 ఫిర్యాదులు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో పెచ్చరిల్లుతున్న అవినీతికి తగ్గట్లు ప్రజా ఫిర్యాదుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని కేంద్ర ప్రభుత్వ నివేదిక స్పష్టం చేసింది. ప్రభుత్వ విభాగాలపై ప్రజలు ఫిర్యాదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కేంద్రీకృత పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (సీపీగ్రామ్స్) ఆన్‌లైన్ పోర్టల్‌ను తీసుకొచ్చింది. అవినీతికి సంబంధించి ఏకంగా 46,627 ఫిర్యాదులు ఈ పోర్టల్ ద్వారా అందినట్లు ఆగస్టు–2022 నివేదిక వెల్లడించింది. ఈ లెక్కన రోజుకు 195 ఫిర్యాదులు దఖలుపడ్డాయి. అత్యధికంగా ఫిర్యాదులు ఆర్థిక సేవల శాఖ (డీఎఫ్ఎస్)పైనే నమోదవడం గమనార్హం. డీఎఫ్ఎస్ పరిధిలోని బ్యాంకింగ్ విభాగంపై అధికంగా 14,934 ఫిర్యాదులు వచ్చాయి. బీమా విభాగంపై 3,306 ఫిర్యాదులు, సిబ్బంది, శిక్షణ విభాగం (డీఓపీటీ)పై 2,223, శాస్త్ర,సాంకేతిక విభాగంపై 1,831, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) కార్యాలయంపై 1,784, ఆహార, ప్రజా పంపిణీ వ్యవహారాల శాఖపై 1,005 ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 25 వరకు సీపీగ్రామ్స్ ద్వారా కేంద్రప్రభుత్వానికి మొత్తంగా 7,50,822 ఫిర్యాదులు అందాయి. వీటిలో 7,27,673 ఫిర్యాదులను పరిష్కరించారు. బ్యాంకింగ్ విభాగంలో 1,088, కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖలో 260 ఫిర్యాదుల్ని పరిష్కరించాల్సి ఉంది.

జ్ఞానవాపి ‘శివలింగం’ వయసు నిర్ధారణకు ఓకే

వారణాసి: వారణాసిలో కాశీ విశ్వనాథ్ ప్రధానాలయం పక్కన ఉన్న జ్ఞానవాపి మసీదు ఆవరణలో లభించిన శివలింగాకృతి శిల వయసు నిర్ధారణకు వారణాసి జిల్లా కోర్టు అనుమతిని ఇచ్చింది. జ్ఞానవాపి మసీదు ప్రధాన కట్టడం వెనకవైపు గోడకు ఉన్న దేవతా విగ్రహాల నిత్య ఆరాధనకు అనుమతించాలంటూ మహిళా భక్తులు వేసిన పిటిషన్‌ను గురువారం వారణాసి జిల్లా కోర్టు విచారించింది. శిల కార్బన్–డేటింగ్ ప్రక్రియకు అనుమతించాలని భక్తుల తరఫున హాజరైన న్యాయవాది విష్ణు .. జడ్జి విశేష్‌ను కోరారు. అందుకు అంగీకరిస్తూ జడ్జి ఉత్తర్వులిచ్చారు. తదుపరి విచారణ తేదీ 29కల్లా అభ్యంతరాలు ఉంటే తెలపాలని మసీదు మేనేజ్‌మెంట్‌కు సూచించారు. కేసులో భాగస్వామ్య పక్షాలుగా చేరుతామంటూ 15 మంది కోర్టు ముందుకొచ్చారు.

ఒక వ్యక్తికి ఒకే పదవి

అధ్యక్ష పదవిపై రాహుల్ స్పష్టీకరణ



కొచ్చి: రాజస్తాన్ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్ష ఎన్నికల్లో బరిలో నిలుస్తానన్న అశోక్ గహ్లోత్ వైఖరికి భిన్నంగా రాహుల్ గాంధీ మాట్లాడారు. ‘ ఈ ఏడాది రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో నిర్వహించిన చింతన్ శిబిర్ సంస్కరణల్లో ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకున్నాం . ఒక వ్యక్తికి ఒకే పదవి. ఈ నిర్ణయంపై పార్టీ ఏకాభిప్రాయంతో ఉంది. ఇది ఇకమీదటా కొనసాగుతుందనే భావిస్తున్నా’ అని మీడియాతో అన్నారు. భారత్ జోడో యాత్ర గురువారం ఉదయం సెషన్ పూర్తయ్యాక జరిగిన పత్రికా సమావేశంలో రాహుల్ మాట్లాడారు. ‘ పార్టీ ముఖ్యనేతలెవరైనా ఆ స్థానానికి పోటీ చేయవచ్చు. అయితే, దేశ భవిష్యత్‌పై ఆలోచనలు చేసే విశిష్టస్థానంలో ఆసీనులు కాబోతున్నామనే విషయం వారు గుర్తుంచుకోవాలి. కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షత అనేది కేవలం ఒక పదవి మాత్రమే కాదు. సిద్ధాంతాలు ప్రతిబింబించే బాధ్యత. ఒక నమ్మకమైన వ్యవస్థ’ అని రాహుల్ అన్నారు. ‘స్వాతంత్ర్యానికి పూర్వం మొదలుకొని స్వాతంత్రం సిద్ధించాక దశాబ్దాలపాటు భారత్‌ను ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు అహరహం కృషిచేసిన చరిత్రాత్మక కాంగ్రెస్ పార్టీకి అధ్యక్ష బరువు, బాధ్యతలు మోయనున్నామని అభ్యర్థి మననం చేసుకోవాలి’ అని రాహుల్ వ్యాఖ్యానించారు. అధ్యక్ష ఎన్నికల్లో ఎవరెవరు ఉంటారన్న వార్తల నడుమ గహ్లోత్ కేరళలో రాహుల్‌ను కలుసుకున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో మీరు బరిలో నిలుస్తారా? అన్న మీడియా ప్రతినిధుల ప్రశ్నకు రాహుల్ సమాధానం ఇచ్చారు. ‘ పోటీ చేస్తారా? అనే ప్రశ్నలు నన్ను భారత్ జోడో యాత్రపై లగ్నం చేసిన నా మనసును గురిచూసి కొడుతున్నాయి. అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయబోను. ఈ విషయం ఇప్పటికే చాలా సార్లు చెప్పాను’ అని మీడియాకు స్పష్టంచేశారు. బీజేపీని గద్దె దించాలంటే విపక్షాల ఐక్యత అత్యంత కీలకమని అభిప్రాయపడ్డారు. పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా కార్యాలయాలపై దాడుల అంశంపై రాహుల్ స్పందించారు. ‘హింస, విద్వేషం, మతతత్వం ఏ రూపంలో ఉన్నా వాటిని అణచివేయాల్సిందే’ అని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో భారత్ జోడో యాత్ర కొద్దిరోజులే ఉంటుందన్న విమర్శలపై.. ‘ యూపీ సంగతి ఆలోచిస్తాం. దేశం ఒక చివర నుంచి ఇంకొక వైపునకు యాత్ర ప్రణాళిక సిద్ధంచేశాం. దేశం మొత్తం యాత్ర అంటే ఏకంగా 10,000 కిలోమీటర్లు నడవలేం కదా!’ అని వ్యాఖ్యానించారు.

అధ్యక్ష ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదలైంది. ఈ నెల 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నామినేషన్లు సమర్పించవచ్చు. అక్టోబర్ ఒకటిన నామినేషన్ల పరిశీలన ఉంటుంది. పోటీ నుంచి నిష్క్రమించాలనుకుంటే అక్టోబర్ ఎనిమిదిలోపు నామినేషన్ ఉపసంహరించుకోవచ్చు. అక్టోబర్ 8న సాయంత్రం ఐదింటికి అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. ఏకగ్రీవం కాని పక్షంలో అక్టోబర్ 17న పోలింగ్ ఉంటుంది. అక్టోబర్ 19న ఓట్లు లెక్కించి విజేతను ప్రకటిస్తారు. 9,000 మందికిపైగా కాంగ్రెస్ కమిటీ ప్రతినిధులు పోలింగ్‌లో ఓట్లు వేస్తారు. ఓటింగ్ పాల్గొనే ప్రతినిధుల జాబితా ఇప్పటికే ఏఐసీసీ కార్యాలయంలో అందుబాటులో ఉంచామని పార్టీ కేంద్ర ఎన్నికల అథారిటీ చైర్మన్ మధుసూదన్ మిస్త్రీ చెప్పారు.

అయిదు రాష్ట్రాల ఎన్నికల ఖర్చు..

బీజేపీ రూ. 344 కోట్లు, కాంగ్రెస్ రూ. 195 కోట్లు

న్యూఢిల్లీ: ఎన్నికల ప్రచారానికి రాజకీయ పార్టీలు చేసే వ్యయం ఏడాదికేడాది తడిసిమోపెడవుతోంది. ఈ ఏడాది జరిగిన అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో (ఉత్తరప్రదేశ్, పంజాబ్, గోవా, మణిపూర్, ఉత్తరాఖండ్) బీజేపీ రూ.344.27 కోట్లు ఖర్చు చేసింది.2017లో ఈ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో చేసిన ఖర్చు కంటే ఇది 58% ఎక్కువ. అప్పట్లో బీజేపీ చేసిన ఖర్చు రూ.218.26 కోట్లుగా ఉంది. ఎన్నికల సంఘానికి రాజకీయ పార్టీలు సమర్పించిన నివేదికల ప్రకారం కాంగ్రెస్ చేసిన వ్యయం ఏకంగా 80 శాతం పెరిగింది. 2017లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారానికి 108.14 కోట్లు ఖర్చు చేయగా ఈ ఏడాది రూ.194.80 కోట్లు ఖర్చు పెట్టింది. ఇక బీజేపీ యూపీలో అత్యధికంగా రూ.221.32 కోట్లు ఖర్చు పెట్టగా, పంజాబ్, గోవాలలో ఖర్చు భారీగా పెరిగింది. కాగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాల వారీగా ఎంత ఖర్చు చేసిందో వెల్లడించలేదు.

5 రాష్ట్రాల ఎన్నికల వ్యయం (రూ.కోట్లలో)

పార్టీ	2017	2022	పెరుగుదల%
బీజేపీ	218.26	344.27	57.7
కాంగ్రెస్	108.14	194.80	80.1

రాష్ట్రాలవారీగా బీజేపీ వ్యయం (రూ.కోట్లలో)

రాష్ట్రం	2017	2022
యూపీ	175.10	221.32
మణిపూర్	7.86	23.52
ఉత్తరాఖండ్	23.48	43.67
పంజాబ్	7.43	36.70
గోవా	4.37	19.07

భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం ఎందుకివ్వరు?

ఐక్యరాజ్యసమితి: భారత్, జపాన్, బ్రెజిల్, ఉక్రెయిన్ లాంటి దేశాలకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం ఎందుకు కల్పించడం లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ నిలదీశారు. శాశ్వత సభ్యత్వం ఇవ్వకపోవడానికి కారణాలు ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. బుధవారం జరిగిన ఐరాస సాధారణ సభ చర్చా కార్యక్రమంలో వర్చువల్‌గా ప్రసంగించారు. భద్రతా మండలిలో అన్ని గొంతుకలకు అవకాశం కల్పించాలన్నారు. ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియా, సెంట్రల్, ఈస్టర్న్ యూరప్‌లకు వీటో అధికారం ఉండాలని సూచించారు. సమతూకంతో కూడిన భద్రతా మండలిని కోరుకుంటున్నామని ఉద్ఘాటించారు. ఇప్పటికే శాశ్వత సభ్యదేశ హోదా పొందిన రష్యా ఇతర దేశాలకు శాశ్వత సభ్యత్వం కల్పించడంపై ఏనాడూ మాట్లాడలేదని జెలెన్‌స్కీ విమర్శించారు. అందుకు కారణమేంటో చెప్పాలన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ఇప్పుడు ఐదు శాశ్వత సభ్యదేశాలున్నాయి. అవి రష్యా, యూకే, చైనా, ఫ్రాన్స్, అమెరికా. ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో మరికొన్ని దేశాలకు ఈ హోదా కల్పించాలన్న డిమాండ్లు ఊపందుకుంటున్నాయి. తమకు శాశ్వత సభ్యత్వం కల్పించాలని భారత్ కోరుతున్న సంగతి తెలిసిందే.

మసీదు, మదర్సాను సందర్శించిన మోహన్ భగవత్


మసీదులోకి వెళ్తున్న మోహన్ భగవత్

న్యూఢిల్లీ: దేశంలో మత సహనాన్ని పెంపొందించడానికి గత కొన్ని వారాలుగా ముస్లిం మేధావులతో మంతనాలు జరుపుతున్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ గురువారం ఒక మసీదు, మదర్సాను సందర్శించారు. ఆల్ ఇండియా ఇమామ్ ఆర్గనైజేషన్ చీఫ్ ఉమర్ అహ్మద్ ఇలియాస్‌ను కలుసుకొని ఏకాంతంగా గంటకు పైగా చర్చలు జరిపారు. సెంట్రల్ ఢిల్లీలోని కస్తూర్బా గాంధీ మార్గ్‌లో ఒక మసీదుని సందర్శించారు. తర్వాత ఉత్తర ఢిల్లీలోని ఆజాద్‌పూర్‌లో మదర్సాకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. తమ ఆహ్వానం మేరకే భగవత్ మసీదు, మదర్సాకి వచ్చారని ఇలియాస్ వెల్లడించారు.

సమతులాహారం... అందని ద్రాక్షే

- 71 శాతం మంది పౌష్టికాహారానికి దూరం
- సరుకులు తదితరాల ధరలు చుక్కల్లోకి
- పదేళ్లలో రెండింతలకు పైగా పెరుగుదల

డి.శ్రీనివాసరెడ్డి

పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగా మన్మోహన్‌సింగ్ చేపట్టిన సంస్కరణలు సగం ఉడికిన వంటకంలా ఉన్నాయని ప్రస్తుత మంత్రి నిర్మలా సీతారామన్ ఓ సదస్సులో అన్నారు. ‘ఇంకా నయం. మోదీ సర్కారు మాదిరిగా నోట్ల రద్దు, జీఎస్టీ బాదుడు, పెట్రో వాతలతో తినడానికే వీలు కాని మాడిపోయిన వంటకమైతే మన్మోహన్ తయారు చేయలేదు’ అంటూ కాంగ్రెస్‌కే చెందిన మరో కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం రిటార్టిచ్చారు. వంటకాల గోల ఎలా ఉన్నా సగటు భారతీయులు సరైన తిండి తినే భాగ్యానికి నోచుకోవడం లేదు. వారికి సమతులాహారం విలాస వస్తువుగా మారుతున్న దుస్థితి దాపురిస్తోంది...!

ఆహారోత్పత్తుల ధరలు కొన్నేళ్లుగా విపరీతంగా పెరిగిపోతున్నాయి. అంతర్జాతీయంగా ఆహార ధాన్యాలు, ఇంధనం ధరల పెరుగుదల, సరఫరా సమస్యలు తదితరాలు ఇందుకు కారణమని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీకి చెందిన ప్రొఫెసర్ లేఖా చక్రవర్తి చెప్పారు.

- దేశంలో ఏకంగా 71 శాతం మందికి ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులో లేదని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ), డౌన్ టు అర్త్ పత్రిక సంయుక్త నివేదిక తేల్చింది. ప్రపంచవ్యాప్త సగటు (42 శాతం) కంటే ఇది చాలా ఎక్కువ!
- సగటు భారతీయ కుటుంబపు ఆహార ఖర్చు గత పదేళ్లలో అక్షరాలా రెట్టింపైంది.
- ముగ్గురుండే కుటుంబానికి వారానికి ఐదు లీటర్ల పాలు, రెండేసి కిలోల బియ్యం, గోధుమ పిండి, టమాటాలు, ఆలుగడ్డలు, ఉల్లిపాయలు, లీటరు నూనె, పప్పు ధాన్యాలు, పండ్లు అవసరం.
- వీటన్నింటి ధరలూ ఆహార పదార్థాల ధరల సూచీ (సీఎఫ్‌పీఐ) ప్రకారమే 2014 నుంచి గత ఎనిమిదేళ్లలోనే 80 శాతం దాకా పెరిగాయి.
- గత ఏడాదిలో చూసుకున్నా దాదాపు 10 శాతం పెరిగినట్టు కేంద్ర గణాంకాలే చెబుతున్నాయి.



ధరాభారంతో బెంబేలు

ఆదాయం మూరెడు పెరిగితే ధరలు బారెడు పెరుగుతూ బెంబేలెత్తిస్తున్నాయి. దాంతో సగటు పౌరునికి పౌష్టికాహారం నానాటికీ తగ్గిపోతూ వస్తోంది. కుటుంబ ఆదాయంలో ఆహార వ్యయం 63 శాతానికి మించితే వారికి పౌష్టికాహారం దూరమైనట్టేనని ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ చెబుతోంది.

- ఫలితంగా 21 ఏళ్ల వ్యక్తి రోజుకు 200 గ్రాముల పండ్లకు బదులు 35.8 గ్రాములతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.
- 300 గ్రాముల కూరగాయలకు బదులు 168.7 గ్రాములే అందుతున్నాయి.
- ఈ పౌష్టికాహార లోపం ఊపిరితిత్తుల వ్యాధులు, మధుమేహంతో పాటు క్యాన్సర్, గుండె సమస్యలకు దారితీస్తోందని గ్లోబల్ న్యూట్రిషన్ రిపోర్టు హెచ్చరిస్తోంది.

మన థాలి ఖరీదెంత?

సగటు భారతీయుడు తినే థాలి (సమగ్ర భోజనం) ఖరీదును తొలిసారిగా 2019–20 ఆర్థిక సర్వే అంచనా వేసింది. 2020–21లోనూ మరో ప్రయత్నం చేశారు. వాటిలో తేలిందేమిటంటే...

- శాకాహార భోజనం ఖరీదు అండమాన్‌లో అతి ఎక్కువగా రూ. 38.7 , యూపీలో అతి తక్కువగా 23.1 రూపాయలు.
- ఐదుగురున్న కుటుంబపు నెలవారీ భోజన ఖర్చు 2015లో రూ.4,700 ఉంటే ఇప్పుడు రూ.6,700కు పెరిగింది.
- ఓ మాదిరి వ్యక్తి రెండు పూటల ఇంటి భోజనానికి 2015లో సగటున రూ.32 ఖర్చయితే ఇప్పుడు రూ.44కు పెరిగింది.

క్లుప్తంగా

నవరత్నాలతో బీసీల అభివృద్ధి

ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలతో బీసీల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడుతున్నాయని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ చెప్పారు. విజయవాడలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసా, అమ్మ ఒడి, ఆరోగ్యశ్రీ, చేయూత తదితర పథకాల ద్వారా బీసీలకు భరోసా అందుతోందని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గుతున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంపద కొద్ది మంది చేతుల్లోనే ఉండేదని.. ఇప్పుడు కుల, మత, పార్టీలకు అతీతంగా పేద ప్రజలందరికీ చేరుతోందన్నారు. రైతు భరోసా కేంద్రాలు, నాడు-నేడు స్కూళ్లు తదితరాలతో ఇప్పటికే రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన వైఎస్ జగన్ మరో 30 ఏళ్ల పాటు సీఎంగా కొనసాగితే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతున్నారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రచార కమిటీ చైర్మన్ జక్క శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీ రాణి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమ్మిశెట్టి రాము పాల్గొన్నారు.

బీసీలందరూ జగన్ వెంటే ఉన్నారు

- చంద్రబాబుకు ఇన్నాళ్లకు బీసీలు గుర్తుకొచ్చారా?
- విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్



భవానీపురం (విజయవాడ పశ్చిమ): టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు ఇన్నాళ్లకు బీసీలు గుర్తొచ్చారా అని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ ప్రశ్నించారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్నప్పుడు ఎందుకు ఈ కులాలు గుర్తుకు రాలేదని నిలదీశారు. గురువారం విజయవాడ గొల్లపూడిలో ఉన్న బీసీ సంక్షేమ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇన్నాళ్లూ బీసీల పార్టీ అని చెప్పుకుని ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన తరువాత వారిని మోసం చేసిన చంద్రబాబు పెట్టాల్సింది సాధికార సభలు కాదని, బీసీలకు బహిరంగ క్షమాపణ సభలని అన్నారు. రాష్ట్రంలో బీసీలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ఉన్నారని స్పష్టంచేశారు. జనరల్ స్థానాల్లో బీసీలకు మేయర్, జిల్లా పరిషత్ చైర్మన్లుగా అవకాశం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతిగా నిలిచారని అన్నారు. బీసీ మహిళలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించటం ద్వారా వారు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనటం రాజకీయ చైతన్యం కాదా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడే బీసీల స్థితిగతులపై అధ్యయన కమిటీ వేశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ప్రతి కులాన్ని ప్రభుత్వంలో భాగస్వామ్యం చేశారని, ఆ పని మీరు ఎందుకు చేయలేక పోయారని చంద్రబాబును ప్రశ్నించారు. నాలుగు దశాబ్దాలుగా బీసీ ఉద్యమాల్లో ఉన్న ఆర్ కృష్ణయ్యను ఎన్నికల్లో వాడుకుని చంద్రబాబు వదిలేస్తే ఆయన్ని రాజ్యసభకు పంపిన ఘనత సీఎం జగనన్నకు దక్కుతుందన్నారు.

హెల్త్ వర్సిటీకి వైఎస్సార్ పేరు సముచితం

- ఎన్టీఆర్‌ను మానసికంగా హత్య చేసిన చరిత్ర చంద్రబాబుది
- మంత్రి సీదిరి అప్పలరాజు



సాక్షి, అమరావతి: హెల్త్ యూనివర్సిటీకి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు పెట్టడం సముచితం అని మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పారు. వైఎస్సార్ పరిపాలనకు ముందు, ఆ తరువాత వైద్య రంగంలో స్పష్టమైన మార్పు కనిపిస్తుందని, వైద్య విద్య, వైద్య శాఖలో సంస్కరణల్లో స్పష్టమైన తేడా ఉందని తెలిపారు. వైఎస్సార్ సువర్ణ పాలన, ఆయన ప్రజలకు అందించిన సేవలకు గుర్తుగా హెల్త్ యూనివర్సిటీకి వైఎస్సార్ పేరు పెట్టామన్నారు. గురువారం ఆయన తాడేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఏపీలో లక్షలాది మంది గుండెలు ఆగిపోకుండా ఉన్నాయంటే అందుకు కారణం వైఎస్సార్ తీసుకువచ్చిన ఆరోగ్యశ్రీ పథకమే కారణమని మంత్రి చెప్పారు. వేలాది నిరుపేద విద్యార్థులు వైద్య విద్య పూర్తి చేసుకుంటున్నారంటే దానికి వైఎస్సార్ చేసిన సేవే కారణమన్నారు. అన్ని బోధనాస్పత్రులు, ఏరియా, కమ్యూనిటీ ఆస్పత్రుల్లో ప్రజల నుంచి యూజర్ చార్జీలను వసూలు చేసిన చరిత్ర చంద్రబాబుది అని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మార్చి నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు ఉచితంగా అందజేయాలనే ఆలోచన చంద్రబాబు ఎప్పుడైనా చేశారా అని ప్రశ్నించారు. ఎన్టీఆర్‌ను క్షోభకు గురిచేసి మానసికంగా హత్య చేసిన చరిత్ర చంద్రబాబుదని అన్నారు. దాని నుంచి బయటపడాలని విరుగుడుగా హెల్త్ యూనివర్సిటీకి ఎన్టీఆర్ పేరు పెట్టాడని, అందుకు చంద్రబాబు ఎంత బాధపడి ఉంటాడో ఆయన మాటల్లోనే అర్థం అవుతుందని చెప్పారు.

అన్నపూర్ణ.. టీటీడీ

తిరుమలలో నిరంతర యజ్ఞంగా అన్నప్రసాద వితరణ

- 17వ శతాబ్దంలోనే నాంది పలికిన తరిగొండ వెంగమాంబ
- రోజూ 12 టన్నుల బియ్యం, 8 టన్నుల కూరగాయల వినియోగం
- అన్నదాన ట్రస్ట్‌లో రూ.1,502 కోట్ల నిధులు

తిరుమల : తిరుమల శ్రీవారి భక్తులకు ఆకలి బాధలు తెలియకుండా తిరుమల తిరుపతి దేవస్థానం అల్పాహారాలు, అన్నప్రసాద వితరణ చేస్తూ అన్నపూర్ణగా ఖ్యాతిగడించింది. ఎన్ని వేల మంది వచ్చినా ఇబ్బంది పడకుండా టీటీడీ అన్నప్రసాద వితరణ యజ్ఞాన్ని నిరాటంకంగా కొనసాగిస్తోంది. తిరుమలలో 17వ శతాబ్దంలోనే భక్తుల కోసం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రత్యేకంగా అన్నప్రసాద వితరణ ప్రారంభించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. అందువల్ల ఆమె పేరుతోనే టీటీడీ మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్స్‌ను నిర్మించింది. ఒకేసారి నాలుగు వేల మంది భోజనం చేసేలా ఆధునిక సదుపాయాలతో నిర్మించిన ఈ భవనాన్ని 2011 జూలై 11న అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ ప్రారంభించారు.

రూ.10 లక్షలతో అన్నప్రసాద వితరణ ప్రారంభం

ఇక 1933లో తిరుమల తిరుపతి దేవస్థానములు ఏర్పడిన మూడు దశాబ్దాల తర్వాత అతి తక్కువ ధరలకు భక్తులకు అల్పాహారం, భోజనం అందించేందుకు పలు ప్రాంతాల్లో టీటీడీ క్యాంటీన్లు ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే పాత అన్నప్రసాద భవనాన్ని 1980 జూన్ 5వ తేదీన ప్రారంభించింది. ఇక్కడ కూడా ప్లేట్ మీల్స్ రూ.1.75, ఫుల్ మీల్స్ రూ.3, స్పెషల్ మీల్స్ రూ.4.50 విక్రయించేవారు. తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో టీటీడీ 1985లో ఉచిత అన్నప్రసాద వితరణకు శ్రీకారం చుట్టింది. ఎల్‌వీ రామయ్య అనే భక్తుడు ఇచ్చిన రూ.పది లక్షల భూరివిరాళంతో టీటీడీ ఉచిత అన్నప్రసాద వితరణను ప్రారంభించింది. అప్పట్లో శ్రీవారి దర్శనం చేసుకున్న భక్తులకు మాత్రమే ఆలయంలో ఉచిత భోజనం టోకెన్లు అందించేవారు. తొలుత రెండు వేల మందికి భోజనం అందించగా, క్రమంగా ఈ సంఖ్య 20 వేలకు పెరిగింది. భక్తుల సంఖ్య భారీగా పెరగడంతో టీటీడీ 2008లో సర్వభోజన పథకానికి శ్రీకారం చుట్టింది. నాటి నుంచి తిరుమలలో భక్తులందరికీ శ్రీవారి అన్నప్రసాద వితరణను ఉచితంగా కొనసాగిస్తూ భక్తుల సేవలో తరిస్తోంది.

పలు ప్రాంతాల్లో అన్నప్రసాద వితరణ

- తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్స్‌తోపాటు నాలుగు ప్రాంతాల్లో అన్నప్రసాదాలు తయారు చేస్తారు.



తరిగొండ వెంగమాంబ అన్నదాన కేంద్రం

- వెంగమాంబ కాంప్లెక్స్‌లో అన్నం, కూర, చట్నీ, సాంబార్, రసం, మజ్జిగ, చక్కెర పొంగలి అందిస్తారు.
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1, 2, వెలుపలి క్యూలైన్లు, పీఏసీ-2, ఫుడ్ కౌంటర్లలో సాంబార్ బాత్, ఉప్మా, పొంగలి, పులిహోర అందిస్తారు.
- సాధారణ రోజుల్లో రోజుకు 55వేల నుంచి 60వేల మంది భక్తులకు అన్నప్రసాదాలు అందిస్తున్నారు. పర్వదినాలు, రద్దీ రోజుల్లో ఈ సంఖ్య లక్ష వరకు చేరుతుంది.
- సాధారణ రోజుల్లో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఉదయం 9 నుంచి రాత్రి 11 గంటల వరకు అన్నప్రసాద వితరణ ఉంటుంది. బ్రహ్మోత్సవాల రోజుల్లో ఉదయం 8 నుంచి రాత్రి 11.30 గంటల వరకు, గరుడసేవ రోజు రాత్రి ఒంటి గంట వరకు అన్నప్రసాద వితరణ ఉంటుంది.
- అన్నప్రసాదాల తయారీకి రోజూ దాదాపు 10 నుంచి 12 టన్నుల బియ్యం, 7 నుంచి 8 టన్నుల కూరగాయలు వినియోగిస్తున్నారు.
- సరుకుల నాణ్యత విషయంలో టీటీడీ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటుంది. తిరుపతిలోని మార్కెటింగ్ గోడౌన్ నుంచి తెచ్చిన సరుకులను ప్రయోగశాలలో పరిశీలించిన తర్వాత అన్నప్రసాద విభాగానికి చేరవేస్తారు.

అన్నదాన ట్రస్టులో రూ.1,502 కోట్ల నిధులు

దాతల సహకారంతో టీటీడీ అన్నదాన ట్రస్టులో రూ.1,502 కోట్ల నిధులు సమకూరాయి. ఈ ట్రస్టు 2018వ సంవత్సరంలో స్వయంసమృద్ధి సాధించడంతో టీటీడీ గ్రాంటు నిలిపివేసింది. భక్తులకు మరింత పోషకాలతో కూడిన అన్నప్రసాదాలు అందించేందుకు భవిష్యత్తులో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు అందించాలని దాతలను టీటీడీ కోరుతోంది.

బాబు బూటకాలు

- కేంద్ర నిధులతోనే ఎయిమ్స్ ఏర్పాటు: మంత్రి విడదల రజిని
- మెడికల్ కాలేజీలపై చంద్రబాబు చేసిందేమీ లేదు
- వైద్య రంగంలో విప్లవానికి నాంది పలికిన వైఎస్సార్



గుంటూరు మెడికల్: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మాటలన్నీ బూటకాలేనని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని విమర్శించారు. వైద్య కళాశాలల విషయంలో చంద్రబాబుతోపాటు ఆ పార్టీ నేతలు అసత్యాలు వల్లిస్తున్నారని మండిపడ్డారు. గురువారం సాయంత్రం గుంటూరులో ఆమె మీడియాతో మాట్లాడారు.

విభజన చట్ట ప్రకారమే ఎయిమ్స్..

టీడీపీ నేతలు గోబెల్స్ ప్రచారంలో ముందుంటారు. మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిని తామే తెచ్చినట్లు చంద్రబాబు, ఆ పార్టీ నేతలు చెప్పుకోవడం సిగ్గుచేటు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం తన నిధులతో ఎయిమ్స్‌ను ఏర్పాటు చేసింది. గత ప్రభుత్వానికి, ఎయిమ్స్‌కు ఎలాంటి సంబంధం లేదు. టీడీపీ నేతల పోరాటాల వల్లే వచ్చిందని చెప్పడం హాస్యాస్పదం.

- అసెంబ్లీలో ప్రకటించినట్లుగా రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలలు 11 మాత్రమే. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎయిమ్స్‌ను, టీటీడీ ఆధ్వర్యంలో నడిచే స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన పద్మావతి మెడికల్ కళాశాలను రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలలంటూ టీడీపీ గోబెల్స్ ప్రచారం చేస్తోంది.

వైఎస్సార్ ఆలోచనే తిరుపతి కళాశాల

తిరుపతిలో పద్మావతి మహిళా వైద్య కళాశాలను మహిళల కోసం ప్రత్యేకంగా నిర్మించాలని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తలచారు. నెల్లూరులో కూడా ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటైందంటే వైఎస్సార్ చొరవే కారణం. తిరుపతి, నెల్లూరులో వైద్య కళాశాలల నిర్మాణాల కోసం 2007లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అంచనాలు రూపొందించి ఆ తరువాత బడ్జెట్ కేటాయింపులు చేశారు. 2013 చివరి నాటికి ఆ కళాశాలలకు అనుమతులు, భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. 2014 ఆగస్టులో వాటిలో అడ్మిషన్లు చేపట్టారు. రెండు మెడికల్ కళాశాలలు డాక్టర్ రాజశేఖరరెడ్డి చలువ వల్లే రాష్ట్రానికి వచ్చాయి. అనంతరం ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు 2014 ఆగస్టులో వాటిని ప్రారంభించారు. వాటిని తానే తెచ్చినట్లు చంద్రబాబు చెప్పుకోవడం సిగ్గుచేటు. పద్మావతి మెడికల్ కళాశాలలో ఎన్నారై కోటా కింద 23 సీట్లు అమ్ముకోవచ్చంటూ చంద్రబాబు సర్కారు దుర్మార్గంగా జీవో ఇచ్చింది. అందుకే భగవంతుడు టీడీపీకి గుర్తుండేలా ఆ పార్టీని 23 సీట్లకు పరిమితం చేసి గత ఎన్నికల్లో శిక్ష విధించారు. రాష్ట్రంలో 18 ప్రైవేట్ మెడికల్ కళాశాలలు ఉంటే 13 కాలేజీలకు అనుమతులు ఇచ్చింది చంద్రబాబే. టీడీపీ హయాంలో ప్రభుత్వ వైద్య రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు.

- పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ రంగంలో 17 వైద్య కళాశాలల నిర్మాణానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారు.
- ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్సులు, 104 వాహనాలు, వైద్య కళాశాలల ఏర్పాటుతో మనసున్న డాక్టర్‌గా వైఎస్ రాజశేఖరరెడ్డి చరిత్రలో గొప్ప నాయకుడిగా నిలిచారు.

బీసీలకు పెద్దపీట

ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచింది చంద్రబాబు : మంత్రి కారుమూరి



సాక్షి, విశాఖపట్నం: సీఎం జగన్ ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణం నుంచే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అన్నింటా పెద్దపీట వేస్తూ 'బహుజన సుఖాయ.. బహుజన హితాయ' అన్నట్లుగా పరిపాలన అందిస్తున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు చెప్పారు. తొలి మంత్రివర్గంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 56 శాతం, మలిదఫాలో 70 శాతం చోటు కల్పించిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని గుర్తు చేశారు. ఏలూరు బీసీ గర్జనలో ఇచ్చిన హామీలను మూడున్నరేళ్లలోనే సీఎం జగన్ అమలు చేశారన్నారు. బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశారన్నారు. రిక్షా కార్మికుడి బిడ్డలు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా ఉన్నత చదువులు చదివి విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని గుర్తు చేశారు. గురువారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు.

బీసీలపై బాబు కపట ప్రేమ

బీసీల ద్రోహి చంద్రబాబు. అధికారంలో ఉండగా నోరెత్తితే తాట తీస్తా.. తోకలు కట్‌చేస్తా.. అని బెదిరించి ఇవాళ బీసీలపై కపట ప్రేమ నటిస్తున్నారు. బీసీలు జడ్జీలుగా పనికిరారంటూ కేంద్రానికి లేఖలు రాసింది చంద్రబాబు కాదా? 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఒక్క బీసీకి కూడా రాజ్యసభ సీటు ఇచ్చిన సందర్భాలు లేవు. ఐదుగురు బీసీలను రాజ్యసభకు పంపించిన ఏకైక సీఎం వైఎస్ జగన్. మంత్రి వర్గంలో 25 మంది ఉంటే 17 మంది అంటే 70 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే అవకాశం కల్పించారు.

రాష్ట్రంలోనే నిత్యావసర ధరలు తక్కువ

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే నిత్యావసర సరుకుల ధరలు మన రాష్ట్రంలోనే తక్కువగా ఉన్నాయి. ఎల్లో మీడియా ద్వారా అవాస్తవాలు ప్రచురిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు.

రాజకీయాలు లేవు..

ఎన్టీఆర్ విశ్వవిద్యాలయానికి పేరు మార్చడం విషయంలో ఎలాంటి రాజకీయాలు లేవు. ఆయనకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు మొసలి కన్నీరు కారుస్తున్నారు. లక్షల మంది పేదల ప్రాణాలను కాపాడిన ఆరోగ్యశ్రీ, 108, 104లు దివంగత వైఎస్సార్ చలువే. లక్షల మంది పేద ప్రజలకు ప్రాణాలు పోసిన వైద్యదాత వైఎస్సార్ పేరు పెట్టడం సముచితమే. సీఎం, ఆయన కుటుంబానికి ఎన్టీఆర్‌పై ఎప్పుడూ గౌరవం, ప్రేమ ఉంటాయి. ఎన్టీఆర్‌ని గౌరవించినందునే కృష్ణా జిల్లాకి ఎన్టీఆర్ పేరు పెట్టారు.

బీసీల మద్దతుంటే ఎందుకు ఓడారు బాబూ?

వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి



సాక్షి,అమరావతి: రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలు (బీసీలు) చంద్రబాబు వెనకనుంటే 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎందుకు అంతటి చారిత్రక ఓటమి పాలైందని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి. విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. రాష్ట్ర బీసీ సాధికారక కమిటీ పేరుతో జరిగిన సదస్సులో టీడీపీ అధినేత ఈ ప్రశ్నకు జవాబు చెప్పలేదని.. కానీ, ఓబీసీలందరూ తెలుగుదేశం పక్షానే ఉన్నారని ప్రకటించడం ఆశ్చర్యం కల్గిస్తోందని గురువారం ఆయనొక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు పాలనలో వెనుకబడిన కులాలు కుదేలయ్యాయని.. ఎస్సీలు, ఎస్టీలు, ఇతర కులాల్లోని పేదల సంక్షేమాన్ని టీడీపీ మరిచిపోయిందని ఆయన పేర్కొన్నారు. ఆధిపత్య వర్గాల్లోని పెత్తందారులు, సంపన్నుల ప్రయోజనాలకే ఆ పార్టీ ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. తొలిరోజుల్లో టీడీపీకి ఓ మోస్తరుగా మద్దతు పలికిన బీసీలు, చంద్రబాబు పాలనలో కష్టాలపాలయ్యాక టీడీపీకి దూరమయ్యారని వివరించారు. 2014 ఎన్నికల్లో స్వల్ప ఆధిక్యంతో టీడీపీ అధికారంలోకి వచ్చినప్పుడు కూడా బీసీల మద్దతు ఆ పార్టీకి అంతంతమాత్రంగానే ఉందన్నారు. టీడీపీకి వచ్చిన ఓట్లు, సీట్లు ఈ విషయం రుజువుచేస్తున్నాయని విజయసాయిరెడ్డి ఆ ప్రకటనలో తెలిపారు. అలాగే, విభజిత ఏపీలో బీసీల ప్రయోజనాలకు భంగం కలిగిందని.. రాజ్యాధికారంలో వారి వాటా కూడా తగ్గిందన్నారు. వీటన్నింటివల్ల మిగిలిన అన్ని సామాజికవర్గాలతో కలిసి వెనుకబడిన కులాలు కూడా వైఎస్సార్‌సీపీకి పెద్దఎత్తున మద్దతు పలికాయని ఆయన పేర్కొన్నారు.

ఎన్టీఆర్ గుండెల్లో గునపం బాబు

బాబు రాజకీయ తార్పుడుగాడని ఎన్టీఆరే అన్నారు: మంత్రి జోగి రమేష్



సాక్షి, అమరావతి: ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పదవి లాక్కుని చివరకు ఆయన మరణానికి కారణమైన చంద్రబాబు కపట ప్రేమ నటిస్తున్నారని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ధ్వజమెత్తారు. ఎన్టీఆర్ గుండెల్లో చంద్రబాబు గునపం లాంటి వ్యక్తి అని మండిపడ్డారు. ఎన్టీఆర్ పేరుతో ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

- విద్య, వైద్య ఆరోగ్య రంగాలలో విప్లవాత్మక మార్పులను తెచ్చిన వైఎస్సార్ పేరును ఆరోగ్య వర్సిటీకి పెట్టడంలో తప్పేముంది? చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉండి కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ పేరు ఎందుకు పెట్టలేదు? 'రాజకీయ తార్పుడుగాడు ఎవరైనా ఉన్నారంటే చంద్రబాబే' అని ఆనాడు ఎన్టీఆర్ వ్యాఖ్యానించారు. చంద్రబాబు నీచ రాజకీయాలపై గవర్నర్‌ను కలసి వివరిస్తాం.
- టీడీపీ హయాంలో వచ్చినవన్నీ ప్రైవేట్ మెడికల్ కాలేజీలే. కాటూరి, నారాయణ, ఎన్నారై మెడికల్ కాలేజీలు ఆయన వర్గానికి చెందిన వారివే కదా?

ఎన్టీఆర్ పేరు తొలగించడం అనైతికం


- హెల్త్ వర్సిటీ పేరు మారుస్తూ తెచ్చినది చీకటి చట్టం
- ఈ బిల్లును తిరస్కరించాలని గవర్నర్‌ను కోరాం
- బిల్లుపై కేంద్ర స్థాయిలో, లీగల్‌గా పోరాడతాం
- టీడీపీ హయాంలో 13 ప్రైవేటు మెడికల్ కాలేజీలు వచ్చాయి
- టీడీపీ అధినేత చంద్రబాబు



సాక్షి, అమరావతి: ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్చాలని చీకటి చట్టం తెచ్చారని, అసంబద్ధంగా ఉన్న బిల్లును తిరస్కరించాలని గవర్నర్‌ను కోరినట్టు టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు చెప్పారు. హెల్త్ యూనివర్సిటీ పేరును మార్చడంపై చంద్రబాబు గవర్నర్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం రాజ్ భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. ఎన్టీఆర్‌కు వైఎస్సార్‌తో పోలిక ఏమిటని, ఏ అంశంలో పోలుస్తారని ప్రశ్నించారు. కొత్త మెడికల్ కాలేజ్ కట్టి వైఎస్సార్ పేరు పెట్టుకోవాలన్నారు. మెడికల్ కౌన్సిల్ అనుమతి ఇచ్చిందా, వర్సిటీకి ఛాన్సలర్‌గా ఉన్న గవర్నర్‌ను అడిగారా, ఇది గవర్నర్ కు అవమానం కాదా అని అన్నారు. ఇదే విషయాన్ని గవర్నర్‌ను అడిగామన్నారు. బిల్లు తెచ్చిన విషయం తనకు తెలియదని గవర్నర్ తెలిపారని, దీనిపై కేంద్ర స్థాయిలో, లీగల్‌గా కూడా పోరాడతామని అన్నారు. వైఎస్సార్‌సీపీ సభ్యులు సభలో వాడుతున్న భాషనూ గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహా వివిధ అంశాలను వివరించామన్నారు. ప్రతిపక్ష నేతలు, ప్రజలపై కేసులు పెడుతున్న విధానం, రాష్ట్రంలో స్టేట్ స్పాన్సర్డ్ టెర్రరిజం వంటి పరిస్థితులను వివరించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 32 మెడికల్ కాలేజీలు ఉంటే 13 ప్రైవేటు, 5 ప్రభుత్వ కాలేజీలు మొత్తం 18 టీడీపీ హయాంలోనే వచ్చాయని చంద్రబాబు చెప్పారు. అసెంబ్లీలో ఇన్ని అసత్యాలు చెప్పిన సీఎంను చూడలేదన్నారు. జగన్ పాలనలో మూడున్నరేళ్లకు మూడు కాలేజీలకు మాత్రమే అనుమతులు ఇచ్చారని, కనీసం వాటి గోడలు కూడా పూర్తి చెయ్యలేదని చెప్పారు. రాష్ట్రానికి ఎయిమ్స్‌ను తీసుకువస్తే దానికి నీటి సరఫరా కూడా చెయ్యలేదని ఆరోపించారు. టీడీపీ హయాంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ నుంచి మహా ప్రస్థానం వాహనం వరకు అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇప్పుడు కుప్పం ఆసుపత్రిలో కనీసం అన్నం పెట్టడంలేదని, మెడ్‌టెక్ పార్క్ లాంటి దాన్ని భ్రష్టుపట్టించారని విమర్శించారు. తాను రాజకీయంగా విభేదించిన వారి పేరు మీద వారి మరణానంతరం అనేక కార్యక్రమాలు చేపట్టానని వివరించారు. రక్తం పంచుకుని పుట్టిన జగన్ చెల్లెలు కూడా వర్సిటీ పేరు మార్పు సబబు కాదు అని చెప్పిందని చంద్రబాబు చెప్పారు.

హెల్త్ వర్సిటీ పేరెందుకు మార్చారో చెప్పాలి

బీజేపీ నాయకురాలు పురందేశ్వరి



ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): హెల్త్ యూనివర్సిటీ పేరు ఎందుకు మార్చారో సీఎం జగన్ రాష్ట్ర ప్రజలకు చెప్పాలని ఎన్టీఆర్ కుమార్తె, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి పురందేశ్వరి డిమాండ్ చేశారు. గురువారం విశాఖలో ఆమె మీడియాతో మాట్లాడారు. విలువలతో కూడిన రాజకీయాలకు ఎన్టీఆర్ నిలువెత్తు నిదర్శనమని చెప్పారు. తాను వైఎస్సార్‌కు వ్యతిరేకం కాదని.. హెల్త్ యూనివర్సిటీకి ఎన్టీఆర్ పేరు మార్చడాన్ని వ్యతిరేకిస్తున్నానన్నారు.

బీసీల ద్రోహి చంద్రబాబు

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ధ్వజం
సంక్షేమ పథకాలు, రాజ్యాధికారంలో బీసీలకు సీఎం జగన్ పెద్దపీట



సాక్షి, అమరావతి: బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేసిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చరిత్రలో బలహీన వర్గాల ద్రోహిగా నిలిచిపోతారని డిప్యూటీ సీఎం (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ) బూడి ముత్యాలనాయుడు మండిపడ్డారు. కనుచూపు మేరలో ఎన్నికలు కనిపిస్తుండటంతో బాబుకు మళ్లీ బీసీలు గుర్తుకొస్తున్నారని దుయ్యబట్టారు. సంక్షేమ పథకాల ద్వారా బీసీ వర్గాలకు ఆర్థిక స్వావలంబన, రాజ్యాధికారంలో భాగస్వామ్యం ద్వారా సామాజిక సాధికారత దిశగా సీఎం జగన్ బాటలు వేశారని చెప్పారు. బీసీలను చంద్రబాబు బ్యాక్ వర్డ్ క్లాస్‌గా భావిస్తే బ్యాక్ బోన్ క్లాస్‌గా సీఎం జగన్ మార్చారని తెలిపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు.

- ఉమ్మడి రాష్ట్రంలో 1999 ఎన్నికల ముందు ఓట్ల కోసం రజకులకు నాలుగు ఇస్త్రీ పెట్టెలు, నాయీ బ్రాహ్మణులకు కత్తెరలు, శెట్టి బలిజ, గీత కార్మికులకు మోకులు ఇవ్వటం మినహా బీసీలకు చంద్రబాబు ఏం చేశారు?
- బీసీలకు ఏటా రూ.10 వేల కోట్లు, ఐదేళ్లలో రూ.50 వేల కోట్లు ఇస్తామని 2014 ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ప్రకటించిన చంద్రబాబు ఐదేళ్లలో ఏమీ ఇవ్వకుండా మోసం చేశారు.
- బీసీలకు తొలుత న్యాయం జరిగింది దివంగత వైఎస్సార్ హయాంలోనే. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి పథకాల ద్వారా బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కూడా ఆదుకున్నారు. నిరుపేద కుటుంబాల పిల్లలు ఉన్నత చదువులు చదివితేనే వారి బతుకులు మారతాయని ఆయన గట్టిగా నమ్మారు. సామాన్యులు కూడా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందేలా ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టారు. చంద్రబాబు ఏనాడైనా ఆ కోణంలో ఆలోచించారా? కనీసం ఒక్కటైనా అమలు చేశారా?
- పాదయాత్రలో పేదల కష్టాలను స్వయంగా చూసిన సీఎం జగన్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారు. అమ్మ ఒడి పథకం, విద్యాదీవెన, విద్యాకానుక, పొదుపు మహిళలకు ఆసరా, అక్కచెల్లెమ్మలకు చేయూత లాంటి పథకాలను దేశంలో ఎక్కడా లేని విధంగా అమలు చేస్తున్నారు.
- బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలుస్తూ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఏకంగా నలుగురు బీసీలను రాజ్యసభకు ఎంపిక చేశారు.
- బీసీల సంక్షేమం కోసం ఏకంగా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు బీసీల్లో మొత్తం కులాలు, ఉప కులాలను గుర్తించేందుకు అధ్యయన కమిటీని ఏర్పాటు చేశారు.
- ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి సీఎం పదవిని చంద్రబాబు లాక్కున్నారు. చివరకు ఎన్టీఆర్‌పై చెప్పులు వేయించిన చరిత్ర చంద్రబాబుది. అలాంటి వ్యక్తి ఇవాళ రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్టీఆర్‌ను దేవుడు అంటున్నారు.
- తనకు ఇక రాజకీయ భవిష్యత్తు లేదని చంద్రబాబుకు తెలుసు. కుప్పంలో పోటీ చేసే శక్తి, సామర్థ్యం ఆయనకు లేవు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయం.

ఎన్టీఆర్‌కు ద్రోహం.. బీసీలకు విద్రోహం

- వెన్నెముక కులాల వెన్ను విరిచింది బాబే కదా: మంత్రి చెల్లుబోయిన



సాక్షి, అమరావతి: బీసీ కులాల వెన్నెముక విరిచింది చంద్రబాబేనని బీసీ సంక్షేమం, సమాచార శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ ధ్వజమెత్తారు. ఎన్టీఆర్ కు ద్రోహం చేసినట్లే బీసీలకూ బాబు ద్రోహం చేశారని దుయ్యబట్టారు. బీసీలంటే బాబు దృష్టిలో రామోజీ, రాధాకృష్ణలేనని వ్యాఖ్యానించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

- ఏలూరు బీసీ గర్జన సభ డిక్లరేషన్ ప్రకారం సీఎం జగన్ అధికారంలోకి రాగానే బీసీలంతా ఆత్మగౌరవంతో తలెత్తుకుని జీవించేలా చర్యలు తీసుకున్నారు. మాట ప్రకారం బీసీ వర్గాల్లో 139 కులాలకు సంబంధించి 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు అన్ని పదవుల్లోనూ బీసీలకు సముచిత స్థానం కల్పించి గౌరవించారు. సంక్షేమ పథకాల ద్వారా బీసీల జీవన ప్రమాణాలను పెంపొందిస్తున్నారు. వారిని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వృద్ధిలోకి తెస్తున్నారు. రాష్ట్రంలో సామాజిక విప్లవానికి నాంది పలికారు. కేబినెట్‌లో బీసీలకు సీఎం జగన్ పెద్దపీట వేశారు. గతంలో ఎన్నడూ లేని స్థాయిలో మంత్రి పదవులు ఇచ్చారు.
- చంద్రబాబు రాజకీయ అవసరాల కోసమే ఎన్టీఆర్ జపం చేస్తున్నారు. ఒక్క మెడికల్ కాలేజీ అయినా చంద్రబాబు తెచ్చారా? స్పీకర్ స్థానంలో ఉన్న బీసీ వ్యక్తిని అగౌరవపరుస్తారా? 14 ఏళ్లు సీఎంగా ఉండి బీసీలకు ఏం చేశారని చంద్రబాబుకు మద్దతు ఇవ్వాలి?
- బీసీ నాయకత్వాన్ని పెంచామని తరచూ చెప్పే చంద్రబాబు ఆయనకు వంతపాడే, వెన్నుపోటుకు సహకరించిన యనమల, కింజారాపు కుటుంబాలను మినహా ఇతరులను ఎప్పుడైనా ప్రోత్సహించారా? రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టంగా ఉన్నా పది శాతం పెంచినట్లు నటించి మీ పార్టీకి చెందిన వ్యక్తి ద్వారానే కేసులు వేయించి రద్దు చేయించడం బీసీలను మోసం చేయడం కాదా?
- మూడేళ్లలో ప్రభుత్వం చేకూర్చిన లబ్ధి, మంచి పనుల గురించి ఇంటింటికీ వెళ్లి చర్చిద్దాం. ప్రతిపక్షానికి ఆ ధైర్యం ఉందా? చంద్రబాబుకు 40 నెలల తరువాత బీసీలు గుర్తుకొచ్చారా?



చిత్తూరు జిల్లా ఎర్రాతివారిపల్లెలో బుక్‌లెట్లను పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి



కృష్ణా జిల్లా కోలవెన్నులో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పార్థసారథి



నెల్లూరు జిల్లా కోటితీర్థంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఉత్సాహంగా సాగింది. ఇందులో పాల్గొన్న పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఎటువంటి అవినీతికి తావు లేకుండా తమకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ప్రజాప్రతినిధుల వద్ద పలువురు లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఇళ్లకు వస్తున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులకు ప్రజలు వాడవాడనా ఎదురేగి స్వాగతం పలికారు. సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తమ ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని దీవించారు.

క్లుప్తంగా

నీట్ యూజీ రాష్ట్ర అర్హుల జాబితా విడుదల

సాక్షి, అమరావతి: నీట్ యూజీ–2022లో అర్హత పొందిన రాష్ట్ర విద్యార్థుల జాబితాను ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం ప్రకటించింది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీజీహెచ్ఎస్) నుంచి అందిన సమాచారం మేరకు విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలిసేందుకు జాబితాను ప్రదర్శించినట్లు వెల్లడించారు. జాబితా ప్రకారం 710 స్కోర్‌తో జాతీయ స్థాయిలో 12వ ర్యాంక్ సాధించిన ఎం.దుర్గసాయి కీర్తి తేజ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచారు. 15వ ర్యాంక్‌తో ఎస్.వెంకటసాయివైష్ణవి రెండో స్థానంలో, 25వ ర్యాంక్‌తో జి.హర్షవర్ధన్ మూడో స్థానంలో ఉన్నారు. తొలి పది స్థానాల్లో ఐదుగురు యువకులు, ఐదుగురు యువతులున్నారు. జనరల్ కేటగిరీలో 50 పర్సంటైల్ 117 స్కోర్, జనరల్ వికలాంగ కేటగిరీలో 45 పర్సంటైల్ 105 స్కోర్, బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీల్లో వికలాంగులతో కలిపి 40 పర్సంటైల్, 93 కటాఫ్ స్కోర్ ఆధారంగా 40,097 మంది విద్యార్థులతో జాబితాను ప్రదర్శించారు.

నేటి నుంచి జోసా రౌండ్-1 సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌కు సంబంధించి జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) తొలివిడత సీట్ల కేటాయింపు శుక్రవారం ప్రారంభం కానుంది. మొత్తం ఆరు విడతల్లో జోసా ఈ సీట్లను కేటాయించనుంది. ఈ ఆరు విడతల ప్రక్రియ అక్టోబర్ 17తో ముగియనుంది. అనంతరం అక్టోబర్ 19–21 తేదీల్లో ఐఐటీలు, ఎన్ఐటీల్లో మిగిలిన సీట్ల భర్తీకి స్పెషల్ రౌండ్‌ను జోసా చేపట్టనుంది. ఐఐటీల్లో 16,598, ఎన్ఐటీల్లో 23,994, ఐఐఐటీల్లో 7,126 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నడిచే విద్యాసంస్థల్లో 6,759 సీట్లను కూడా జోసానే భర్తీ చేయనుంది.

ఎన్నారై కోటా సీట్లకు దరఖాస్తు గడువు పెంపు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలోని కళాశాలల్లో బీఎస్సీ(వ్యవసాయం), కమ్యూనిటీ సైన్సు కోర్సుల్లో ఎన్నారై కోటా సీట్ల భర్తీకి 2వ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ పి.సుధాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబర్ 10 వరకు గడువు పెంచినట్లు పేర్కొన్నారు. ఆయా కోర్సుల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని.. నిర్ణీత గడువులోగా విశ్వవిద్యాలయానికి చేరేలా పంపించాలని సూచించారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఐఎన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

ఇన్ని ఎంఈవో పోస్టులు ఇవ్వడం చరిత్ర

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతరెడ్డి

సాక్షి, అమరావతి: ప్రభుత్వం ఒకేసారి కొత్తగా 692 గెజిటెడ్ ర్యాంకు ఎంఈవో పోస్టులను ఇవ్వడం విద్యా శాఖలోనే ఒక చరిత్ర అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతరెడ్డి చెప్పారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన ఈ పోస్టుల వల్ల పంచాయతీరాజ్, ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇద్దరికీ న్యాయం జరుగుతుందన్నారు. పంచాయతీరాజ్, ప్రభుత్వ ఎంఈవోలు ఎక్కడ ఉన్నవారిని అక్కడే ఉంచుతారని తెలిపారు. కొత్త పోస్టుల్లో 679 పంచాయతీరాజ్ టీచర్లకే దక్కుతాయన్నారు. కానీ, కొద్ది మంది దీన్ని వక్రీకరించి పంచాయతీరాజ్ ఉపాధ్యాయులను భయాందోళనకు గురిచేస్తున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ఇన్ని పోస్టులు మంజూరు చేసిన సమయంలో ఉపాధ్యాయులు ఆనందంగా ఉండాలన్నారు. అయితే కొన్ని స్వార్థశక్తుల ప్రచారంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల్లో ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా, స్కూల్ అసిస్టెంట్లుకు హెచ్ఎంలుగా, ఎంఈవోలుగా త్వరలో పదోన్నతులు రావడం ఖాయమని చెప్పారు.

డిశ్చార్జ్ పిటిషన్లపై విచారణ ముగించండి

- గాలి జనార్దన్‌రెడ్డి కేసులో ట్రయల్ కోర్టుకు సుప్రీంకోర్టు సూచన

సాక్షి, న్యూఢిల్లీ: కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డిపై అక్రమ మైనింగ్ కేసులకు సంబంధించి ట్రయల్ కోర్టులో ఉన్న డిశ్చార్జ్ పిటిషన్లపై విచారణ వేగంగా పూర్తి చేయాలని సీబీఐ కోర్టుకు సుప్రీంకోర్టు సూచించింది. ఈ నెల 29లోగా ఆయా పిటిషన్లపై విచారణ పూర్తిచేయడంతో పాటు వీలైతే తీర్పు కూడా ఇవ్వాలని పేర్కొంది. బెయిలు షరతులు సడలించాలంటూ గాలి జనార్దన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ కృష్ణమురారిలతో కూడిన ధర్మాసనం విచారించింది. డిశ్చార్జ్ పిటిషన్ల వల్లే ట్రయల్ ఆలస్యం అవుతోందని ధర్మాసనానికి సీబీఐ వివరించింది. 'పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ అభ్యర్థన మేరకు విచారణ 29కి వాయిదా వేస్తున్నాం. ఈ మధ్యలో నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లపై ట్రయల్ కోర్టు విచారణ పూర్తి చేయాలి. వీలైతే తీర్పు కూడా ఇవ్వాలి. విచారణ సందర్భంగా ఎలాంటి వాయిదాలూ ఇవ్వరాదు. ఈ ఆదేశాలను సీబీఐ ప్రత్యేక కోర్టుకు కమ్యునికేట్ చేయాలని రిజిస్ట్రీని ఆదేశిస్తున్నాం' అని ధర్మాసనం పేర్కొంది.

ఏపీలో రూ.5లక్షల కోట్లతో రహదారుల అభివృద్ధి

2024కు పూర్తయ్యేలా ప్రణాళికలు.. మొత్తం 27 గ్రీన్ ఎక్స్‌ప్రెస్ హైవేల నిర్మాణం



రహదారులు, ఫ్లై ఓవర్లకు శంకుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

సాక్షి, రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్‌లో రూ.5 లక్షల కోట్లతో జాతీయ రహదారులు అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. 2024 నాటికి ఈ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పారు. రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో రూ.3,000 కోట్లతో 129 కిలోమీటర్ల 3 రహదారులు, 5 ఫ్లై ఓవర్ల పనులకు గురువారం వర్చువల్ విధానంలో ఆయన శంకుస్థాపన చేశారు. దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. ఏపీ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. రాష్ట్రంలో రహదారులకు ఇప్పటికే రూ.2 లక్షల కోట్లు మంజూరు చేశామని, లక్ష కోట్ల రూపాయల పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. నౌకాయానంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమైన రాష్ట్రమన్నారు. సుదీర్ఘమైన తీర ప్రాంతం, సముద్ర ఉత్పత్తులు రాష్ట్ర అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్నాయన్నారు.

రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గోదావరి జిల్లాల ఎంపీల అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకున్నట్లు చెప్పారు. మొత్తం 27 గ్రీన్ ఎక్స్‌ప్రెస్ హైవేల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. వీటిలో భాగంగా విశాఖపట్నం పోర్టు నుంచి రుషికొండ, భీమిలి మీదుగా భోగాపురం వరకు ఆరు వరుసల రోడ్డు నిర్మించనున్నట్లు చెప్పారు. రూ.215 కోట్లతో మోరంపూడి, జొన్నాడ, కైకారం, ఉండ్రాజవరం, తేతలి ఫ్లైఓవర్లకు అనుమతిచ్చామన్నారు. గుంటూరు – బాపట్ల, బెంగళూరు – విజయవాడ, వినుకొండ – గుంటూరు, వేమగిరి – సామర్లకోట కెనాల్ రోడ్డు, రాజమండ్రి – కాకినాడ, హైదరాబాద్ నుంచి నాగార్జున సాగర్, మాచర్ల, అమరావతి మీదుగా విజయవాడ ఇబ్రహీంపట్నం వరకు రోడ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. బెంగళూరు – విజయవాడ, బెంగళూరు – చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే, రాయ్‌పూర్ – విశాఖపట్నం, ఛత్తీస్‌గఢ్ – ఆంధ్రప్రదేశ్ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. భువనేశ్వర్ నుంచి భోగాపురం వరకు 6 వరుసల హైవే నిర్మించనున్నట్లు చెప్పారు. విజయవాడ తూర్పు బైపాస్ రోడ్డు మంజూరు చేస్తామన్నారు. వీటి ద్వారా పారిశ్రామిక ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. హైదరాబాద్, విశాఖ నుంచి కాకినాడ సెజ్ పోర్ట్, ఫిషింగ్ హార్బర్, కాకినాడ యాంకరేజ్ పోర్టులకు గ్రీన్ ఫీల్డ్ రోడ్ కనెక్టివిటీ వస్తుందని చెప్పారు. దీనివల్ల బియ్యం, సీఫుడ్, ఆయిల్, ఐరన్ ఎగుమతులు ఎక్కువ జరుగుతాయన్నారు. కాకినాడ పోర్టు ద్వారా ఖనిజం, జీవ ఇంధనం, గ్రానైట్ రవాణా సులభమవుతుందని అన్నారు.

భవిష్యత్తు గ్రీన్ ఎనర్జీదే

భవిష్యత్తు అంతా గ్రీన్ ఎనర్జీదే అని గడ్కరీ చెప్పారు. ఏపీ ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థలో విద్యుత్, బయోఇథనాల్ వాహనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. వీటిని స్వయంగా తయారు చేసుకునే వనరులు రాష్ట్రంలో అపారంగా ఉన్నాయన్నారు. గోదావరి నీళ్ల ద్వారా గ్రీన్ హైడ్రోజన్ తయారు చేయడం పెద్ద కష్టం కాదన్నారు. జాతీయ రహదారుల వెంట కడియం నర్సరీల నుంచి 80 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. శంకుస్థాపన అనంతరం గడ్కరీ కడియంలో నర్సరీలను పరిశీలించారు. మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రామలింగేశ్వరరావు (రాజా), ఎంపీలు పిల్లి సుభాష్ చంద్రబోస్, మార్గాని భరత్ రామ్, వంగా గీత, అనూరాధ, మాధవి, ఎమ్మెల్యేలు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

2047 నాటికి నేవీకి పూర్తి స్వదేశీ పరిజ్ఞానం

- భారత నావికాదళాధిపతి అడ్మిరల్ హరికుమార్
- నిర్మాణంలో 43 యుద్ధనౌకలు, జలాంతర్గాములున్నట్టు వెల్లడి
- నౌకానిర్మాణ ప్రాజెక్టుల ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు
- రూ.2,230 కోట్లతో రెండు డీఎస్‌వీలను నిర్మించిన విశాఖ హెచ్ఎస్ఎల్
- వాటికి నిస్తార్, నిపుణ్‌గా నామకరణం
- హర్షధ్వానాల మధ్య జల ప్రవేశం



నిస్తార్ వెసల్ వద్ద హరికుమార్, అధికారులు

సాక్షి, విశాఖపట్నం: భారత నావికాదళం 2047 నాటికల్లా పూర్తి స్థాయి స్వదేశీ పరిజ్ఞానాన్ని సముపార్జించుకుంటుందని నౌకాదళాధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ చెప్పారు. ఆ తర్వాత ఆత్మనిర్భర్‌తో నూరు శాతం స్వదేశీ పరిజ్ఞానం ద్వారా యుద్ధనౌకలు, జలాంతర్గాముల నిర్మాణం చేపట్టవచ్చని తెలిపారు. విశాఖలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(హెచ్ఎస్ఎల్) స్వదేశీ పరిజ్ఞానంతో రూ.2,230 కోట్లు వెచ్చించి నిర్మించిన రెండు డైవింగ్ సపోర్టు వెసల్స్(డీఎస్‌వీల) జల ప్రవేశం కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని ప్రసంగించారు. భారత సముద్ర జలాల్లో దేశ రక్షణకు పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. దేశ వ్యాప్తంగా కొత్తగా 45 యుద్ధ నౌకలు, జలాంతర్గాములను నిర్మించాల్సి ఉండగా.. ప్రస్తుతం దేశంలోని వివిధ షిప్‌యార్డుల్లో 43 నిర్మాణంలో ఉన్నాయన్నారు. నౌకా నిర్మాణ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి, ఉద్యోగావకాశాలు పెరిగినట్టు తెలిపారు. 80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో అత్యాధునిక సాంకేతికత కలిగిన ఈ డీఎస్‌వీలను తొలిసారిగా నేవీ కోసం విశాఖ హిందుస్తాన్ షిప్‌యార్డు నిర్మించిందని, వీటికి అవసరమైన పరికరాలను దేశంలోని 120 ఎంఎస్ఎంఈలు సమకూర్చినట్టు చెప్పారు. జలాంతర్గాముల్లో సమస్యలు తలెత్తినప్పుడు సరిచేసేందుకు, రెస్క్యూ ఆపరేషన్ ద్వారా సిబ్బందిని రక్షించేందుకు కొత్త డీఎస్‌వీ వెసల్స్ ఉపయోగపడతాయని తెలిపారు. ఇవి అందుబాటులోకొచ్చాక డీప్ సీ డైవింగ్ ఆపరేషన్లలో కొత్త శకం ఆరంభమవుతుందన్నారు. హెచ్ఎస్ఎల్ సీఎండీ హేమంత్ ఖాత్రి మాట్లాడుతూ తమ నౌకా నిర్మాణం కేంద్రం ఏర్పాటయ్యాక ఇప్పటి వరకు 200 నౌకలను నిర్మించిందని, 2000 నౌకలకు మరమ్మతులు చేసిందని వెల్లడించారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.755 కోట్ల టర్నోవర్ సాధించి, రూ.51 కోట్ల లాభాలనార్జించిందని వివరించారు.

నిస్తార్, నిపుణ్‌లుగా నామకరణం

కొత్తగా నిర్మించిన డీఎస్‌వీలకు నిస్తార్, నిపుణ్‌లుగా భారత నావికా దళాధిపతి సతీమణి కళాహరికుమార్ నామకరణం చేశారు. తొలుత ఆమె రెండు వెసల్స్‌కు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం నేవీ చీఫ్ హరికుమార్‌తో కలిసి ఆమె రిమోట్ కంట్రోల్ ద్వారా నిస్తార్, నిపుణ్‌లపై జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఆ వెంటనే వాటిని హర్షధ్వానాల మధ్య జలప్రవేశం చేయించారు. కార్యక్రమంలో తూర్పు నావికాదళ ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ బి.దాస్‌గుప్తా, నేవీ, షిప్‌యార్డు ఉన్నతాధికారులు, హెచ్ఎస్ఎల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగులో ఏపీ భేష్

- మీతో కలిసి పనిచేయడానికి సిద్ధం.. మా దేశాల్లో కూడా అమలుచేస్తాం
- 15 దేశాల ప్రతినిధుల కితాబు
- అనంతపురంలో గ్రౌండ్స్‌వెల్ ఇంటర్నేషనల్ గ్లోబల్ కాన్ఫరెన్స్
- రాష్ట్రవ్యాప్తంగా ప్రకృతి సాగును విస్తరిస్తాం : మంత్రి వెల్లడి



సమావేశానికి హాజరైన 15 దేశాల ప్రతినిధులు

సాక్షి, అమరావతి/అనంతపురం అగ్రికల్చర్: ప్రకృతి సాగును ప్రోత్సహించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న కృషి అద్భుతమని గ్రౌండ్స్ వెల్ ఇంటర్నేషనల్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్టీవ్ బ్రెసియా ప్రశంసించారు. సంస్థ ఆధ్వర్యంలో వారం రోజుల పర్యటన కోసం రాష్ట్రానికి వచ్చిన లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియా దేశాలకు చెందిన 30 మంది ప్రతినిధుల బృందం గురువారం అనంతపురంలో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ టి.విజయకుమార్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పరిశీలనలో తమ అనుభవాలను విదేశీ ప్రతినిధులు పంచుకున్నారు. స్టీవ్ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ విధానం అమలుచేయడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని కొనియాడారు. ప్రత్యేకంగా రైతు సాధికార సంస్థ ఏర్పాటుచేసి వ్యవసాయ భూమిని సారవంతం చేయడంతో పాటు తక్కువ ఖర్చుతో లాభసాటి వ్యవసాయం చేయిస్తున్న తీరు అమోఘమన్నారు. రైతుల సంక్షేమం, భూ పరిరక్షణకు చేపడుతున్న చర్యలతో ప్రపంచానికే ఏపీ ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇందుకు ప్రోత్సహిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు పలు దేశాలు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు.

అందరూ నేర్చుకోవాలి : నేపాల్

నేపాల్ ప్రతినిధి నవరాయ్ ఉపాధ్యాయ మాట్లాడుతూ.. ఇక్కడ రైతులు ఆచరిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను ప్రపంచం నలుమూలల నుంచి వచ్చి చూసి నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలు ఆదర్శనీయమన్నారు. నేపాల్‌లో పెద్దఎత్తున ఈ కార్యక్రమాన్ని అమలుచేస్తామన్నారు. ఇక 'మేం విన్నది ఇక్కడ ప్రత్యక్షంగా చూశాం. పంట వైవిధ్యత, నీటి పొదుపు చర్యలు ఎంతో మెరుగ్గా వున్నాయి. బీజామృతంతో విత్తనశుద్ధి చేసి గుళికలు తయారు చేయడం ప్రపంచంలో మరెక్కడా చూడలేదు. ఆంధ్రప్రదేశ్‌లో ఒక క్రమపద్ధతిలో చేస్తున్న ప్రకృతి సాగు ద్వారా భూమి సారవంతం కావడంతో పాటు వాతావరణంలో స్పష్టమైన మార్పులు వస్తున్నట్లుగా గమనించాం. ప్రకృతి సాగులో మహిళల పాత్ర ఎంతో ఉంది'.. అని ఘనా దేశ ప్రతినిధి డాన్ బనాకూ అన్నారు.

ప్రభుత్వ కృషి బాగుంది

హోండురాస్ దేశ ప్రతినిధి ఎడ్విన్ ఎసకొటో మాట్లాడుతూ.. ఇక్కడ పర్యటించడం ఎంతో సంతోషంగా ఉందని, ఇక్కడ ఎన్నో విషయాలు నేర్చుకుని వెళ్తున్నామన్నారు. మా దేశంలో ఈ విధానాన్ని సులువుగా అమలుచెయ్యగలుగుతామన్న నమ్మకం కలిగిందన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు రైతులకు అదనపు ధర చెల్లించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి బాగుందన్నారు. అలాగే, ఇక్కడ ఆచరిస్తున్న విధానాలను తమకు అనుకూలంగా మలుచుకుని ఆచరిస్తామని... ప్రకృతి సాగులో మహిళల భాగస్వామ్యం మాలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిందని బుర్కినా ఫాసో దేశ ప్రతినిధి ఫాటూ భట్ట అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రకృతి సేద్యం: మంత్రి కాకాణి

ఇక ప్రకృతి వ్యవసాయానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇచ్చి రైతాంగాన్ని ప్రోత్సహిస్తున్నారని.. ప్రస్తుతం నాలుగువేల ఆర్బీకేల పరిధిలో అమలవుతున్న ప్రకృతి సాగును భవిష్యత్‌లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు కృషిచేస్తున్నట్లు మంత్రి కాకాణి వెల్లడించారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రైతుసాధికార సంస్థతో కలిసి పనిచేసేందుకు మెక్సికో ప్రభుత్వం సిద్ధంగా ఉందని, నేపాల్ ప్రభుత్వం నుంచి కూడా తనకు ఆహ్వానం అందిందని చెప్పారు.

బీటెక్ సీటు హాట్ కేకు

▶ మొదటి పేజీ తరువాయి

కన్వీనర్ కోటాలో సీట్లు పొందిన విద్యార్థులందరికీ ప్రభుత్వమే జగనన్న విద్యా దీవెన కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తుంది. దీంతో పాటు జగనన్న వసతి దీవెన కింద ఏడాదికి రూ.20 వేలు చెల్లిస్తుంది. ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రమాణాలు మెరుగుపరుస్తోంది. ఏడాది ఇంటర్న్‌షిప్ విధానాన్ని ప్రవేశపెట్టింది. నైపుణ్య శిక్షణ ఇప్పిస్తోంది. ప్రముఖ పరిశ్రమలతో కాలేజీలను అనుసంధానిస్తోంది. ఈ చర్యలన్నిటి ఫలితంగా రాష్ట్రంలోని ఇంజనీరింగ్ సీట్లు హాట్ కేకులే అయ్యాయి. రాష్ట్రంలోని 248 ఇంజనీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 1,11,864 సీట్లు ఉన్నాయి. వీటిలో తొలి విడతలోనే 91,249 సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 20,615 సీట్లు మిగిలి ఉన్నట్లు అడ్మిషన్ల కన్వీనర్, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ సి.నాగరాణి చెప్పారు. ఏపీ ఈఏపీ సెట్‌లో 1,73,572 మంది అర్హత సాధించగా ధ్రువపత్రాల పరిశీలన అనంతరం 1,01,318 మంది వెబ్ ఆప్షన్లకు అర్హత సాధించారు. వీరిలో 99,025 మంది ఆప్షన్లను నమోదుచేశారు. తొలివిడతలో ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్సిటీ కాలేజీలు, ప్రైవేటు కాలేజీల్లోని సీట్లను కేటాయించారు. స్పోర్ట్సులో 492, ఎన్‌సీసీలో 984 సీట్ల కేటాయింపును పెండింగ్‌లో పెట్టారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) నుంచి మెరిట్ జాబితా అందిన అనంతరం ఆ సీట్లు కేటాయిస్తారు.

బాబు హయాంలో సీట్ల భర్తీ అంతంతే

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కన్వీనర్ కోటా ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి స్పందన పెద్దగా ఉండేది కాదు. విద్యార్థుల్లో చాలా మంది హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లోని ప్రైవేటు కాలేజీల్లో చేరేందుకే మొగ్గు చూపేవారు. జేఈఈ మెరిట్ విద్యార్థులు ఏపీ ఎంసెట్‌లో టాప్ ర్యాంకులో నిలిచి మంచి కాలేజీలో సీటు వచ్చినా, దానిని వదులుకొని వేరే రాష్ట్రాలకు వలస వెళ్లేవారు. అప్పట్లో ప్రభుత్వం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంటు కాకుండా ఫీజు రూ.లక్షల్లో ఉన్నా రూ.35 వేలు మాత్రమే చెల్లించేది. చివరి దశ కేటాయింపులు పూర్తయ్యాక కాలేజీల్లో 40శాతం సీట్లు ఖాళీగా ఉండేవి. 2016లో 58 శాతం, 2017లో 60 శాతం, 2018లో 61శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఇప్పుడు ప్రభుత్వ చర్యల వల్ల రాష్ట్రంలోని కాలేజీల్లో చదివేందుకు విద్యార్థులు ఇష్టపడుతున్నారు.

వివిధ కాలేజీల్లో ఇంజనీరింగ్ సీట్ల భర్తీ ఇలా

కేటగిరీ	కన్వీనర్ కోటా సీట్లు	భర్తీ అయిన సీట్లు	మిగిలిన సీట్లు
యూనివర్సిటీ	6,529	5,608	921
ప్రైవేటు కాలేజీలు	1,01,588	82,052	19,536
ప్రైవేటు వర్సిటీలు	3,747	3,589	158

నేడు బీ కేటగిరీ నోటిఫికేషన్

ఇంజనీరింగ్ కాలేజీల్లోని యాజమాన్య కోటా అయిన బీ కేటగిరీ సీట్ల భర్తీకి శుక్రవారం నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ సీట్ల భర్తీని కాలేజీలో ప్రత్యేక పోర్టల్ ద్వారా ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేపడతాయి. విద్యార్థులు కాలేజీలకు నేరుగా దరఖాస్తు చేయడానికి లేదా ఈ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులకు అవకాశం కల్పించనున్నారు.

ఫార్మసీ సీట్ల భర్తీకి బ్రేకు

ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లోనే ఫార్మసీ సీట్లు కూడా భర్తీ చేయాల్సి ఉన్నా వాటికి బ్రేకు పడింది. ఫార్మసీ కాలేజీల సీట్లకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి అనుమతులు రాకపోవడంతో వీటి భర్తీని నిలిపివేశారు. అనుమతుల మంజూరు ప్రక్రియ వచ్చే నెలలో పూర్తవుతుందని ఫార్మసీ కౌన్సిల్ ఉన్నత విద్యాశాఖకు తెలిపింది. ఈ ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని ఉన్నత విద్యా మండలి ఫార్మసీ కౌన్సిల్‌కు మరోసారి లేఖ రాసింది.

భారీగా కంప్యూటర్ సైన్సు సీట్లు

ఇంజనీరింగ్ సీట్లలో కంప్యూటర్ సైన్సు, తత్సంబంధిత సీట్లు అత్యధికంగా భర్తీ అయ్యాయి. ఇంజనీరింగ్ కాలేజీలు కూడా కంప్యూటర్ సైన్సు కోర్సుల్లోనే అత్యధిక శాతం సీట్లకు అనుమతులు తెచ్చుకున్నాయి. గతంలోకన్నా ఈసారి ఎక్కువ సీట్లు ఈ విభాగంలోనే ఉన్నాయి. సీఎస్ఈ, తత్సంబంధిత సీట్లు 41,991 భర్తీ కాగా అందులో సీఎస్ఈ సీట్లు 27,261 ఉన్నాయి. ఆ తరువాత ఈసీఈ, ఈఈఈలో ఎక్కువ సీట్లు భర్తీ అయ్యాయి. తొలివిడతలోనే ఈ సీట్లు దాదాపు పూర్తిగా భర్తీ అయ్యాయి.

కొన్ని ముఖ్య కేటగిరీల్లో సీట్ల కేటాయింపు ఇలా

కోర్సు	భర్తీ అయిన సీట్లు
సీఎస్ఈ, తత్సంబంధిత	41,991
ఈసీఈ	20,211
ఈఈఈ	6,086
మెకానికల్	3,728
సివిల్	3,385

భర్తకు రెండో పెళ్లి చేసిన భార్య

వెంకటగిరి: తన భర్త మరో మహిళతో చనువుగా ఉంటేనే ఏ భార్యా సహించదు. కానీ, తిరుపతి జిల్లా డక్కిలి మండలం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఓ మహిళ దగ్గరుండి తన భర్తకు అతని ప్రియురాలితో రెండో పెళ్లి చేసింది. అంబేడ్కర్‌నగర్‌కు చెందిన జె.కళ్యాణ్‌కుమార్ టిక్‌టాక్ చేస్తూ రాణిస్తున్న సమయంలో విశాఖపట్నానికి చెందిన నిత్యశ్రీతో పరిచయం ఏర్పడి అది ప్రేమకు దారితీసింది. ఆ తర్వాత వారిద్దరూ దూరమయ్యారు. మళ్లీ టిక్ టాక్‌లోనే కళ్యాణ్‌కుమార్‌కు పరిచయమైన కడపకు చెందిన విమలను మూడు నెలల కిందట పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న నిత్యశ్రీ పది రోజుల క్రితం అంబేడ్కర్‌నగర్ వచ్చింది. కళ్యాణ్ కుమార్ కడపలో ఉన్నట్లు తెలుసుకుని అక్కడికి వెళ్లి ఆయన భార్య విమలను తన ప్రేమ గురించి తెలిపింది. చివరకు ముగ్గురు కలిసి ఉండాలని నిర్ణయించుకున్నారు. విమల దగ్గరుండి బుధవారం రాత్రి నిత్యశ్రీకి భర్త కళ్యాణ్‌కుమార్‌తో డక్కిలిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పెళ్లి చేసింది.



విమల, కళ్యాణ్‌కుమార్, నిత్యశ్రీ

ఐదేళ్లకు ఓసారి వైఎస్సార్‌సీపీ అధ్యక్ష ఎన్నిక

- ప్లీనరీలో జీవితకాల అధ్యక్ష తీర్మానాన్ని తిరస్కరించిన సీఎం వైఎస్ జగన్
- అందుకే ఆ నిర్ణయం ప్లీనరీ మినిట్స్‌లోకి ఎక్కలేదు
- ఇదే అంశాన్ని ఎన్నికల సంఘానికి స్పష్టం చేస్తాం
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడి




సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్లీనరీలో జీవితకాల అధ్యక్ష తీర్మానాన్ని పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరస్కరించారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి గుర్తుచేశారు. అందువల్లే ఆ నిర్ణయం ప్లీనరీ మినిట్స్‌లోకి ఎక్కలేదని, దీంతో వైఎస్సార్‌సీపీలో శాశ్వత అధ్యక్షుడు అన్న అంశమే లేదని చెప్పారు. ఇదే విషయాన్ని ఎన్నికల సంఘానికి స్పష్టం చేస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్ష పదవికి ఐదేళ్లకు ఒకసారి ఎన్నిక ఉంటుందన్నారు. ఈ ఏడాది జూలై 8, 9న జరిగిన ప్లీనరీలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా సీఎం వైఎస్ జగన్ ఎన్నికయ్యారని, మళ్లీ ఐదేళ్ల తర్వాత ఎన్నిక నిర్వహిస్తామని చెప్పారు. గురువారం ఆయన తాడేపల్లిలో మీడియాతో మాట్లాడారు. ఎన్టీఆర్‌కు అవమానం చేసిన వారెవరైనా ఉన్నారంటే అది ఒక్క చంద్రబాబేనని స్పష్టం చేశారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుతోపాటు బయటకు వచ్చిన వారే ఆయన్ను అవమానించారని చెప్పారు. టీడీపీని కబ్జా చేసిన చంద్రబాబు.. ఎన్టీఆర్‌ను చరిత్రలో నుంచి తీసేయాలని చూశారని గుర్తుచేశారు. హెల్త్ వర్సిటీకి వైఎస్సార్ పేరు పెట్టడం ఎన్టీఆర్‌ను అవమానించడం కాదని పునరుద్ఘాటించారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..

ఎన్టీఆర్‌పై అభిమానంతోనే విజయవాడ జిల్లాకు ఆయన పేరు

- ➤ వైద్య రంగానికి మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విశేష కృషి చేశారు. అందుకే హెల్త్ యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టాం. ఎన్టీఆర్‌ను ఉద్దేశించి వాడు.. వీడు.. అంటూ ఏబీఎన్ రాధాకృష్ణతో చంద్రబాబు ఎలా మాట్లాడారో ప్రజలందరూ చూశారు. ఎన్నికలప్పుడే ఓట్ల కోసం మాత్రమే చంద్రబాబుకు ఎన్టీఆర్ గుర్తుకొస్తారు.
- ➤ టీడీపీ సర్కార్ హయాంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పేరును చంద్రబాబు ఎందుకు మార్చారు? ఇవాళ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్చడంపై విమర్శిస్తున్న వారు అప్పట్లో ఎందుకు మాట్లాడలేదు? టీడీపీ సర్కార్ హయాంలో వైఎస్సార్ విగ్రహాలను ఎందుకు తొలగించారు?
- ➤ ఎవరిని ఎలా గౌరవించాలో వైఎస్సార్‌సీపీకి ఒక స్పష్టత ఉంది. ఎన్టీఆర్ పట్ల సీఎం వైఎస్ జగన్‌కు అత్యంత అభిమానం, గౌరవం ఉన్నాయి. ఎవరూ అడగకుండానే విజయవాడ జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టడమే అందుకు నిదర్శనం. ఎన్టీఆర్, వైఎస్సార్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే నాయకులు. సీఎం వైఎస్ జగన్‌పై ప్రజలకు సంపూర్ణ నమ్మకం ఉంది. హెల్త్ యూనివర్సిటీకి వైఎస్సార్ పేరును వారు స్వాగతిస్తున్నారు.

పరిశోధనలపై దృష్టి పెట్టండి

- విజ్ఞాన్ వర్సిటీ స్నాతకోత్సవంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ
- నలుగురికి డాక్టరేట్‌లు ప్రదానం
- 49 మంది విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం



సాక్షి ప్రతినిధి, గుంటూరు: విద్యార్థులందరూ పరిశోధనలు, ఆవిష్కరణలపై దృష్టి సారించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. గుంటూరు జిల్లా వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ పదో స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ చైర్మన్, ఎండీ డాక్టర్ కృష్ణ ఎం.ఎల్ల, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు శ్రీకాంత్ నమ్మల్వార్ కిడాంబి, ఆస్ట్రా మైక్రోవేవ్ ప్రొడక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎంవీ రెడ్డి, మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణిలకు విజ్ఞాన్ యూనివర్సిటీ డాక్టరేట్‌లు ప్రదానం చేసింది. 49 మందివిద్యార్థులకు బంగారు పతకాలు, 1,842 మందికి డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గడ్కరీ మాట్లాడుతూ వచ్చే దశాబ్ద కాలాన్ని ''టెకేడ్''గా పిలుస్తారని, విద్యార్థులు అందులో అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. సైన్స్, టెక్నాలజీ, రీసెర్చ్, ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్కిల్ డెవలప్‌మెంట్‌లో దేశం మరింత ముందుకు వెళ్లాలన్నారు. సమీప భవిష్యత్తులో దేశ ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని పేర్కొన్నారు. దేశంలో విదేశీ పెట్టుబడులు పెద్ద ఎత్తున పెరుగుతున్నాయన్నారు. దేశ ఎగుమతులను పెంచి దిగుమతులను తగ్గించాలని చెప్పారు. వ్యవసాయం నుంచి ఆదాయం పెరిగేలా పరిశోధనలు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్‌ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

263 అద్దె బస్సులకు ఆర్టీసీ టెండర్లు

నేటి నుంచి అక్టోబర్ 12 వరకు టెండర్ల దాఖలుకు గడువు



సాక్షి, అమరావతి: ప్రజారవాణా విభాగం (ఆర్టీసీ) మరో 263 అద్దె బస్సుల కోసం టెండర్లు పిలిచింది. ఆసక్తి ఉన్నవారు ఎంఎస్‌టీసీ 'ఈ' కామర్స్ పోర్టల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని టెండర్లు దాఖలు చేయవచ్చు. ఈ నెల 23న ఉదయం 10 గంటల నుంచి అక్టోబర్ 12వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు టెండర్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. అక్టోబర్ 19న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రివర్స్ టెండరింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని ఆర్టీసీ ఈడీ కె.ఎస్.బ్రహ్మానందరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

కేటగిరీల వారీగా టెండర్లు పిలిచిన అద్దె బస్సులు
ఏసీ స్లీపర్ 4, నాన్ ఏసీ స్లీపర్ 6, సూపర్ లగ్జరీ 12, అల్ట్రా డీలక్స్ 15, ఎక్స్‌ప్రెస్ 30, అల్ట్రా పల్లె వెలుగు 95, పల్లె వెలుగు 72, మెట్రో ఎక్స్‌ప్రెస్ 27, సిటీ ఆర్డినరీ 2.

జిల్లాల వారీగా టెండర్లు పిలిచిన అద్దె బస్సులు
శ్రీకాకుళం జిల్లా 23, పార్వతీపురం మన్యం 29, విజయనగరం 12, విశాఖపట్నం 42, అనకాపల్లి 16, కాకినాడ 35, తూర్పుగోదావరి 2, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ 24, పశ్చిమ గోదావరి 29, కృష్ణా 4, ఎన్టీఆర్ 3, గుంటూరు 2, పల్నాడు 2, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు 5, తిరుపతి 8, అన్నమయ్య 5, నంద్యాల 3, అనంతపురం 8, శ్రీసత్యసాయి జిల్లా 11.

బస్సు రూట్లు, టెండరు నిబంధనల కోసం సంప్రదించాల్సిన ఆర్టీసీ వెబ్‌సైట్: https:// apsrtc.ap.gov.in

ఎన్ఎస్ఐసీతో ఏపీ మెడ్‌టెక్ జోన్ ఒప్పందం

సాక్షి, న్యూఢిల్లీ/ దొండపర్తి(విశాఖ దక్షిణ) : ఆరోగ్య సంరక్షణ రంగంలో సహకారం నిమిత్తం కేంద్రం ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖకు చెందిన జాతీయ చిన్న పరిశ్రమల కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్ఎస్ఐసీ), ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ లిమిటెడ్(ఏఎంటీజెడ్)ల మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. గురువారం కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి నారాయణ రాణే సమక్షంలో జరిగిన ఈ అవగాహన ఒప్పందంపై ఎన్ఎస్ఐసీ సీఎండీ గౌరంగ్ దీక్షిత్, ఏపీ మెడ్‌టెక్ జోన్ ఎండీ, సీఈవో జితేంద్రశర్మలు సంతకాలు చేశారు. అనంతరం కేంద్రమంత్రి నారాయణ రాణే మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ రంగంలో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు ఈ అవగాహన ఒప్పందం తోడ్పడుతుందని చెప్పారు.

అదనపు చార్జీల్లేకుండానే దసరా స్పెషల్ బస్సులు

దశాబ్దం తరువాత ఇదే తొలిసారి

సాక్షి, అమరావతి: ప్రయాణికులపై అదనపు చార్జీల భారం లేకుండానే దసరా ప్రత్యేక బస్సు సర్వీసులు నిర్వహించాలని నిర్ణయించినట్టు ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకాతిరుమలరావు చెప్పారు. దశాబ్దకాలం తరువాత ఇలా అదనపు చార్జీలు లేకుండా ఆర్టీసీ దసరా ప్రత్యేక బస్సు సర్వీసులు నిర్వహించడం ఇదే తొలిసారని తెలిపారు. విజయవాడలోని బస్‌భవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది దసరా రద్దీ దృష్ట్యా 4,500 ప్రత్యేక బస్సు సర్వీసులు నిర్వహిస్తామని చెప్పారు. దసరా ఉత్సవాల ముందు ఈ నెల 29 నుంచి అక్టోబరు 4 వరకు 2,100 బస్సులు, దసరా తరువాత అక్టోబరు 5 నుంచి 9 వరకు 2,400 బస్సులు నడుపుతామని తెలిపారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరులతోపాటు రాష్ట్రంలోని 21 నగరాలు, ముఖ్య పట్టణాలకు ప్రత్యేక బస్సులు నడుపుతామని చెప్పారు. అన్ని



సర్వీసుల్లోను యూటీఎస్ విధానాన్ని అమలు చేస్తూ క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, యూపీఐ పేమెంట్లు, క్యూఆర్ కోడ్ ద్వారా కూడా టికెట్లు తీసుకోవచ్చని వివరించారు. అన్ని బస్సులను జీపీఎస్ ట్రాకింగ్ విధానంతో అనుసంధానించి కంట్రోల్ రూమ్ నుంచి 24/7 పర్యవేక్షిస్తామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా నడిపే ప్రైవేటు బస్సులను నిరోధించేందుకు పోలీసు, రవాణా శాఖలతో కలసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఈ-బస్ సర్వీసులు

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఆర్టీసీ ఈ-బస్ సర్వీసులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో 10 ఈ-బస్సులను నడుపుతామన్నారు. అనంతరం దశలవారీగా డిసెంబర్ నాటికి తిరుమల-తిరుపతి ఘాట్‌రోడ్డులో 100 ఈ-బస్ సర్వీసులను ప్రవేశపెడతామని చెప్పారు. తిరుమల ఘాట్‌రోడ్ తోపాటు రాష్ట్రంలో దూరప్రాంత సర్వీసుల కోసం కొత్తగా 650 బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. గత ఏడాది 1,285 బస్సులను ఫేస్‌లిఫ్ట్ విధానంలో నవీకరించామని ఈ ఏడాది రూ.25 కోట్లతో మరో 1,100 బస్సులను నవీకరిస్తున్నామని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగులకు అక్టోబర్ 1 నుంచి కొత్త పేస్కేల్ ప్రకారం జీతాలు చెల్లిస్తామన్నారు. ఇటీవల పదోన్నతులు పొందిన దాదాపు రెండువేల మందికి సాంకేతికపరమైన అంశాలను పూర్తిచేసి నవంబర్ 1 నుంచి కొత్త పేస్కేల్ ప్రకారం జీతాలు చెల్లిస్తామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో ఆర్టీసీ ఈడీ (కమర్షియల్) కె.ఎస్.బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్ట్రేలియాలో ఐఎన్ఎస్ సాత్పురా పరాక్రమం



సముద్రంలో ఫైరింగ్ చేస్తున్న ఐఎన్ఎస్ సాత్పురా

ఆస్ట్రేలియాలో జరిగిన మల్టీనేషన్ ఎక్స్ కాకడు సముద్ర విన్యాసాల్లో భారత నావికాదళం నుంచి పాల్గొన్న ఐఎన్ఎస్ సాత్పురా యుద్ధనౌక తన పరాక్రమాన్ని ప్రదర్శించింది. రాయల్ ఆస్ట్రేలియన్ నేవీతో కలిసి చేసిన విన్యాసాల్లో సాత్పురా.. యాంటీ సబ్‌మెరైన్, యాంటీ-షిప్ వార్‌ఫేర్ విన్యాసాలతో పాటు కచ్చితమైన లక్ష్యాన్ని నాశనం చేసే సామర్థ్యాన్ని తెలియజెప్పింది. భారత్, ఆస్ట్రేలియా దేశాల మధ్య స్నేహ బంధాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ఇరు దేశాల నావికాదళాల పరిజ్ఞాన మార్పిడికి ఈ విన్యాసాలు దోహదపడతాయని నౌకాదళ అధికారులు చెప్పారు. **-దొండపర్తి(విశాఖ దక్షిణ)**

శ్రీకోదండరామస్వామి ఆలయ భూముల రికార్డులు సమర్పించండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మండలం కొత్తూరు పరిధిలో ఉన్న శ్రీకోదండరామస్వామి ఆలయ భూముల రికార్డులను తమ ముందుంచాలని హైకోర్టు గురువారం ప్రభుత్వాన్ని ఆదేశించింది. రికార్డులను కోర్టు ముందుంచే విషయంలో చొరవ చూపాలని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్‌కు సూచించింది. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజుల ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. యూరియా ప్లాంట్ ఏర్పాటు కోసం శ్రీకోదండరామస్వామి ఆలయానికి చెందిన 1,009 ఎకరాలతోపాటు కొడవలూరు మండలంలోని నాలుగు గ్రామాలకు చెందిన 1,767 ఎకరాల వ్యవసాయ భూమిని ఇఫ్కోకు కేటాయించారని, ఈ భూ కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయని అప్పటి కొడవలూరు జెడ్పీటీసీ సభ్యుడు, మరికొందరు 2017లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై పలుమార్లు విచారణ జరిపిన సీజే ధర్మాసనం గురువారం మరోసారి విచారించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. భూ కేటాయింపుల్లో అక్రమాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. యూరియా, అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటు కోసం భూములు తీసుకున్నప్పటికీ ఇప్పటివరకు ఆ ప్రాజెక్టు విషయంలో ఎలాంటి పురోగతిలేదని తెలిపారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఆలయ భూముల రికార్డులను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఫేక్ పోస్టులపై సీఐడీ విచారణ

అధికారుల అదుపులో ఓ వ్యక్తి

సాక్షి, అమరావతి : ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో ఒక ఉన్నతాధికారిపై దుష్ప్రచారానికి పాల్పడుతున్న గుంటూరు జిల్లాకు చెందిన కొల్లు అంకబాబును గురువారం సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పన్ను ఎగవేతకు పాల్పడుతూ ఓ మహిళ విదేశాల నుంచి బంగారాన్ని అక్రమంగా తీసుకువస్తుండగా, కేంద్ర డీఆర్ఐ అధికారులు ఇటీవల గన్నవరం విమానాశ్రయంలో గుర్తించారు. దీనితో ఏమాత్రం సంబంధంలేని ఒక ఉన్నతాధికారికి ఈ ఉదంతాన్ని ఆపాదిస్తూ కొల్లు అంకబాబు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదు అందడంతో సీఐడీ సైబర్ క్రైమ్ విభాగం అధికారులు కేసు నమోదు చేశారు. ఆ పోస్టులు పెట్టిన అంకబాబును అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

● తెలంగాణ

జింఖానా మైదానం వద్ద తొక్కిసలాట..

ఏడుగురికి గాయాలు
- 25న భారత్-ఆస్ట్రేలియా టీ20 కోసం టికెట్లు విక్రయించిన హెచ్‌సీఏ

సాక్షి, హైదరాబాద్ : హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో ఆదివారం జరిగే భారత్-ఆస్ట్రేలియా టీ20 క్రికెట్ మ్యాచ్ టికెట్ల కోసం అభిమానుల్లో పెరిగిన ఆసక్తి తొక్కిసలాటకు దారితీసింది. బుధవారం వరకు ఆన్‌లైన్‌లోనే టికెట్ల అమ్మకాలు అంటూ చెప్పిన హెచ్‌సీఏ.. గురువారం మాత్రం కౌంటర్ ద్వారా టికెట్లు అమ్మకాలు జరుగుతాయని ప్రకటించింది. జింఖానా మైదానంలోని హెచ్‌సీఏ కార్యాలయానికి దాదాపు 100 మీటర్ల దూరంలో ఉన్న ప్రధాన గేట్ వద్ద కుడివైపు పురుషులు, ఎడమవైపు మహిళలకు లైన్లు కేటాయించారు. గేటు దాటి లోపలకు వచ్చిన తర్వాత మాత్రం ఒకే లైన్‌లో టిక్కెట్ కౌంటర్ వరకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో టికెట్ల కోసం బుధవారం రాత్రి నుంచే అభిమానులు గ్రౌండ్ వద్దకు చేరుకోవడం ప్రారంభించారు. గురువారం తెల్లవారుజామునకే వీరి సంఖ్య పది వేలు దాటింది. ఒక్కోటి దాదాపు కి.మీ. మేర క్యూలైన్లు ఏర్పడ్డాయి. ప్రధాన గేట్‌ను మూసి ఉంచిన పోలీసులు విడతల వారీగా కొందరు కొందరు చొప్పున లోపలి క్యూ లైన్‌లోకి పంపిస్తున్నారు. ఉదయం 11.30 గంటలకు వర్షం కురవడంతో ఒక్కసారిగా దాదాపు వెయ్యి మంది లోపలికి వెళ్లే యత్నంలో తొక్కిసలాట చోటు చేసుకుంది. అదే అదనుగా కొందరు పోకిరీలు.. మహిళలు, యువతులపై పడుతూ అసభ్యంగా ప్రవర్తించారు. ఈ నేపథ్యంలో పోలీసులు లాఠీచార్జికి దిగారు. దీంతో ఏడుగురికి



టికెట్ల కోసం వేలాదిగా వచ్చినవారిని అదుపు చేస్తున్న పోలీసులు

గాయాలయ్యాయి. మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు. దీంతో అక్కడికి పెద్ద ఎత్తున పోలీసులు చేరుకున్నారు. టిక్కెట్ల విక్రయానికి మరో కౌంటర్ ఏర్పాటు చేయించారు. సాయంత్రం టిక్కెట్ల విక్రయం పూర్తయ్యే వరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

యశోద ఆస్పత్రిలో చికిత్స
తొక్కిసలాటలో గాయపడిన జింఖానా మైదానంలో స్వీపర్‌గా పనిచేసే బోరబండకు చెందిన రంజిత, బేగంపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ శ్రీకాంత్, కవాడీగూడకు చెందిన విద్యార్థి ఆదిత్యనాథ్, తిరుమలగిరి ఇందిరానగర్‌కు చెందిన విద్యార్థిని సయ్యదా ఆలియా, కొంపల్లి బహదూర్‌పల్లికి చెందిన సాయి కిశోర్, సికింద్రాబాద్ కంట్రోల్ రూమ్‌కు చెందిన అగ్నిమాపక శాఖ కానిస్టేబుల్ శ్రీనాథ్ యాదవ్, కేపీహెచ్‌బీ (జేఎన్‌టీయూ)కి చెందిన సుజాతలను సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. వీరిలో సాయి కిశోర్, సుజాతలను ప్రాథమిక చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేశామని, చికిత్స పొందుతున్న వారు కోలుకుంటున్నారని ఆస్పత్రి వైద్యులు చెప్పారు. కాగా, ఈ ఘటనపై నగర పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో హెచ్‌సీఏ నిర్లక్ష్యం స్పష్టంగా ఉందని, వారిపై చర్యలు ఉంటాయని, నోటీసులు జారీ చేస్తామని అదనపు సీపీ (శాంతి భద్రతలు) డీఎస్ చౌహాన్ చెప్పారు.

కనీస ఏర్పాట్లు లేకపోవడం వల్లే..
ఉప్పల్ స్టేడియం సామర్థ్యం సుమారు 39,800లో అన్ని రకాల పాస్‌ల సంఖ్య 20 శాతానికి మించదు. మిగిలిన వాటిని ప్రేక్షకులకు అందుబాటులో ఉంచే విషయంలో హెచ్‌సీఏలో నెలకొన్న గందరగోళం తాజా పరిస్థితికి దారి తీసినట్లు తెలుస్తోంది. హెచ్‌సీఏలో ముఖ్యులు.. అధ్యక్షుడు అజారుద్దీన్‌కు సహకరించలేదని సమాచారం. మొత్తం మీద కనీస ఏర్పాట్లు, బందోబస్తు లేకపోవడం, వర్షం నేపథ్యంలో తొక్కిసలాట జరిగిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా, గురువారం చోటు చేసుకున్న ఘటనలో తమ తప్పేమీ లేదని హెచ్‌సీఏ అధ్యక్షుడు అజారుద్దీన్ చెప్పారు. క్రికెట్ మ్యాచ్ నిర్వహణ అంత సులువు కాదని పేర్కొన్నారు. పోలీసులకు ముందే సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఘటనపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని, భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి మ్యాచ్‌ల నిర్వహణ ఉంటుందని చెప్పారు. ఈ ఘటన దురదృష్టకరమని రాష్ట్ర ఆబ్కారీ, క్రీడా, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ ఘటన అనంతరం ఆయన అధికారులతో సమీక్షించారు. హెచ్‌సీఏ పాలక మండలి ఏకపక్షంగా వ్యవహరించకుండా ప్రభుత్వ సహకారాన్ని కోరిఉంటే ఇలాంటి ఘటనలు జరిగేవి కావని అన్నారు.

గుంటూరులో ఎన్ఐఏ కలకలం

- ఏకకాలంలో విస్తృత దాడులు
- రెండు బృందాలుగా వచ్చిన అధికారులు
- పీఎఫ్ఐ, ఎస్డీపీఐ కార్యాలయాల్లో సోదాలు
- పీఎఫ్ఐ కార్యాలయ తాళాలు పగులగొట్టి తనిఖీలు
- నలుగురిని అదుపులోకి తీసుకుని రహస్య ప్రాంతానికి తరలింపు

సాక్షి ప్రతినిధి, గుంటూరు, పట్నంబజారు: గుంటూరు నగరంలో గురువారం తెల్లవారుజామున నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) అధికారులు సోదాలు నిర్వహించటం కలకలం రేపింది. కేంద్ర బలగాలు, ఈస్ట్ సబ్ డివిజన్ పోలీసుల సహకారంతో 10 మంది అధికారులు రెండు బృందాలుగా విడిపోయి పాత్తూరివారి తోట, లాలాపేటలోని పాలాస్పత్రి సెంటర్, సంగడిగుంట, పొన్నూరు రోడ్డు, పాతగుంటూరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే లాలాపేట పాలాస్పత్రి సెంటర్‌లోని పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. పీఎఫ్ఐ నేతలకు సమాచారమిచ్చిన ఎన్ఐఏ అధికారులు వారు వచ్చేలోపే తాళాలు పగలగొట్టి కార్యాలయంలోకి వెళ్లి సోదాలు నిర్వహించారు. అయితే అక్కడ ఏదైనా ఆధారాలు సేకరించారా.. లేదా అనేది వెల్లడి కావాల్సి ఉంది. అదే ప్రాంతంలో సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) కార్యాలయంలోనూ సోదాలు నిర్వహించినట్లు సమాచారం.

అదుపులో ఉన్నది వీరే...
దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో నలుగురిని ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కొద్ది రోజుల



అబ్దుల్‌వహీద్‌ను అదుపులోకి తీసుకుని వెళ్తున్న ఎన్ఐఏ అధికారులు

క్రితం నిజామాబాద్‌లో అరెస్ట్ అయిన కరాటే మాస్టర్ ఖాదర్ వద్ద దొరికిన పలు ఆధారాల నేపథ్యంలో వీరిని అదుపులోకి తీసుకున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. పొన్నూరు రోడ్డులోని ఆంధ్రా ముస్లిం కళాశాల సమీపంలో స్పేర్‌పార్ట్స్, డ్రైఫ్రూట్స్ వ్యాపారం చేసే పఠాన్ జఫ్రుల్లాఖాన్, పాతగుంటూరు పరిధిలోని గొలుసు కొండలరావు నగర్‌కు చెందిన అబ్దుల్‌వహీద్, సంగడిగుంటకు చెందిన షేక్ రియాజ్, కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత్తూరివారితోటలో జేకే పచ్చళ్ల పేరుతో వ్యాపారం చేసే షేక్ రహీమ్‌ను ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో జఫ్రుల్లాఖాన్ గతంలో పీఎఫ్ఐలో సభ్యుడిగా కొనసాగారు. అబ్దుల్ వహీద్ ప్రస్తుతం ఎస్‌డీపీఐ సభ్యుడిగా ఉన్నారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో ఎస్‌డీపీఐ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేశారని అతని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. షేక్ రియాజ్ ప్రస్తుతం ఎస్‌డీపీఐ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఈయన ఆటోనగర్‌లో స్పేర్‌పార్ట్స్ బిజినెస్ చేస్తున్నారు. షేక్ రహీం పీఎఫ్ఐ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఈ నలుగురి నివాసాల్లోనూ సోదాలు జరిగాయి. బుధవారం అర్ధరాత్రి 2 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు భారీ భద్రత నడుమ ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించారని సమాచారం.

నోటీసులు జారీ

నలుగురిని అదుపులోకి తీసుకున్న ఎన్ఐఏ అధికారులు పీఎఫ్ఐ, ఎస్‌డీపీఐ నేతలు పలువురికి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 29న హైదరాబాద్‌కు విచారణ నిమిత్తం హాజరు కావాలని అందులో పొందు పరిచారు. పీఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ యూసూఫ్‌తోపాటు మరికొంత మందికి ఈ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా పీఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు యూసూఫ్ మీడియాతో మాట్లాడుతూ అర్ధరాత్రి వేళ అమాయకులపై దాడులు చేయటం, సోదాలు నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సామాన్యులపై దాడులు సరికాదని, కావాలనే అక్రమంగా సోదాలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ఒత్తిడికి తలొగ్గే.. తమపై దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎటువంటి విచారణకైనా తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

గుంటూరు జీజీహెచ్‌లో లివర్ బయాప్సీ

గుంటూరు మెడికల్: రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా గుంటూరు జీజీహెచ్‌లో లివర్ బయాప్సీ చేశారు. దీర్ఘకాలిక లివర్‌సమస్యతో చికిత్సకు వచ్చిన గుంటూరు రూరల్ మండలం గోరంట్లకు చెందిన 28 ఏళ్ల త్రివేణికి గురువారం గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు లివర్ బయాప్సీ చేశారు. కోత, కుట్టు లేకుండా ఎండోస్కోపి ద్వారా లివర్‌లో ముక్కను తీసి పరీక్ష కోసం పంపించినట్లు గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషా తెలిపారు. లివర్ సమస్య ఎందుకు వచ్చిందనే విషయాన్ని కనుగొనేందుకు లివర్ బయాప్సీని కేవలం పదినిమిషాల వ్యవధిలో జీజీహెచ్‌లో చేశామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో లివర్ బయాప్సీ ఎక్కడా చేయడం లేదని, మొట్టమొదటిసారిగా గుంటూరులో తామే చేసినట్లు వెల్లడించారు. బయాప్సీ చేసిన అనంతరం రెండు రోజుల్లో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేస్తామని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ జగన్‌మోహన్ తెలిపారు.

ఆలోచనే పదివేలు!

చిన్నారి సైంటిస్టులకు ఆహ్వానం
- ఇన్‌స్పైర్ మనాక్‌తో విద్యార్థుల సృజనకు పదును
- ప్రాజెక్ట్ ఎంపికైతే రూ.10 వేలు ప్రోత్సాహక బహుమతి
- జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం
- చదువు పూర్తయ్యేంత వరకు ఉపకార వేతనం
- దరఖాస్తులకు ఈ నెల 30 వరకు గడువు

మచిలీపట్నం: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను విజ్ఞాన, శాస్త్ర సాంకేతిక రంగాల వైపు మళ్లించేలా ప్రభుత్వం తోడ్పాటునందిస్తోంది. ఈ నేపథ్యంలోనే 'ఇన్‌స్పైర్ మనాక్ అవార్డ్స్' పేరిట ఏటా రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలను నిర్వహిస్తోంది. అందులో భాగంగానే 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి సైన్స్ ప్రాజెక్టులకు ఆహ్వానం పలుకుతోంది. ఈ నెల 30 వరకు దరఖాస్తుకు గడువు ఉండటంతో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నింటి నుంచి నామినేషన్లు వచ్చేలా విద్యాశాఖాధికారులు దృష్టి పెట్టారు.

ఎంపికైతే ప్రోత్సాహకం..
జిల్లాలోని ప్రభుత్వ ఆధ్వర్యంలోని అన్ని యాజమాన్యాల పరిధిలో గల పాఠశాలలతో పాటు, ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు సైతం ఇన్‌స్పైర్ అవార్డ్స్ కోసం తమ ఆలోచనలను పంపించవచ్చు. ఎంపికైన ప్రాజెక్టులకు ప్రభుత్వం రూ. 10 వేలు ప్రోత్సాహక బహుమతి అందజేస్తోంది. ఈ డబ్బులతో వారి ఆలోచనలకు ప్రతిరూపం ఇచ్చేలా ప్రాజెక్టులను సిద్ధం చేసి, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. 6 నుంచి 10వ తరగతి వరకు, 10 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు దీనిలో పాల్గొనవచ్చు. ప్రతి పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



ఈ ఏడాది జాతీయ స్థాయిలో పోటీల్లో ప్రదర్శించిన ప్రాజెక్టు

మేధోశక్తికి పదును పెట్టేలా..
సృజనాత్మకత, నూతనత్వంతో కూడిన పర్యావరణ హితమైన, సామాజిక, సమస్యలకు పరిష్కారం సూచించే విధంగా విద్యార్థులు తమ మేధోశక్తిని రంగరించి చక్కటి ఆలోచన చెప్పాలి. దానిని డ్రాఫ్ట్ రూపంలో తీర్చిదిద్ది ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్ వెబ్‌సైట్‌లో జిల్లా అధికారులకు అప్‌లోడ్ చేయాలి. ఇదే సమయంలో విద్యార్థి పేరు, పాఠశాల, యూడైస్ కోడ్, రెవెన్యూ డివిజన్, జిల్లా, విద్యార్థి బ్యాంకు అకౌంట్ నంబర్‌ను వెబ్ సైట్‌లో పొందుపరచాలి.

ప్రయోజనాలివి..
- సైన్స్ సంబంధిత పరిశోధనల వైపు మళ్లించేలా ఏటా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మనాక్ జాతీయ స్థాయి పోటీల్లో విజేతలైతే.. వారు అరుదైన అవకాశాలు సొంతం చేసుకోవచ్చు.
- జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రాజెక్టు ఎంపికైతే రూ.20 వేలు నగదు ప్రోత్సాహకంతో పాటు, దేశవ్యాప్తంగా అత్యున్నత స్థాయి యూనివర్సిటీల్లో చదువుకునేందుకు సీట్లలో ప్రత్యేక కోటా ఉంటుంది.
- అంతర్జాతీయ స్థాయికి వెళ్తే.. విద్యార్థి చేసిన ప్రాజెక్టుకు పేటెంట్ హక్కులు కల్పించి, దానిని ఏదైనా సంస్థ అభివృద్ధి చేస్తుంది. తద్వారా విద్యార్థుల చదువులు పూర్తి అయ్యేంత వరకు ప్రభుత్వం ఉపకార వేతనం అందజేస్తుంది.

గత మూడేళ్లలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఇలా..

సంవత్సరం	నమోదైన ప్రాజెక్టులు	ఎంపికైన ప్రాజెక్టులు
2019-20	3,819	701
2020-21	3,134	401
2021-22	3,530	376

ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలి..



ఇన్‌స్పైర్ అవార్డ్స్‌లో ఎక్కువ మంది విద్యార్థులు భాగస్వామ్యులు అయ్యేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలి. ఆఖరి వరకు వేచి చూడకుండా ముందుగానే ఆన్‌లైన్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేయాలి. ప్రతి స్కూల్ నుంచి నమోదు తప్పనిసరిగా ఉండాలి. దీనిపై సైన్స్ ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి.
– తాహెరా సుల్తానా, నోడల్ అధికారి, ఉమ్మడి కృష్ణా జిల్లా

విజేతగా నిలిచేలా తర్ఫీదు..



ఈ సారి జాతీయ స్థాయిలో విజేతగా నిలిచేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. ఇందకోసం నమోదు నాటి నుంచే విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చేలా కార్యాచరణ సిద్ధం చేశాం. ఈ సారి నమోదులో ప్రతి ఒక్కరూ పాస్‌వర్డ్‌ను ఏర్పాటు చేసుకోవాలి. భవిష్యత్ లావాదేవీలన్నీ దాని ద్వారానే జరుగుతాయి.
– మైనం హుస్సేన్, జిల్లా సైన్సు అధికారి, ఎన్టీఆర్ జిల్లా

రైల్వే టికెట్ చెకింగ్ సిబ్బందికి రివార్డులు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లోని కమర్షియల్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు ఉద్యోగులు అత్యుత్తమ పనితీరుకుగానూ అవార్డులు అందుకున్నారు. గత ఆగస్టు నెలలో కమర్షియల్ విభాగంలోని చెకింగ్ సిబ్బంది డివిజన్ వ్యాప్తంగా 66,998 కేసులు నమోదు చేయడం ద్వారా రికార్డు స్థాయిలో రూ. 4.89 కోట్ల ఆదాయం సమకూరింది. అందులో అత్యుత్తమ పనితీరు చూపిన సీటీఐ విశ్వనాథ్‌కుమార్, టీటీఈలు ఎన్. కృష్ణమూర్తి,



సిబ్బందికి అవార్డులు అందజేస్తున్న సీనియర్ డీసీఎం రాంబాబు, డీసీఎం కిరణ్‌కుమార్

ఎంకే బాబు, కె. సూర్యవాసవి, ఏ.సురేష్‌లకు గురువారం డీఆర్ఎం కార్యాలయంలో సీనియర్ డీసీఎం రాంబాబు, డీసీఎం ఎస్.కిరణ్‌కుమార్‌లతో కలసి వ్యక్తిగత మెరిట్ సర్టిఫికెట్‌లతో పాటు రికార్డు స్థాయిలో ఆదాయం సమకూర్చినందుకు ప్రత్యేక అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ డీసీఎం మాట్లాడుతూ విధుల్లో ప్రతిభ కనబర్చిన సిబ్బందికి ఇటువంటి అవార్డులు అందించడం ద్వారా మరింత మెరుగైన పనితీరుతో విధులు నిర్వర్తిస్తారని అన్నారు.

బీజేపీ పాలనకు చరమ గీతం పాడాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ.. ప్రజలపై భారాలు మోపుతున్న బీజేపీ మోదీ పాలనకు చరమ గీతం పాడేందుకు కలిసి కట్టుగా పోరాటం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం గొల్లపూడిలోని మహాత్మాగాంధీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో జరిగిన ముఠా కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలను పెంచుతూ పేదల నడ్డివిరగకొట్టే కేంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 24న గాంధీనగర్ జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించనున్న దేశ రక్షణ భేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ ప్రజల మధ్య చిచ్చుపెట్టే బీజేపీ మతోన్మాద విధానాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, దోనేపూడి కాశీనాథ్, బోయి సత్యబాబు, ముఠా కార్మిక సంఘ నాయకులు ఎం. సీతారాములు, బ్రహ్మయ్య, రోశయ్య, గురవారెడ్డి, ఈవీ నారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.



Flipkart
THE BIG BILLION DAYS
23rd to 30th September
Powered by NOISE
Associate Sponsors ASUS | POCO
Credit & Debit Card Partners* ICICI Bank Festive Bonanza
AXIS BANK
10% Instant Discount
Paytm 10% Assured Savings on Paytm Transactions
లక్షలాదిమంది విక్రేతలు, చేతి వృత్తులవారు మరియు బ్రాండ్ల భాగస్వామ్యంతో
Flipkart Axis Bank Credit Card 8% Instant Discount + 5% Cashback*
Flipkart Pay Later Instant Credit | No Cost EMIs* Up to Rs. 1000* Off on 1st transaction
MOBILES
realme C30 (2GB | 32GB) ₹8,499 ₹5,799*
Infinix HOT 12 Play (4GB | 64GB) ₹11,999 ₹7,199*
OPPO K10 (6GB | 128GB) ₹18,999 ₹11,990*
Samsung Galaxy S22+ 5G (8GB | 128GB) ₹1,01,999 ₹59,999*
iPhone 11 (64GB) ₹43,900 ₹34,990*
realme C35 (4GB | 64GB) ₹13,999 ₹9,999*
vivo T1x (4GB | 64GB) ₹16,990 ₹9,999*
POCO M4 Pro (6GB | 64GB) ₹17,999 ₹9,749*
POCO X4 Pro 5G (6GB | 64GB) ₹22,999 ₹13,999*
POCO C31 (3GB | 32GB) ₹10,999 ₹5,999*
Redmi 10 (4GB | 64GB) ₹14,999 ₹7,999*
Samsung Galaxy F23 5G (4GB | 128GB) ₹22,999 ₹10,999*
realme 9i 5G (4GB | 64GB) ₹17,999 ₹10,999*
Samsung Galaxy F13 (4GB | 64GB) ₹14,999 ₹8,499*
realme C33 (3GB | 32GB) ₹11,999 ₹7,999*
moto g62 5G (6GB | 128GB) ₹21,999 ₹14,499*
*All offers are sponsored by participating sellers/brands/banks, prices include all event offers. T&C apply.
LARGE APPLIANCES
realme TechLife Semi-Automatics 7 Kg | 8.5 Kg ₹12,490 ₹6,921** | ₹18,990 ₹9,441**
Crompton Instant Geyser 3L ₹4,062 ₹2,399*
Vu 4K GloLED TVs 126cm (50) | 164cm (65) ₹55,000 ₹32,999* | ₹85,000 ₹54,999*
realme Smart TVs 100cm (40) HD | 139cm (55) SLED ₹31,990 ₹16,999* | ₹60,990 ₹34,999*
Mi Smart TVs 80cm (32) HD | 125.7cm (50) 4K ₹24,999 ₹10,999* | ₹44,999 ₹29,999*
MarQ side-by-side Refrigerators 468L | 560L ₹64,990 ₹35,490** | ₹65,900 ₹46,490**
LG 1.5 ton Inverter ACs 5 Star | 3 Star ₹75,990 | ₹60,990 Up to 50% Off**
Samsung Top Loads 6.5 kg | 8 kg (Inverter) ₹16,800 ₹14,290* | ₹20,500 ₹19,990*
iFFALCON Smart TVs 80cm (32) HD | 108cm (43) 4K UHD ₹26,990 ₹8,999* | ₹47,990 ₹18,999*
Aquaguard UV Water Purifier with Copper Technology ₹22,000 ₹11,999*
**All offers are sponsored by participating sellers/brands/banks, prices include all event offers. T&C apply.
ELECTRONICS
ASUS Vivobook Intel Core i3 | 512 GB SSD ₹45,990 ₹27,990*
Lenovo IdeaPad Gaming Intel Core i5 | GTX 1650 ₹76,890 ₹46,990*
boAt Rockerz 235v2 Fast Charging ₹2,990 ₹699*
Fire-Boltt Ninja Pro Max Smartwatch ₹5,999 ₹1,499*
Samsung Galaxy Tab A8 ₹21,599 ₹8,999*
Vega 3-in-1 Hair Styler ₹1,099 ₹999*
Wings Phantom Gaming TWS Earbuds ₹4,999 ₹799*
Samsung 22 inch IPS monitor ₹11,290 ₹7,999*
Noise Icon Buzz BT Calling Smartwatch ₹4,999 ₹1,499*
Seagate Spider-Man Special Edition External Hard Disk ₹9,499 ₹5,999*
FASHION
Raymond Men's Formal Shirts, Trousers & more Min 30% Off Min 65% Off*
U.S. POLO ASSN. T-Shirts, Shirts & Jeans Under ₹1,599 Under ₹699*
TOKYO TALKIES Dresses, Tops & more Min 30% Off Min 60% Off*
HRX Women's Shoes, Sandals & more Min 30% Off Min 60% Off*
PUMA Men's Shoes, Sandals & more Min 40% Off Min 60% Off*
aurelia Sarees, Kurtas & more ₹299 ₹149*
Paragon Shoes, Sandals & Slippers ₹349 ₹99*
Kids' Fashion ₹299 ₹99*
FOSSIL Watches, Eyewear & Wallets ₹999 ₹499*
safari Luggage & Bags Min 40% Off Min 70% Off*
CRAZY DEALS
Bestselling Kurtis ₹599 ₹149*
Havells 1.5L Kettle ₹2,747 ₹1,399*
Nerf Disruptor Elite Blaster Slam Fire Gun ₹1,399 ₹799*
PUMA Shoes ₹2,999 ₹1,199*
BEAUTY, SPORTS & FITNESS, TOYS AND MORE
Nerf, Parker & more Up to 30% Off Min 50% Off*
Bestselling Cycles ₹6,499 From ₹3,999*
Car & Bike Accessories From ₹199 From ₹49*
Parachute Hair Oil Min 15% Off Min 30% Off*
Bombay Shaving Company Red Spice & Black Vibe Deodorant Spray From ₹299 From ₹99*
Horlicks Chocolate Delight Min 5% Off Min 20% Off*
HOME & FURNITURE
Spray Paints Asian Paints, Abro & more From ₹349 From ₹99*
Opalware 18 Pc Dinner Sets Cello, La Opala & more ₹1,899 ₹999*
Premium Double Bedsheets Raymond, Trident & more Starting ₹1,299 ₹499*
Wall Stickers, Wall Clocks & other Decor Flipkart SmartBuy, Ajanta & more From ₹499 From ₹99*
Orthopaedic Mattresses Sleepyhead, SleepyCat & more ₹12,999 ₹5,990*
3 Seater Sofa Cum Bed 3yr Warranty, 3 Reclining Positions ₹10,999 ₹6,999*
THE BIG BILLION DAYS Specials
realme C30s 2 GB | 32 GB ₹8,999 ₹6,250*
NIVEA Moisturizers BBD Specials Combo Min 40% Off*
Ranveer Singh Set Wet Men's Styling Kit Min 35% Off*
Pond's Men Skincare Range Min 40% Off*
Dove Anti-Dandruff Shampoo Min 40% Off*
SRK signed Gift Sets Flat 40% Off*
Puresense Exclusive Gift Sets Flat 60% Off*
Lakme Ananya's Eye Kit Flat 50% Off*
Peter England 25 Yrs Celebration Up to 50% Off*
Tokyo Talkies Influencer Selection Min 70% Off*
Samsung Galaxy Watch 5 Sapphire Crystal Disp. Starting ₹18,249*
Amazfit GTR 4 Anti-glare Disp. | 14 Day batt. Starting ₹15,299*
TICK TOCK DEALS
Ambrane Wise 1.69" Calling Smartwatch ₹4,999 ₹999* 23rd Sep, 4 PM
Juicer, Mixer & Grinders ₹3,049 ₹849* 23rd Sep, 3 PM
Premium Cashews 500g ₹650 ₹349* 25th Sep, 2 PM
Top Selling Branded Dresses ₹1,299 ₹249* 23rd Sep, 2 PM
GROCERY
Aashirvaad Multigrain Atta (5kg) 25% Off*
Californian Almonds (1kg) 50% Off*
Tata Tea Gold (750g) 45% Off*
Surf Excel Detergent Powders (2kg) 35% Off*
SuperCoin Get up to 90% Off* with your SuperCoins
Flipkart Plus Get 24 hr. Early Access, blockbuster deals & up to 1 Cr*. worth of freebies
Flipkart Travel Hotels starting at just ₹199# Flights starting at just ₹999#
NEW Medicines on Flipkart Get Minimum 30% + 10% OFF^ On First Medicine Order